www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 266 | శనివారం | 17 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

త్వరలో కొత్త రేషన్ కార్డులు

• మీ సేవ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు



మన తెలంగాణ/ హైదరాబాద్ : కొత్తగా రేషన్ కార్డులు కావాలనుకునే ఆశావహులకు శుభవార్త. రేషన్ కార్డు పొందేందుకు అర్హతలు కలిగి ఉండి,ఇప్పటివరకు కార్డులు లేనివారికి కొత్త కార్డులు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 'మీ–సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలించి కార్డుల జారీకి తగిన అర్హత ఉన్నట్లు సంబంధిత అధికారులు నిర్ధారించిన తర్వాత కొత్త కార్డులను తరువాయి 6లో



అక్రమిస్తే అంతుచూస్తాం

చట్టవిరుద్ధ మైనింగ్‌పై క్రిమినల్ కేసులు : మంత్రి కెటిఆర్ ఆదేశాలు

477 రద్దు గని లీజులు

- లైసెన్స్‌లు తీసుకొని పని మొదలు పెట్టనందుకు చర్య
- త్వరలో దేశంలోనే అత్యుత్తమమైన మైనింగ్ పాలసీ
- రాతి ఇసుక వినియోగం పెంచాలని హితవు
- భవిష్యత్తులో మైనింగ్ లీజులకు గ్లోబల్ టెండర్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో గనులు లీజుకు తీసుకుని కార్యకలాపాలు నిర్వహించని 477 సంస్థల లీజులను రద్దు చేసినట్లు గనుల శాఖమంత్రి కె.టి. రామారావు తెలిపారు. ఎక్కడ అక్రమ మైనింగ్ జరిగినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్‌ను సహించేంది లేదని, ఎంతటివారైనా ఒత్తిడికి గురి కావద్దని అధికారులకు స్పష్టం చేశారు. గనులశాఖ కార్యకలాపాలు, మైనింగ్ లీజులు, బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. గనులశాఖ డైరెక్టర్ సుశీల్ కుమార్, ఖనిజాభివృద్ధి సంస్థ ఎండి మల్సూర్, గనులశాఖ ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో గనుల శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించు తరువాయి 6లో

అంకె తప్పకుండా..

విపక్షాలపై గణాంకాయుధం



మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్షేమ బడ్జెట్‌ను, వ్యవసాయానికి ఊతమిచ్చేలా పథకాలను పేర్కొన్నా విపక్షాల నుంచి విమర్శలు వస్తుండడంతో వాటిలోని వాస్తవాన్ని, శాస్త్రీయతను అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వివిధ ద్రవ్య సంస్థల నుంచి అప్పులు చేయడం మొదలు పథకాలకు చేసిన కేటాయింపులు, వాటి అమలుకు అనుసరించాల్సిన విధానం తదితరాలపై విపక్షాల విమర్శలకు దీటైన సమాధానం చెప్పేందుకు సిఎం కసరత్తు చేస్తున్నారు. రాజకీయ విమర్శలకు సమాధానం చెప్పడానికి బదులుగా అసెంబ్లీ వేదికగానే విమర్శల్లోని బండారాన్ని బట్టబయలు చేయాలనుకుంటున్నారు. అందులో భాగంగా ఆర్థికశాఖ అధికారులతో ప్రగతిభవన్‌లో సిఎం ఐదు గంటల పాటు సమావేశమై అనేక ఆర్థిక అంశాలపై చర్చించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రాబోయే రోజుల్లో అమలయ్యే పథకాల గురించీ, ఇప్పుడు చేస్తున్న విమర్శల గురించీ చర్చించగా మరోసారి ఇలాంటి విమర్శలకు ఆస్కారం లేని తీరులో లోతైన వివరణ ఇవ్వడంపై చర్చించారు. వాస్తవిక గణాంకాలను ప్రస్తావిస్తూ విమర్శలకు తరువాయి 6లో

హోదాపై అవిశ్వాస గోదా

మోడీ ప్రభుత్వంపై టిడిపి, వైఎస్ఆర్‌సిపి అవిశ్వాస తీర్మాన నోటీసులు, ఎన్‌డిఎకి టిడిపి రాంరాం 6

తలసరి రాబడిలో 3వ స్థానం

ఢిల్లీ, హర్యానాల తరువాత తెలంగాణ


రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా ఫస్ట్



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలినాళ్ళ నుంచీ జిఎస్‌డిపి (రాష్ట్ర జిడిపి)లో గానీ, తలసరి ఆదాయంలో గానీ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు లభించింది. రాష్ట్రం ఏర్పడడానికి పూర్వం 2011–12లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 91,121 ఉంటే రాష్ట్రం ఏర్పడే నాటికి రూ. 1,24,104కు చేరుకుంది. అప్పటి నుంచి ప్రతి ఏటా వృద్ధి నమోదవుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,75,534కు చేరుకుంది. ప్రస్తుత ధరల సూచీ ప్రకారం తలసరి ఆదాయం ఈ తరహాలో నమోదైతే ప్రామాణిక సంవత్సరం (2011–12)తో పోలిస్తే రూ. 1,12,764గా ఉంది. రాష్ట్రం ఏర్పడే నాటికి ఇది రూ. 86,647 మాత్రమే. ప్రస్తుత ధరల సూచీ ప్రకారం తలసరి ఆదాయాన్ని లెక్కిస్తే ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల తర్వాతి స్థానం తెలంగాణదే. చిన్న రాష్ట్రాలైన సిక్కిం, పుదుచ్చేరి, గోవా లాంటివి జనాభా తక్కువ కావడం, కేంద్రం నుంచి 90 శాతం నిధులు లభిస్తుండడంతో వాటి తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ చాలా ముందు వరుసలో ఉంది. మూడేళ్లుగా ఇదే ఒరవడి కొనసాగుతుంది. 2016–17 ఆర్థిక సంవత్సర గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.1,54,734 కాగా, అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ఇది రూ.3,68,747, తరువాయి 6లో

దలేర్ మెహిందీకి రెండేళ్లు శిక్ష 10

• విదేశాలకు దొడ్డిదారిలో మనుషుల చేరవేత కేసులో పాటియాల కోర్టు తీర్పు



ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య 3

• ఇద్దరు పిల్లలకు విషమిచ్చి దంపతుల బలవన్మరణం • ఆర్థిక ఇబ్బందులే కారణం?

ఈ ఏడాది సాధారణ వర్షపాతమే

• భారత వాతావరణ శాఖ వెల్లడి 3

కుంచెపోటు



ఓడి పోయినప్పుడు మమ్మల్ని తిడతారు, గెలిచినా నెపం మీదేనా..?

కులపత్రం ఇవ్వలేదని దాడి

తహసీల్దార్ కార్యాలయంలో ఐదుగురికి గాయాలు

హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లో ఘటన

నేడు రెవెన్యూ సిబ్బంది విధుల బహిష్కరణ



మన తెలంగాణ/ హైదరాబాద్ / కార్వాన్ : కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలేదన్న కోపంతో ఆసిఫ్‌నగర్ తహసీల్దారు కార్యాలయం సిబ్బందిపై మల్లేపల్లి మాంగార్ బస్తీకి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. హుమాయన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి విజయనగర్ కాలనీలోని ఆసిఫ్‌నగర్ తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మల్లేపల్లి మాంగార్‌బస్తీకి చెందిన బిజెపి నాయకుడు నరేన్ మరో ఇద్దరితో కలిసి తన సోదరి కుల ధ్రువీకరణ పత్రం కోసం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయానికి వచ్చాడు. విఆర్‌ఓ జగన్‌ని కలిసి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరాడు. అవసరమైన పత్రాలు సమర్పించకపోవడంతో పెండింగ్‌లో పెట్టామని విఆర్‌ఓ చెప్పడంతో కోపోద్రిక్తుడైన నరేన్ జగన్‌తో వాగ్వాదానికి దిగాడు. తానేమీ చేయలేనని తహసీల్దారును కలవమని నరేన్‌కు చెప్పాడు. ఈ నేపథ్యంలో తహసీల్దారు వద్దకు వెళ్లి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని అడిగాడు. ఆయన కూడా విఆర్‌ఓ చెప్పిన కారణమే చెప్పడంతో నరేన్ తహసీల్దారుతో పాటు కార్యాలయంలోని సిబ్బందితో దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగాడు. అనంతరం మాంగార్‌బస్తీలోని తన సహచరులకు తరువాయి 6లో

వర్గీకరణపై 20 నుంచి దీక్షలు



మన తెలంగాణ/హైదరాబాద్: అబద్ధాలు ఆడేందుకు, ప్రశ్నించినవారిని బెదిరించేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అసెంబ్లీ ఒక అడ్డాగా మారిందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. కెసిఆర్ ఒక అబద్ధాల పుట్ట అని, ఆయన మనస్తత్వం అబద్ధాలకు, మోసాలకు పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యమాన్ని అణచివేయడమే కాదు, భవిష్యత్తులో కూడా అణచివేస్తామని కెసిఆర్ మాట్లాడడం ఆయన అహంకారానికి, బెదిరింపులకు నిదర్శనమన్నారు. ఈ నెల 20 నుంచి జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, దీక్షలు రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్, పార్శిగుట్టలోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఢిల్లీ కేంద్రంగా ఈ నెల 21న నుంచి దీక్షలు, ధర్నాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అప్పటికీ బిజెపి స్పందించకపోతే ఎస్‌సి వర్గీకరణ కోరుతున్న అన్ని రాష్ట్రాల ప్రజలను ఏకం చేస్తామని, వర్గీకరణకు మద్దతు పలికే శక్తులను ఏకంచేసి రాజకీయ పోరాటానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ప్రత్యేక హోదాపై ఎపికి చెందిన ఎంపిలు, రిజర్వేషన్ కోటా పెంపు కోసం తెలంగాణ ఎంపిలు పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్న వారు, ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని కూడా ప్రస్తావించాలని డిమాండ్ చేశారు.

కళాశాలకు గుర్తింపు ఉందా..?

- ముందుగానే చూసుకోవాలి
- ముందస్తు ప్రవేశాలతో మొదటికే మోసం
- వెబ్‌సైట్‌లో కళాశాలల జాబితాను పొందుపరచనున్న ఇంటర్ బోర్డ్



మన తెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేయకముందే ఏవైనా కళాశాలలు అడ్మిషన్ ప్రక్రియ చేపడితే అప్రమత్తంగా ఉండాలని ఇంటర్ బోర్డు సూచించింది. కళాశాలలకు గుర్తింపు ఉందో లేదో నిర్ధారణ అయిన తర్వాతనే చేరాల్సిందిగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బోర్డు అధికారులు సూచనలు చేశారు. కళాశాల గుర్తింపు గురించి తెలియకుండానే చేరినట్లయితే ఒక సంవత్సర కాలం పాటు చదివి తీరా పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఇబ్బందులు ఏర్పడినట్లయితే విద్యార్థుల సమయం వృథా కావడంతో పాటు తల్లిదండ్రులకు కూడా ఆందోళన కలుగుతుందని, అందువల్ల కోర్సుల్లో చేరడానికి ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ జారీచేసేంత వరకు వేచి ఉండాలని, ఒత్తిడికి తలొగ్గి ముందుగానే చేరాలనే నిర్ణయం తీసుకోవద్దని స్పష్టం చేశారు. గుర్తింపులేని కళాశాలలు,రెన్యూవల్ చేసుకోని కళాశాలలు కూడా ప్రవేశాలు చేపడుతున్నందువల్ల తీరా పరీక్ష సమయంలో ఇబ్బందికి గురికావద్దన్న ఉద్దేశంతోనే బోర్డు అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నారు.

మరో శ్రీవాసవి అయితే : గతేడాది వనస్థలిపురంలోని శ్రీవాసవి కళాశాలకు ఇంటర్ బోర్డ్ అనుబంధ గుర్తింపు ఇవ్వకపోయినా ఆ కళాశాల యాజమాన్యం ప్రవేశాలు చేపట్టి ఏడాదంతా తరగతులు నిర్వహించింది. ఈ కళాశాలకు గుర్తింపు లేకపోవడంతో ఇంటర్ బోర్డు నుంచి విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ కాలేదు. దీంతో ఆ విద్యార్థులు ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరుకాలేకపోయారు. తర్వాత అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. దాంతో ఆ విద్యార్థులు మంచి మార్కులు సాధించినా సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైనట్లుగా పరిగణించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఇలాంటివి పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతోనే ఈసారి ఇంటర్ బోర్డు ముందుగానే అప్రమత్తం చేస్తోంది. ప్రవేశాలు ప్రారంభం కావడానికి ముందుగానే గుర్తింపు పొందిన కళాశాలల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఇంటర్ బోర్డ్ నిర్ణయించింది. తల్లిదండ్రులు తమ పిల్లల ను చేర్పించాలనుకున్న కళాశాలకు గుర్తింపు ఉందో లేదో ముందుగానే వెబ్‌సైట్‌లో చెక్ చేసుకుని తర్వాతనే ప్రవేశం తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆన్‌లైన్ ప్రవేశాలపై వెనుకడుగు ఎందుకు..? : ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని గత ఏడాది విద్యాశాఖ ప్రకటించినా చివరి నిమిషంలో వెనుకడుగు వేసింది. కార్పొరేట్ కళాశాలల ఒత్తిడి వల్లనే ఆన్‌లైన్ ప్రవేశాలకు బ్రేక్ పడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే కేవలం గుర్తింపు ఉన్న కళాశాలలే వెబ్‌సైట్‌లో దర్శనమిస్తాయి. ఇతర కళాశాలల వివరాలు ఉండవు కాబట్టి విద్యార్థులు కచ్చితంగా గుర్తింపు ఉన్న కళాశాలల్లో ఒక కళాశాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే సీట్లు కేటాయింపు జరుగుతుంది. ఏ విద్యార్థికి ఎక్కడ సీటు వస్తుందో కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. దాంతో ఎవరైనా ముందుగా సీటు రిజర్వు చేసుకున్నా ఆ కళాశాలలో సీటు రాకపోతే యాజమాన్యాలు తీసుకున్న ఫీజు తిరిగి ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ కారణంగానే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ అమలు కాకుండా కార్పోరేట్ శక్తులు అడ్డుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సింహభాగం విదేశీ మద్యందే



మన తెలంగాణ / హైదరాబాద్ : రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఎక్సైజ్ విభాగం ద్వారా ప్రభుత్వం రూ.10,600 కోట్లను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది పెట్టుకున్న రూ. 9,000 కోట్ల లక్ష్యాన్ని కేవలం పది నెలల వ్యవధిలోనే సాధించినందువల్ల ఆ వృద్ధిరేటును దృష్టిలో పెట్టుకుని ఈసారి ప్రతిపాదనలను పెంచుకుంది. అయితే ఈ లక్ష్యంలో దాదాపు 80% ఆదాయం (రూ. 8,583 కోట్లు) విదేశీ (ఐఎంఎఫ్ఎల్ కలుపుకుని) మద్యం ద్వారానే సమకూర్చుకోనున్నట్లు ఈ విభాగం అంచనా వేసింది. విదేశీ మద్యం ఫీజు ద్వారా రూ. 3,418 కోట్లను, డ్యూటీ ద్వా రా రూ. 5,164 కోట్లను ఆర్జించనున్నట్లు అంచ నా వేసింది.గతేడాది నిర్దేశిత రూ.9000కోట్ల లక్ష్యంలో విదేశీ మద్యం ద్వారా రూ. 8,202 కోట్లను ఆర్జించాలని భావించింది. సవరించిన అంచనాలు కూడా తొలుత అంచనాల ప్రకారమే ఉంది. మద్యం దుకాణాల అద్దెల ద్వారా రూ. 21.33 కోట్లు,బీర్ ద్వారా రూ. 1,430 కోట్లను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది బీర్ల విక్రయం ద్వారా రూ. 407 కోట్లను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోగా ఈసారి మాత్రం దాదాపు మూడింతలు ఎక్కువగా ఆర్జించాలని భావిస్తోంది. గతేడాది తరహాలోనే రానున్న ఆర్థిక సంవత్సరంలో సైతం మొత్తం లక్ష్యాన్ని పది నెలల్లోనే సమకూర్చుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని ఎక్సైజ్ శాఖ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 201617 ఆర్థిక సంవత్సరంలో మద్యం ఆదాయం కేవలం రూ. 5,580 కోట్లుకాగా ఆ తర్వాతి సంవత్సరానికి రెండున్నర వేల కోట్లు పెరగ్గా ఈసారి మరో రూ. 1500 కోట్లు పెరగవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రభుత్వం నిర్దేశించి న నిబంధనలను ఉల్లంఘించినట్లయితే జరిమానాలను కూడా వసూలు చేస్తున్న ఎక్సయిజ్ వి భాగం రానున్న ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 15 కోట్లను ఆర్జించాలని భావిస్తోంది. గతేడాది ఇది రూ. 13 కోట్లుగా ఉంది. ఉల్లంఘనలకు పాల్పడితే వెంటనే వినియోగదారులు ఫిర్యా దు చేయడానికి ఆధునిక పరిజ్ఞానాన్ని సైతం ఎక్సైజ్ శాఖ వినియోగిస్తోంది. మొబైల్ యాప్ ద్వారా అప్పటికప్పుడే నిర్దిష్ట దుకాణంపై ఫిర్యాదుచేసేలా సౌకర్యాన్ని కల్పించింది.

తెలంగాణలో బిజెపిదే అధికారం

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్



మన తెలంగాణ/ హైదరాబాద్: రాబోయే 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోనికి వస్తుందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అన్నారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయం శనివారం రాష్ట్ర పదాధికారుల, ఒబిసి మోర్చా, మీడియా కమిటీ, ఐటి, సోషల్ మీడియా విభాగాల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుందని, ఆ తర్వాత దక్షిణాది రాష్ట్రాలలో పెనుమార్పులు సంభవిస్తాయని చెప్పారు. ఎన్‌డిఎ నుంచి టిడిపి వెళ్లిపోయినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని, దాని ప్రభావం ఉండబోదన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్, బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి, ఎంఎల్‌ఎ చింతల రాంచంద్రారెడ్డి, ఎంఎల్‌సి ఎన్.రాంచందర్‌రావు, మాజీ ఎంఎల్‌ఎ బద్దంబాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చింతా సాంబ మూర్తి, ప్రేమేందర్ రెడ్డి జి.మనోహర్‌రెడ్డి,మంత్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం ఖమ్మం, వరంగల్ రూరల్ జిల్లాలో బూత్‌స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాల్లో అరుణ్‌సింగ్ పాల్గొననున్నారు.

రాష్ట్ర అప్పులే ఎక్కువా?



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే కూడా రాష్ట్రం లో ఉన్న అప్పులే ఎక్కువగా ఉన్నాయని బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో మసాలా తప్ప ఉప్పు, కారం లేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శుక్రవారం ఆయ న మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో రూ. 63 వేల కోట్ల అప్పు ఉంటే, ఇప్పుడు సుమారు రెండు లక్షల కోట్ల అప్పు పెరిగిందన్నారు. రాష్ట్ర అప్పులో ఒక వ్యక్తిపై రూ.63వేల అప్పు భారం పడుతోందని వివరించారు. జిహెచ్‌ఎంసికి బడ్జెట్‌లో తీవ్ర అన్యా యం జరిగిందన్నారు. రాష్ట్రంలో అత్యంత ఆదాయం వచ్చే గ్రేటర్ హైదరాబాద్‌కు ప్రభు త్వం కేవలం 5 శాతానికి మించి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు అన్యా యం జరిగిందన్నారు. రెండు పడక గదుల ఇళ్లకు ప్రభుత్వం అప్పులపై ఆధార పడుతోందని, రైతు పావలా వడ్డీ రుణాల రుణమాఫీ జరగలేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2900 కోట్లు ఉన్నాయన్నారు. బిసి సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పట్టించుకోలేదని, విశ్వవిద్యాలయాలపై సిఎంకి చిత్తశుద్ధి లేదన్నారు.

ట్రస్ట్ పరిధిలోకి వెల్‌నెస్ సెంటర్లు!



మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్లను మరింత పటిష్టం చేయనుంది. ఇందుకోసం నిధులను పెంచడంతో పాటు పటిష్ట నిర్వహణ కోసం అధికారులను, సిబ్బందిని నియమించేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విధి విధానాలకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పాత్రికేయులకు ప్రత్యేక పథకం కింద అందిస్తున్న వైద్య సేవలను ఇకపైన ప్రత్యేకంగా ఒక ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి దాని పరిధిలోకి తీసుకెళ్ళే దిశగా ఆలోచనలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని, వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను ఆరోగ్య శ్రీ ట్రస్టు నుంచి పూర్తిగా వేరు చేయాలన్న నిర్ణయం జరిగినట్లు తెలిసింది. వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా సీఈఓను నియమించినా కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ నామమాత్రంగానే జరుగుతోందని అధికారులు వివరించినట్లు తెలిసింది. వెల్‌నెస్ సెంటర్లపై కూడా ఆరోగ్య శ్రీ ట్రస్టు అధిపత్యం చెలాయిస్తోందన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్), జెహెచ్‌ఎస్ (జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్)ను త్వరలో ఒక ట్రస్టు కిందకు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి.

వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు నేపథ్యమిది : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా పన్నెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయగా ప్రస్తుతం హైదరాబాద్‌లో రెండు, వరంగల్, సిద్దిపేటలలో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నందున ఇంకా వినియోగంలోకి రాలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు ఓపీ (ఔట్‌పేషెంట్) సేవలు, వైద్య పరీక్షలతో పాటు మందులను కూడా ఈ పథకం కిందనే పొందుతున్నారు. వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ కోసం రూ.300 కోట్ల నిధులను కేటాయించింది. తగిన సంఖ్యలో అధికారులు, సిబ్బందిని కేటాయించకపోవడంతో ఈ సెంటర్ల బాధ్యతలను ఆరోగ్య శ్రీకు చెందిన అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్నారు. దీంతో ఆరోగ్య శ్రీ పెత్తనం నడుస్తోందన్న విమర్శలు వచ్చాయి. ఈ పథకం కింద ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులతో పాటు కుటుంబ సభ్యులు జనవరి నాటికి 88,158 మంది వివిధ రకాల శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. ప్రభుత్వం దాదాపు రూ.361 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. సుమారు 2,74 లక్షల మంది వివిధ రకాల చికిత్సలు, 9.70 లక్షల వైద్య పరీక్షలను కూడా చేయించుకున్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

మనతెలంగాణ/హైదరాబాద్: సిపిఎస్ అంశం కేంద్రం పరిధిలో ఉందని అసెంబ్లీ సాక్షిగా సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టిటిఎఫ్) ప్రధాన కార్యదర్శి ఇ.రఘునందన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

FORM A
బహిరంగ ప్రకటన
[Under Regulation 6 of the Insolvency and Bankruptcy Board of India (Insolvency Resolution Process for Corporate Persons) Regulations, 2016]
మెస్సర్స్: వైస్రాయి హోటల్స్ లిమిటెడ్ యొక్క రుణదాతలకు హెచ్చరిక

	సంబంధిత వివరములు	
1.	కార్పొరేట్ డెటార్ పేరు	మెస్సర్స్ వైస్రాయి హోటల్స్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ యొక్క ఇన్ కార్పొరేషన్ తేది	25 ఫిబ్రవరి, 1965
3.	కార్పొరేట్ డెటార్‌గా ఇన్ కార్పొరేటెడ్/ రిజిస్టర్డ్‌గా అధీకృత	రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు నంబర్	L55101TG1965PLC0010408
5.	కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా ఉంటే) చిరునామా	నమోదిత కార్యాలయం: ప్లాట్ నం. 20, సెక్టార్-1, సర్వే నం.64, 4వ అంతస్తు, హుడా టెక్నో ఎన్‌క్లేవ్ మాదాపూర్, హైదరాబాద్-500081
6.	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి దివాళా ప్రారంభ తేది:	12.03.2018 (IRP ద్వారా ఆర్డర్ కాపీ అందుకున్న తేది 16.03.2018)
7.	దివాలా తీర్మానం ప్రాసెస్ యొక్క ముగింపు తేది: అంచనాగా	07.09.2018
8.	మధ్యంతర తీర్మానం ప్రొఫెషనల్ యొక్క నమోదిత నంబరు, పేరు చిరునామా మరియు ఇ-మెయిల్ ఐడి	కరుచాల కోటేశ్వరరావు, కె కె రావు అండ్ అసోసియేట్స్, కాస్ట్ అకౌంటెంట్స్, 2-బి, సామ్రాట్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్, ఇ.నం. 5-9-12, ఎ.జి కార్యాలయం ఎదురుగా, సైఫాబాద్, హైదరాబాద్-500004, తెలంగాణ రాష్ట్రం, ఇండియా. ఇ-మెయిల్: kkraoirp@gmail.com, ఫోన్: 040-66842359 IBBI/IPA-003/IP-N00039/2017-18/10301
9.	ఫిర్యాదుల దాఖలు కొరకు ఆఖరి తేది	30.03.2018

ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ వారు మెస్సర్స్: వైస్రాయి హోటల్‌కు సంబంధించి కార్పొరేట్ ఇన్‌సాల్వేన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ యొక్క ప్రారంభ తేది: 12.03.2018గా ఉత్తర్వులు జారీచేసినారు. కావున మెస్సర్స్: వైస్రాయి హోటల్స్ లిమిటెడ్ వారి రుణదాతలను ఇందుమూలంగా కోరడమేమనగా వారి ఫిర్యాదులను తగిన ధృవీకరణలతో తేది: 30.03.2018న లేదా అంతకు ముందు పైన తెలిపిన ఐటం నం. 8లో తెలిపిన చిరునామాలోని మధ్యంత తీర్మాన ప్రొఫెషనల్‌కు దాఖలు చేయమని తెలపడమైనది.
ఆర్థిక రుణదాతలు వారి ఫిర్యాదుల ధృవీకరణను ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా మాత్రమే దాఖలు చేయవలెను. ఆపరేషనల్ రుణదాతలు అనగా పనివారు మరియు సిబ్బంది వారి ఫిర్యాదుల ధృవీకరణలను వ్యక్తిగతముగా, పోస్టుద్వారా లేదా ఎలక్ట్రానిక్ పద్ధతిలో దాఖలు చేయవచ్చును.
అసత్యపు లేదా తప్పుడు ధృవీకరణల ఫిర్యాదులు దాఖలు చేసిన జరిమానాకు దారితీయును.

సం/-
(సిఎంఎ కె.కె. రావు)
కరుచల కోటేశ్వర రావు
ITERIM RESOLUTION PROFESSIONAL

తేది: 16.03.2018
ప్రదేశము: హైదరాబాద్

రాఫెల్‌తో రక్షణ నిధుల భక్షణ



న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంతో దేశానికి రూ 36,000 కోట్ల నష్టం వాటిల్లిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఓ వైపు సైన్యం రక్షణ అవసరాలకు మరింత డబ్బు కోరుతున్న దశలో ఇది జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాఫెల్ ఫైటర్ల ధరలపై రక్షణ మంత్రి తప్పుడు లెక్కలు చెప్పారని రాహుల్ ట్వీట్ చేశారు. ఈ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేసిన ఫ్రెంచ్ కంపెనీ దాసాల్ట్ ఏవియేషన్ వారు రక్షణ మంత్రి నిర్మలా సీతా రామన్ ధరల విషయంలో అవాస్తవాలు చెప్పారని పేర్కొన్న విషయం గుర్తుంచుకోవాలని రాహుల్ తెలిపారు. మోడీ ప్రభుత్వం ఒక్కో యుద్ధ విమానాన్ని రూ 1670 కోట్లకు కొనుగోలు చేసిందని, ఒక్కో విమానానికి రూ 1100 కోట్లు చొప్పున మొత్తం మీద రూ 36000 కోట్ల మేరకు ప్రజాధనం వృధా అయిందని , ఈ విధంగా పాలకులు రక్షణ బడ్జెట్‌లో పదిశాతం వరకూ కాజేశారని విమర్శించారు. రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణంలో ప్రధాని మౌనం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. రాఫెల్ ఫైటర్స్‌కు అప్పట్లో యుపిఎ ప్రభుత్వం ఖరారు చేసిన ధరలు, మరో వైపు ఖతార్ ఈ విమానాలకు చెల్లించిన ధరలను ఇప్పుడు భారత ప్రభుత్వం చెల్లింపులను పోల్చుకుంటే ఏ స్థాయిలో కుంభకోణం జరిగింది? దీనికి జవాబుదారి ఆర్ఎం? లేదా పిఎం వీరిలో ఎవరు? అని రాహుల్ నిలదీశారు. దేశ కీలక రక్షణ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని రాహుల్ మండిపడ్డారు.

నాణ్యమైన విద్య, వైద్యం కోసం పని చేయాలి : గవర్నర్



మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యా, వైద్య రంగాల్లో తెలంగాణను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో సిఐఐ లాంటి సంస్థలు కలిసి పని చేయాలని గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్ పిలుపునిచ్చారు. విద్యా, ఉద్యోగం, తాగునీరు, గృహ నిర్మాణం తదితర రంగాల్లో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమైనదేనన్నారు. పరిశ్రమలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పాడుతాయన్నారు. మానవ అవసరాలను మరింత తీర్చడంలో టెక్నాలజీ ఎన్నో రకాలుగా ఉపకరిస్తోందన్నారు.'రీ ఇమ్యాజినింగ్ అండ్ బిల్డింగ్ తెలంగాణ' అన్న అంశంపై సిఐఐ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సదస్సుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి, పరిశ్రమ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సిఐఐ తెలంగాణ అధ్యక్షులు వి. రాజన్న, డిప్యూటీ ఛైర్మన్ ఆర్.దినేష్‌లతో పాటు ముఖ్య అతిథిగా గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన కీలక ఉపన్యాసంలో పై విధంగా వ్యాఖ్యానించారు. ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి మాట్లాడుతూ పారిశ్రామికరంగంలో తెలంగాణ ముందుందన్నారు. సులభతర వాణిజ్య విధానంలో రాష్ట్రం గతేడాది దేశంలోనే నెంబర్ 1 స్థానంలో ఉందన్నారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ పేపర్‌లెస్, క్యాష్‌లెస్ విధానాలను ప్రజలు మరింతగా అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హరిత హారంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వివిధ సంస్థలకు ఈ సందర్భంగా గవర్నర్ ప్రశంసాపత్రాలను అందజేశారు.

సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మన తెలంగాణ/హైదరాబాద్: వివిధ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2018–19 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. సాంఘీక సంక్షేమం, గిరిజన, బిసి, ఇతర సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ శుక్రవారంతో ముగిసింది. ఈ గడువును మార్చి 20 వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంస్థ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుఫారాలు, మరిన్ని వివరాలకు tgcet.cgg.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

బిసిలుగా సంచార జాతులు!

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, సంచార జాతులలోని 30 ఉపకులాలను చట్టబద్ధంగా వెనుకబడిన తరగతులు (బిసి)గా గుర్తించి యువత భవిష్యత్‌కు తోడ్పడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సిఎం కెసిఆర్‌కు శుక్రవారం ఒక లేఖ రాశారు. భిక్షాటన చేస్తూ జీవనోపాధి పొందుతున్న సంచార జాతుల (యంబిసి) లోని 30 ఉపకులాలకు ఇప్పటికీ గుర్తింపు లేదని, వారు బిసి జాబితాలో ఏ గ్రేడ్‌కు చెందినవారనినేది ప్రశ్నార్థకంగా ఉందని లేఖలో తెలిపారు. ఈ వర్గాలకు నేటికీ సామాజిక న్యాయం అందడం లేదని, వారి బతుకులు దిగజారి భిక్షాటన తప్పా మరో గత్యంతరం లేని స్థితి కొనసాగడం విచారకరమన్నారు. యంబిసిలకు బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో నిరుపేద భిక్షాటన చేస్తున్న సంచార జాతుల ఉపకులాలకు సంబంధించిన ఈ సమస్యపై యంబిసి, బిసి నాయకుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సముచితమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.


ఈసారి సాధారణ వర్షపాతం:ఐఎండి



న్యూఢిల్లీ : ఈ సారి వేసవి తరువాత సరైన రీతిలో వర్షాలకు అవకాశం ఉందని భారత వాతావరణ పరిశోధనా సంస్థ తెలిపింది. సాధారణ, సానుకూల వర్షపాతానికి అనువైన వాతావరణం ఉందని విశ్లేషించారు. పసిఫిక్, హిందూ మహాసముద్ర ఉపరితల పరిస్థితి , వీచే గాలులను బట్టి , తేమ శాతాన్ని తీసుకుని వర్షాకాలం ఏ విధంగా ఉంటుందనేది ముందుగానే అంచనావేస్తారు. ఈ ఏడాది సానుకూల వర్షాలకు వీలుందని మార్చి నెలకు వాతావరణ పరిశోధనా సంస్థ వెలువరించిన బులెటిన్‌లో తెలిపారు. సముద్ర వాతావరణాన్ని ప్రభావితం చేసే ఎల్ నినో ఇటీవలే దక్షిణం వైపు కదలికలు సాగించడం, హిందూమహాసముద్రపు ఉపరితల పరిణామాలను విశ్లేషించుకుని ఈ తాజా సమాచారం పొందుపర్చారు. ప్రస్తుతం లా నినా పరిస్థితులు పసిఫిక్ మహాసముద్ర మధ్యప్రాంతంలో నెలకొన్నాయి. ఇవి చాలా ఎక్కువ కాలం కొనసాగుతాయి. సాధారణంగా ఎల్‌నినోకు వ్యతిరేక దిశ లో లా నినా పరిస్థితి ఉంటుంది. ఎల్‌నినో వేడిమిని కల్గిస్తే, లా నినా వాతావరణాన్ని చల్లబరుస్తుంది. పుణేలోని ఐఎండి విశ్లేషక బృందం నిపుణులు ఎకె శ్రీవాత్సవ ఈ వాతావరణ బులెటిన్‌ను విశ్లేషించారు. ప్రస్తుత లా నినా పరిస్థితి మంచి వర్షపాతానికి సంకేతం అవుతుందని, ఇప్పటికైతే సరైన వర్షాలకు అనువైన స్థితి ఉందని తెలిపారు. హిందూ మహాసముద్ర ఉపరితలంపై కూడా సజావు అయిన వాతావరణం ఉండటం వచ్చే వర్షాకాలానికి అనువుగా మారుతుందని విశ్లేషించారు. అయితే వర్షాలకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయని ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు.

'ఆయుష్మాన్'పై ఆచితూచి..

- **వేచి చూసే ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వం**
- **మార్గదర్శకాలను బట్టి తుది నిర్ణయం!**



మన తెలంగాణ/ హైదరాబాద్ : దేశవ్యాప్తంగా 'ఆయుష్మాన్‌భారత్' పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న పథకంలో రాష్ట్ర ప్రభుత్వం చేరాలా వద్దా అనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిని అవలంబించాలని భావిస్తోంది. నిర్దిష్టంగా ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు చూసిన తర్వాత తెలంగాణ చేరాలా లేదా అనేదానిపై స్పష్టత వస్తుందని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలకు, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రం తీసుకొస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ఉన్నట్లయితే సానుకూలంగా స్పందిస్తామని, లేదంటే స్వంతంగా కొత్త పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రూపొందించుకునే ఆలోచనలు కూడా లేకపోలేదని సూచించారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్‌ను ఏ విధంగా అమలుచేయాలన్న కోణం నుంచి కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి, మరికొద్దిమంది అధికారులు ఇటీవల తెలంగాణ రాష్ట్రానికి వచ్చి వివరాలు తెలుసుకోవడంతో పాటు వివిధ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి దాని అమలుకు సంబంధించిన వివరాలను కూడా తెలుసుకున్నారని ఆ అధికారి వివరించారు. దీని వెలుగులో ఆయుష్మాన్ భారత్ ఉండే అవకాశం ఉందని, నిర్దిష్ట మార్గదర్శకాలను రూపొందించిన తర్వాత పంపించనున్నట్లు కేంద్ర అధికారులు వివరించారని, ఇప్పటివరకు అందలేదని తెలిపారు. ఆ వివరాలు తెలియకుండానే గుడ్డిగా ఆ పథకంలో తెలంగాణ చేరడం అనే ప్రసక్తే లేదని, ప్రభుత్వం కూడా ఈ దిశగానే ఆలోచిస్తోందని ఆ అధికారి స్పష్టం చేశారు. పథకాన్ని రూపొందిస్తున్నది కేంద్ర ప్రభుత్వమే అయిదా అమలు జరిగేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుంది కాబట్టి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా లేనప్పుడు ఆ డబ్బుల్ని వృథా చేసుకోవడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో గవర్నర్, ముఖ్యమంత్రి మొదలు చిట్టచివరి సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలను ప్రభుత్వం ఉచితంగానే నిర్వహిస్తుందని, ప్రతి ఒక్కర ఆరోగ్య వివరాలు ప్రభుత్వం దగ్గర నమోదవుతాయని, ప్రతి ఒక్కరికి ఆరోగ్య కార్డు ఇస్తామని ప్రకటించారు. త్వరలోనే దీనికి సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేస్తుందని, ఆరోగ్య తెలంగాణ లక్ష్యంలో భాగంగా దీనికి రూపకల్పన జరుగుతోందని ప్రకటించారు.

ఇంత లోతైన ఆలోచన ఉన్న నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చే ఆయుష్మాన్ భారత్ పథకం నిర్దేశిత లక్ష్యం కూడా ఈ దిశగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం చేరే అవకాశాలు ఉంటాయి. లేదంటే కర్నాటక, పశ్చిమబెంగాల్ తరహాలో తెలంగాణ కూడా ఈ పథకంలో భాగస్వామ్యం కాకపోవచ్చు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఇప్పటికే 'స్వాస్థ్య సాథి' అనే పథకాన్ని అమలుచేస్తున్నందువల్ల కేంద్రం తీసుకొచ్చే ఆయుష్మాన్ భారత్‌లో చేరబోమని స్పష్టం చేసింది. కర్నాటక ప్రభుత్వం సైతం స్వం తంగా ఆరోగ్య పథకాన్ని ప్రారంభించుకుంటాం తప్ప ఈ పథకంలో చేరే ఉద్దేశం లేదని తేల్చి చెప్పింది. తెలంగాణ మాత్రం ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదుగానీ ఆచితూచి వ్యవహరించాలన్న వైఖరి అవలంబిస్తోంది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సుమా రు పది కోట్ల కుటుంబాల్లోని దాదాపు 50 కోట్ల మందికి ఆయుష్మాన్‌భవ కింద వైద్య సేవలను అందించనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ ఏటా ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రతి ఒక్కరికీ ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా గవర్నర్ మొదలు సామాన్యుడి వరకు అందరికీ ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో కొత్త పథకానికి రూపకల్పన చేస్తోంది. రైతుల కోసం ఇప్పటికే రూ. 500 కోట్లను బడ్జెట్‌లో కేటాయించి 'రైతు బీమా'ను అమలుచేయడానికి రంగం సిద్ధం చేసింది.

మళ్లీ పత్తిసాగువైపే రైతుల మొగ్గు ?

- **హెచ్‌టి కాటన్ నిరోధానికి టాస్క్‌ఫోర్స్**



మన తెలంగాణ/హైదరాబాద్ : రానున్న వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి సాగువైపే మొగ్గుచూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే పత్తి సాగు దాదాపు 10 శాతం పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆ దిశగా సన్నద్ధమ వుతున్నారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. 2017 వానా కాలంలో రాష్ట్రంలో దాదాపు 47 లక్షల ఎకరాల్లో (రాష్ట్రంలో మొత్తం సాగైన విస్తీర్ణంలో సగం) రైతులు పత్తి పంటనే వేశారు. దీనికి పది శాతం అదనం గా 53 లక్షల ఎకరాల వరకు రానున్న సీజన్‌లో పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. దీన్ని గమనించి ముందస్తుగానే ప్రణాళికలు వేసుకుని ఆ దిశగా సన్నద్ధం అవుతున్నట్లు తెలిసింది. నకిలీ, అనుమతి లేని పత్తి విత్తనాల(హెచ్‌టి)కు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి నార్త్‌జోన్ ఐజి వై. నాగిరెడ్డి, రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కె. కేశవులును రాష్ట్రస్థాయిలో కో ఆర్డినేటర్‌గా నియమించినట్లు తెలిసింది. పోలీసుశాఖ సహకారంతో వ్యవసాయ శాఖ అధికారులు నకిలీలు, అనుమతి లేని పత్తి విత్తనాలు ఉత్పత్తి చేస్తూ, మార్కెట్ చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకునోనున్నారు. ఇందుకోసం నిరంతరం పర్యవేక్షణ, తనఖీలు చేపట్టనున్నారు. నకిలీ పత్తి విత్తనాల నిరోధానికి, విత్తన చట్టం ప్రభావంతంగా అమలు చేయడంపై పోలీసు, వ్యవసాయ శాఖ ఏ రకంగా ముందుకు వెళ్లాలనే దానిపై శనివారం అధికారులు భేటీ కానున్నట్లు తెలిసింది.

పసి మొగ్గలనూ చిదిమేస్తున్న క్యాన్సర్!



- **తెలంగాణలో ఏటా వ్యాధిబారిన 5వేల మంది**
- **దేశవ్యాప్తంగా లక్షమంది**
- **రోగ నిర్ధారణకు ముందుకు రాని ప్రజలు**
- **ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధికి చికిత్స**

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశవ్యాప్తంగా చిన్నారుల్లోనూ క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుండడం పట్ల వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి సుమారు లక్ష మంది చిన్నారులు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు క్యాన్సర్ నిపుణుల అంచనా. తెలంగాణలో సుమారు ఐదువేల మంది చిన్నారులు ప్రతి ఏటా క్యాన్సర్‌కు గురవుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జన్యుపరంగానే ఎక్కువ మంది దీని బారిన పడుతున్నట్లు తేలింది. క్రిమి సంహారక, హానికర పదార్థాలు, కాలుష్య తీవ్రత వల్ల కూడా క్యాన్సర్‌కు గురవుతున్నట్లు వైద్యు లు అభిప్రాయపడుతున్నారు. పదేళ్ల వయస్సులోపు పిల్లలు కూడా క్యాన్సర్ బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోందని నగరంలోని కాంటినెంటల్, ఎమ్ఎన్‌జె ఆసుపత్రుల క్యాన్సర్ నిపుణులు వ్యాఖ్యానించారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్న వారిలో మధ్య తరగతి, ఆ కిందిస్థాయి వారే సంఖ్య అధికం గా ఉన్నారని, 15 ఏళ్లు నిండిన వారిలో ఎక్కువగా ఈ వ్యాధి సోకుతోందని కాంటినెంటల్ ఆసుపత్రి క్యాన్సర్ నిపుణులు డాక్టర్ ఏవిఎస్ సురేష్ వ్యాఖ్యానించారు. జన్యుపరంగా తల్లిదండ్రుల్లోని క్రోమోజోముల స్థాయిని బట్టి 10 లేదా 11 ఏళ్లకు కూడా కొందరు ఈ వ్యాధి బారిన పడుతున్నారని, స్క్రీనింగ్ చేయించుకోకపోవడం వల్ల లెక్కల్లో స్పష్టత ఉండడం లేదన్నారు. స్క్రీనింగ్‌కు రాని వారి సంఖ్య గణనీయంగానే ఉన్నందువల్ల వ్యాధిగ్రస్తుల సంఖ్యను నిర్దిష్టంగా అంచనా వేయలేకపోతున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా, ప్రజల్లో చైతన్యం పెరిగినా నేటికీ చాలా మంది రోగ నిర్ధారణకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళన ఒకవైపు, ఇతరుల నుంచి ఎదురయ్యే ఇబ్బందులు కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను స్క్రీనింగ్‌కు, చికిత్సకు తీసుకురావడానికి సిగ్గుపడుతున్నారని వ్యాఖ్యానించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సను అందించినట్లయితే రోగాన్ని పూర్తిగా నిర్మూలించే అవకాశముందని, పెద్దవారి కంటే చిన్న పిల్లల్లో ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయన్నారు. యుక్త వయస్సుతో పాటు చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్ ప్రమాదకరమైందని, 50 శాతం జన్యు సంబంధంగా వస్తే, మరో 20 శాతం అలవాట్ల కారణంగా సంభవిస్తున్నాయన్నారు. నాలుగు తరాల కిందటివారిలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా ఆ తర్వాత పిల్లలకు క్యాన్సర్ సోకే ప్రమాదముంది. పిల్లల్లో జన్యుపరంగానే ఎక్కువగా ఈ వ్యాధి సంభవిస్తోంది. ప్రస్తుతం ఎంఎన్‌జె ఆసుప్రతిలో నాలుగు వందల బెడ్లు ఉంటే అందులో వంద బెడ్లు పిల్లలకే కేటాయించాల్సిన పరిస్థితి నెలకొనిందన్నారు. పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌ను నయం చేయవచ్చని తెలిపారు.



వ్యాధి కారణాలు

- **50% జన్యు సంబంధం**
- **20% అలవాట్లు**

తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పై జారి పడిన వాహనాలు

- **పలువురికి గాయాలు**
- **ఆయిల్‌కు తోడు చిరు వానకు తడిసిపోయిన రోడ్డు**
- **భారీగా స్తంభించిన ట్రాఫిక్**

మన తెలంగాణ/ముషీరాబాద్ : హైదరాబాద్‌లోని తెలుగు తల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఉదయం సమయంలో ద్విచక్ర వాహనాలు జారి పడ్డాయి. అయితే బ్రిడ్జి రోడ్డుపై ఏదో గుర్తు తెలియని వాహనం ద్వారా పడి పోయిన ఆయిల్ వల్లనే ఈ ఘటన జరిగిందని తెలిసింది. ఆయిల్‌కు తోడు తెల్లవారు జామున కురిసిన వర్షం నీటిని గుర్తించకపోవడంతో దాదాపు 30, 40 ద్విచక్ర వాహనాలు జారిపడ్డాయి. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనతో వాహనదారులు ఏమి జరిగిందో, ఎలా జరిగిందో తెలియని అయోమయస్థితిలో పడిపోయారు. ఒక దశలో భయాభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనలో దాదాపు 20 మందికి పైగా వాహనదారులకు గాయాలయ్యాయి. అయితే వరుసగా ఒకటి తర్వాత మరో వాహనం జారిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్థంభించింది. దీని వల్ల ఈ దారిన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.



క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత సేవలు

మన తెలంగాణ/హైదరాబాద్ : క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యసేవలను అందించడానికి 'స్పర్శ్ హాస్పిస్' అనే స్వచ్ఛంధ సంస్థ ముందుకొచ్చింది. వ్యాధి సోకిన వారిని సంతోషంగా ఉంచేందుకు, వ్యాధి చివరి దశలో ఉన్నప్పుడు స్వాంతన చేకూరుస్తూ సేవలను అందిస్తామని, ఇక చనిపోక తప్పదనేవారికి భరోసాతోపాటు ఆత్మస్థైరాన్ని కల్పిస్తామని బంజారాహిల్స్‌లోని ఆ సంస్థ సిఇఓ రాంమోహన్‌రావు పేర్కొన్నారు. ఏడేళ్ళ క్రితం ఏర్పాటైన ఈ సంస్థ ఇప్పటివరకు 1800 మందికి సేవలందించిందని, చివరి దశలో సంస్థను ఆశ్రయించి 1100 మంది కాలం చేశారని వివరించారు. ప్రాణాలను కోల్పోతున్నామన్న భావనను వారి నుంచి దూరం చేయడంతో పాటు కుటుంబాన్ని వదిలి వెళ్తున్నామనే ఆందోళన నుంచి విముక్తి చేసి సంతోష కరమైన వాతావరణాన్ని కల్పించడమే తమ సంస్థ లక్ష్యమని మీడియాకు వివరించారు. తమ సంస్థ చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించిందని, త్వరలోనే నగరంతో పాటు పరిసరాల్లోని వ్యాధిగ్రస్తులను సంతోషంగా ఉంచేందుకు హోం సర్వీసును కూడా అందించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య



మన తెలంగాణ/సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్ళితే వెస్ట్ బెంగాల్‌కు చెందిన గోపాల్‌దాస్ తన కుటుంబంతో కలిసి సికింద్రాబాద్‌లోని జనరల్ బజార్‌లో నివాసముంటున్నాడు. అతనికి భార్య దీప, కొడుకు టికిలి దాస్ (5), ఒక పాప (5 నెలలు) ఉన్నారు. దంపతులు తమ ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తాము విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరానప్పటికి ఆర్థిక ఇబ్బందుల మూలంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. జనరల్ బజార్‌లో వెస్ట్ బెంగాల్‌కు చెందిన అనేక మంది బంగారు నగలు తయారు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. మృతదేహాలను గాంధీఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



"మన లోపల శత్రువు లేనంతవరకు బయటి శత్రువు మనను భయపెట్టలేదు.
– గౌతమబుద్ధుడు"

ఇరకాటం ఇంతింత కాదయా!

సంపాదకీయం

రాజకీయ వ్యూహాల్లో దిట్టగా పేరున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బిజెపితో నాలుగేళ్ల సహచర్యం తదుపరి శుక్రవారం ఉదయం తప్పనిసరి పరిస్థితిలో ఎన్‌డిఎ కూటమినుంచి బయటకు వచ్చారు. ఎపికి వాగ్దానం చేసిన 'ప్రత్యేక తరగతి హోదా'పై ప్రధాని నరేంద్రమోడీ మోసం చేయటమేగాక టిడిపి పైకి వైసిపి జగన్‌ను, జనసేన పవన్ కళ్యాణ్‌ను ఉసిగొల్పి పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా మంజూరు, విభజన చట్టంలోని హామీల అమలుకై ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో బలంగాఉన్న మనోభావాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే చాతుర్య ప్రదర్శనగా చంద్రబాబునాయుడు వారం రోజుల క్రితం కేంద్రమంత్రివర్గం నుంచి టిడిపి మంత్రులిరువుర్ని ఉపసంహరించారు. కేంద్రంపై ఒత్తిడి కొనసాగింపుగా ఆ పార్టీ ఎంపిలతో పార్లమెంటు లోపల బయట ఆందోళన చేయిస్తున్నారు. ఏప్రిల్ ఆరు దాకా పార్లమెంటు సమావేశాల షెడ్యూలు ఉన్నందున అప్పటిలోగా ఏమీ ఫలితం రాబట్ట లేకపోతే ఎన్‌డిఎనుంచి వైదొలిగే విషయం అప్పుడు నిర్ణయించవచ్చుననుకున్నారు. అయితే పరిస్థితులు తరుముకొచ్చాయి. ఒకవైపు,మార్చి 21న కేంద్రప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం, ఏప్రిల్ 6న ఎంపిల రాజీనామాల సమర్పణను ప్రకటించిన వైసిపి, పార్లమెంటు సమావేశాలు ఏరోజైనా నిరవధికంగా వాయిదా పడవచ్చన్న ఊహాగానాల మధ్య అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించే తేదీని ముందుకు (16వ తేదీ)జరపటం, మరోవైపున, పవన్‌కళ్యాణ్ రెండ్రోజుల క్రితం గుంటూరుజిల్లాలో జనసేన ఆవిర్భావ నాల్గవ వార్షిక సభపెట్టి టిడిపి పరిపాలనను అవినీతిమయంగా కడిగేయటం చంద్రబాబును ఇరకాటంలోకి నెట్టాయి. ఎన్ని బలహీనతలున్నా, ప్రత్యేకహోదాకై ఆదినుంచి పట్టువిడవకుండా ఆందోళన చేస్తున్న వైసిపి ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానాన్ని బలపరచాలా, లేదా అనే సందిగ్ధావస్థలో ఉన్న చంద్రబాబునాయుడుకు పరిస్థితి ముందు నుయ్యి వెనుకగొయ్యిలా తయారైంది. శుక్రవారం సాయంత్రం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశాన్ని పిలిచిన చంద్రబాబుకు వ్యవధి ముంచుకొచ్చింది. వైసిపి తీర్మానాన్ని బలపరిస్తే తీర్మానం పెట్టిన ఖ్యాతి ఆ పార్టీకి దక్కుతుంది. అది తనకు రాజకీయంగా నష్టం. తామే తీర్మానానికి నోటీసు ఇవ్వాలంటే ఎన్‌డిఎనుంచి బయటకు రావాలి. ఆయన రెండవ మార్గం ఎంచుకోకతప్పలేదు. పొలిట్‌బ్యూరో సభ్యులతో తెల్లవారుతూనే టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఎన్‌డిఎనుంచి నిష్క్రమణ, మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నిర్ణయాలు తీసుకుని, ఎంపిల చేత నోటీసు ఇప్పించారు. అంతకు ముందే వైసిపి నోటీసు ఇచ్చింది.

ప్రత్యేక హోదా సమస్యపై మా అవిశ్వాస తీర్మానాన్ని టిడిపి బలపరచాలి లేదా వారు నోటీసిస్తే తాము బలపరుస్తామని జగన్ వ్యూహాత్మక ప్రతిపాదనపై చంద్రబాబు అప్పుడే స్పందించి ఉంటే, లేక మంత్రుల రాజీనామాల నాడే ఎన్‌డిఎనుంచి వైదొలిగి ఉంటే చొరవ చంద్రబాబు చేతిలో ఉండేది. కేంద్రంపై ఒత్తిడిద్వారా హోదా కాకపోయినా, ప్యాకేజీ నిధులైనా ఎంతోకొంత సాధించి రాష్ట్రంలో ప్రతిపక్షపార్టీపై, గల్లి నుంచి ఢిల్లీదాకా ఆందోళన చేస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్, స్వతంత్రులపై పైచేయి సాధించి దాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చంద్రబాబు వ్యూహాత్మక తప్పిదం చేశారు. అది బెడిసి కొట్టింది. బిజెపి జగన్‌ను ఉపయోగించుకుని అవిశ్వాస తీర్మానం, ఎంపిల రాజీనామాలు, పవన్ కళ్యాణ్‌ను ఉపయోగించుకుని అవినీతి ఆరోపణలు చేయిస్తున్నదని ఇప్పుడు నిందిస్తున్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేము, తత్సమాన ఆర్థిక ప్యాకేజి ఇస్తామని కేంద్రం చెప్పిన మాటకు తలాడించి హోదా డిమాండ్‌ను వదులుకున్ననాడే తప్పు చేశారు. హోదా కోరుతూ ఆందోళన చేస్తున్న ఇతర పార్టీలు రాజకీయ లబ్ధిపొందకుండా నిరోధించేందుకుగాను ఆయన ఇప్పుడు మళ్లీ హోదా డిమాండ్ అందుకున్నారు. అవ్వ–బువ్వ రెండూ తనకే కావాలకుని ఏకాకి అయినారు.

ఏమైతేనేం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేసిన దగాకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మాన నోటీసులు కాంగ్రెస్ సహా అనేక పార్టీలను ఏకతాటిపైకి తెస్తూ బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఐక్యతకు పునాది వేస్తున్నది. బహుశా సోమవారం చర్చకు రావచ్చు. వైసిపి, టిడిపిలు తమ సంకుచిత బుద్ధిని, స్వార్థ రాజకీయాన్ని కట్టిపెట్టి రాష్ట్ర ప్రయోజనాల కొరకు పార్లమెంటులోనైనా ఐక్యంగా కొట్లాడితే ప్రజలు సంతోషిస్తారు.

పాక్‌లో దళిత చైతన్యం


చూపు

ముస్లిం మెజారిటీ దేశం పాకిస్తాన్. హిందు జనాభా చాలా తక్కువ. పాకిస్తాన్ హిందువుల్లో దళితులు కూడా ఉన్నారు. పాకిస్తాన్ దళిత సముదాయం నుంచి ఒక మహిళ ఇప్పుడు అక్కడి పార్లమెంటుకు ఎంపికయ్యింది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నుంచి కోహ్లి సముదాయానికి చెందిన దళిత మహిళ కృష్ణకుమారి కోహ్లి పార్లమెంటుకు ఎంపికయ్యింది. పాకిస్తాన్ లో కోహ్లి సముదాయం ఒకప్పుడు అంటరాని సమాజం. మన రాజ్యసభ వంటి అక్కడి ఎగువసభకు కృష్ణకుమారి కోహ్లి ఎంపికయ్యారు. ఆరేళ్ళ పదవీకాలం.

ఈ స్థాయికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉందని కృష్ణకుమారి మీడియాతో అన్నారు. హత్యకు గురైన పాకిస్తాన్ మాజీ ప్రధాని బెనజీర్ బుట్టో పార్టీ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ ఆమెకు టిక్కట్టు ఇచ్చింది. కృష్ణకుమారి యూనివర్శిటీ డిగ్రీ సంపాదించుకుంది. ఆ తర్వాత స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రజాసేవా కార్యక్రమాల్లో పనిచేయడం ప్రారంభించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో పనిచేస్తున్నప్పుడే పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ కార్యకర్తగా మారారు. సింధ్ ప్రాంతంలో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి మంచి బలం ఉంది. జనాభా ఎక్కువగా సింధ్ ప్రాంతం లోనే ఉన్నారు. ముప్పయి తొమ్మిది సంవత్సరాల కృష్ణకుమారి కోహ్లి వివాహం కూడా కేవలం 15 సంవత్సరాల వయసులోనే అయిపోయింది. ఆమె భర్త లాల్ చంద్ ప్రోత్సాహంతో చదువు కొనసాగించింది. సోషియాలజీలో మాస్టర్స్ చేసింది. పాకిస్తాన్ లోని అత్యంత వెనుకబడిన నాగర్ పర్కార్ జిల్లా లోని మారుమూల పల్లె థార్ కి చెందిన కృష్ణకుమారి 1979లో జన్మించింది. చిన్నప్పుడు వెట్టిచాకిరి కూడా చేయవలసి వచ్చింది. ఆమె 3వ తరగతి చదువుతున్నప్పుడు ఉమర్ కోట్ జిల్లాలో భూస్వామి కుస్రీ ఆమె కుటుంబాన్ని మూడేళ్ళ పాటు నిర్బంధంలో ఉంచాడు.

ఆమె కుటుంబం 1857 ప్రథమ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నది. నాగర్ పర్కార్ లో బ్రిటీషు సైన్యంతో పోరాడిన రూప్ కోహ్లి వంశానికి చెందిన మహిళ ఆమె. రూప్ కోహ్లిని 1858లో బ్రిటీషు ప్రభుత్వం ఉరితీసింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షం తరఫున ఒక దళిత మహిళ గెలుపొందడం పాకిస్తాన్ లో సంచలనమయ్యింది. సోషల్ మీడియాలో ఈ వార్త వైరల్ అయ్యింది. జిబ్రాన్ నసీర్ వంటి సామాజిక కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తూ పాకిస్తాన్ పార్లమెంటులో అన్ని మతాల స్త్రీపురుషులు అందరూ ఉండాలని అన్నారు. పాకిస్తాన్ లో హిందూ మహిళా పార్లమెంటేరియన్ రీటా ఈశ్వర్ లాల్. ఆమె కూడా సింధ్ నుంచే ఎంపికయ్యారు. పాకిస్తాన్ లో మహిళలకు రిజర్వేషన్లున్నాయి. సింధ్ లో మహిళలకు రిజర్వు స్థానం నుంచి రీటా ఈశ్వర్ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తరఫునే ఎంపికయ్యారు. అంతకు ముందు రత్న భగవాన్ దాస్ చావ్లా కూడా పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తరఫునే ఎంపికయ్యారు.


కౌంటర్ కరెంట్స్ పత్రికలో పాకిస్తాన్ కు చెందిన పాకిస్తాన్ హిందూ సేవా వెల్ఫేర్ ట్రస్ట్ రిసెర్చ్ అసోసియేట్ చందర్ కోహ్లి రాసిన వ్యాసం అక్కడి దళిత సముదాయం గురించి మరిన్ని వివరాలు అందజేస్తోంది. ఆ వ్యాసం ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా దళిత సమస్యల అధ్యయనం అనేది పాకిస్తాన్ లో ఎక్కువయ్యింది. పాకిస్తాన్ లో దళితుల స్థితిగతుల గురించి తెలుసుకునే ప్రయత్నాలు ఇప్పుడు చాలా మంది చేస్తున్నారు. దళిత సాహిత్యాన్ని చదివే వారి సంఖ్య కూడా పెరిగింది. పాకిస్తాన్‌లో దళితుల గురించి మాట్లాడుతున్నప్పుడు రెండు కోణాలు ముఖ్యంగా దృష్టిలో ఉంచుకోవాలి. ఒక కోణమేమంటే పాకిస్తాన్ లో దళితులుగా గర్వంగా చెప్పుకునే దళితులు కొందరు. దళితులుగా బాహాటంగా చెప్పుకోవడం వల్ల సమాజంలో మిత్రులను కోల్పోయినా, బంధువులు దూరమైనా, సామాజికంగా కష్టాలెదురైనా లెక్కచేయకుండా తాము దళితులమని గర్వంగా చెప్పుకునేవారు ఉన్నారు. మరో కోణమేమంటే, దళితులుగా చెప్పుకోడానికి సంకోచించే, సిగ్గుపడే వారూ ఉన్నారు. పాకిస్తాన్ హిందూ సమాజంలో అగ్రవర్ణాల కన్నా ఎక్కువగా దళితుల్లోని కొందరే దళిత గుర్తింపు విషయంలో వ్యతిరేక వైఖరి పాటిస్తున్నారు.



పాకిస్తాన్ లో దళితులు, షెడ్యూల్ కులాలు రెండు ఒక్కటి కాదు. దళిత పదం చాలా విస్తృతంగా ఉపయోగించబడుతుంది. హిందూ ముస్లిమ్ సముదాయాలన్నింటిలో బడుగు, బలహీనవర్గాలందరినీ సూచించడానికి దళితపదం ఉపయోగిస్తారు. కాని పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ కులాలు ఖచ్చితంగా గుర్తించబడి ఉన్నా యి. ఇవి 42 కులాలు. ఇందులో కోహ్లి, భీల్, మేఘవార్, జోగి, అవధ్, కలాల్ వగైరా కులాలున్నాయి. ఇవన్నీ హిందూ బడుగు బలహీన కులాలు. ఈ కులాలన్ని షెడ్యుల్ కులాలుగా రాజ్యాంగం గుర్తించింది. ఈ షెడ్యూల్ కులాల జాబితాలో ఉన్న కులాలన్నీ దళిత కులాల క్రిందికే ఖచ్చితంగా వస్తాయి. అయితే ఈ కులాలు మాత్రమే కాకుండా మరికొన్ని హిందూ, ముస్లిమ్ బడుగు సముదాయాలు కూడా దళితులుగా పేర్కొనడం జరుగుతుంది. కాని ఇవి షెడ్యూల్ కులాల పరిధిలో ఉండవు. పాకిస్తాన్‌లో మరో సమస్య ఏమిటంటే దళిత పదం హిందూ కులాలకు సంబంధించిందిగానే ఎక్కువగా చూస్తారు. అందువల్ల దళిత పదాన్ని కొన్ని దళిత వ్యతిరేక శక్తులు కించపరిచే పదంగా భావిస్తాయి. పాకిస్తాన్ లో చాలా మంది మేధావులు, ఉదారవాదులుగా చెప్పుకునేవారు దళిత ఉద్యమాన్ని హిందూ వ్యతిరేక ఉద్యమంగా భావిస్తుంటారు. ఉదారవాదులకు సంబంధించిన అనేక వాస్తవాలను దళిత ఉద్యమం బట్టబయలు చేసింది. మానవవాదులుగా, సమానత్వాన్ని కోరుకునేవారుగా చెప్పుకునే ఉదారవాదుల్లోనూ దళితుల పట్ల ఉన్న అపార్థాలను దళిత ఉద్యమం ఖండిస్తోంది. పాకిస్తాన్ లో మానవహక్కుల కోసం పనిచేస్తున్నట్లు చెప్పుకునే కొందరు ఆర్యసమాజ్ ను సమర్థించడానికి భూమ్యాకాశాలు ఏకం చేస్తారని, బ్రాహ్మణుల కన్నా ఎక్కువగా బ్రాహ్మణులను సమర్థిస్తారని చందర్ కోహ్లి రాశారు. ప్రోగ్రెసివ్ హ్యూమన్ ఫ్రంట్ నాయకుడిగా కూడా ఉన్న చందర్ కోహ్లి ఈ విషయమై మాట్లాడుతూ పాకిస్తాన్ లోని వివిధ దళిత సంస్థలు, భీల్ ఇంటలెక్చువల్ ఫోరమ్, పాకిస్తాన్ మేఘవార్ కౌన్సిల్, ఆల్ సింధ్ కోహ్లి అసోసియేషన్, సింధ్ కోహ్లి ఇత్తెహాద్ లోని రాంషల్ గ్రూపు, నామ్ దాస్ గ్రూపు, షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ ఆఫ్ పాకిస్తాన్, బాగ్రి వెల్ఫేర్ అసోసియేషన్, అవధ్ సమాజీ తంజీమ్, పాకిస్తాన్ దళిత్ సాలిడారిటీ నెట్ వర్క్, బాగ్రి వెల్ ఫేర్ అసోసియేషన్, దళిత్ అదబ్ ఫోరమ్, ఖౌమీ అవామీ తహ్రీక్, తబఖతీ జిదోజహద్ వంటి సంస్థలన్నీ మీర్ పుర్కా లో బాబాసాహెబ్ 125వ జయంతి నాడు సమావేశమయ్యాయి. దళిత్ ఇన్సాఫ్ పార్టీ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాయి. పాకిస్తాన్ దళితుల్లో 70 శాతం ప్రజలు రైతుకూలీలే. దళిత సముదాయాల్లో వస్తున్న రాజకీయ చైతన్యం పాకిస్తాన్ లోని ప్రధాన పార్టీలను కూడా దళితుల విషయంలో ఆలోచించక తప్పని పరిస్థితి కల్పిస్తోంది.

✻ రఫీక్

కాంగ్రెస్ మరో మెట్టు దిగుతుందా?



టంకశాల అశోక్
9848191767

2019 ఎన్నికలకు సంబంధించి జాతీయస్థాయిలో ప్రస్తుతం రంగులరాట్నం తిరుగుతున్నది. బిజెపి ఒక ఎన్నికలో ఓడినపుడల్లా ఇక ఆ పార్టీ పని అయిపోయిందని, ఈసారి అధికారంలోకి రాదనే మాటలు జోరుగా సాగుతున్నాయి. ఆ పార్టీ మరో ఎన్నికలో గెలిచినపుడు అందరూ ఉసూరుమంటున్నారు. ఆశనిరాశలు ఉద్వేగ స్థాయికి చేరినప్పుడు ఇటువంటి పరిస్థితులు కన్పిస్తుంటాయి. ఇది చివరకు ఏ విధంగా పరిణమించవచ్చు. ఎందుకంటే, వాస్తవ పరిణామాలు ఇటు బిజెపిగాని, అటు ప్రతిపక్షాలుగాని ఎవరి ఆశ నిరాశలపైనా ఆధారపడి ఉండవు.

ఎన్నికలకు ఇంకా సరిగా ఏడాది కాలం ఉంది. అందరి బలాబలాలు ఈలోగా ఎటునుంచి ఎటైనా మారవచ్చు. ఎవరికివారు వ్యూహాలు రూపొందించుకుని తమ బలాన్ని పెంచుకునేందుకు ఏడాదికాలం తక్కువ వ్యవధి కాదు. అటువంటి క్రమంలో, ఏది ఎట్లా జరగవచ్చునో ఊహించేందుకు ప్రయత్నించటమంటే ఆకాశంలో మబ్బుతునకను చూసి బిందెలను ఒడిసి పట్టుకోవటమే అవుతుంది. అట్లా పట్టుకోవటం అధికార క్రీడలోగల రాజకీయ పార్టీలకు సహజం. కాని సాధారణ ప్రజలు అయినవారు అటువంటి ఉద్వేగాలకు లోను కావలసిన అవసరం లేదు.

ఇది మరింత బాగా అర్థం కావాలంటే 2014 తర్వాత జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను, పలు ఉప ఎన్నికల ఫలితాలను ఒకసారి మననం చేసుకోవచ్చు. వీటిలో బిజెపి లేదా వారి ఎన్‌డిఎ కూటమి పక్షాలు గొప్పగా గెలిచినవి ఉన్నాయి. దిగ్భ్రమ కలిగించేటట్లు ఓడినవీ ఉన్నాయి. ఈ రంగుల రాట్నం ముఖ్యంగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలనుంచి మొదలైంది. తాజాగా ఇటీవల త్రిపుర తదితర ఈశాన్య భారత ఎన్నికలు, అంతకు కొద్ది వెనుక ముందులుగా ఉత్తరాది రాష్ట్రాలలో ఉప ఎన్నికలు జరిగాయి. కొన్నిచోట్ల స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిని కలిపి చూసినట్లయితే గాలి ఏదో ఒకవైపు తిరుగులేని విధంగా వీస్తున్నట్లు చెప్పలేము. 2019 లోపు కర్నాటకతోపాటు మరికొన్ని అసెంబ్లీలకు ఎన్నికలున్నా యి. బహుశా కొన్ని ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికలు కూడా జరగవచ్చు. ఆయా రాష్ట్రాలలో ప్రస్తుతం కన్పిస్తున్న స్థితినిబట్టి కూడా అక్కడ గాలి నికరంగా ఒకరికి అను కూలం, మరొకరికి ప్రతికూలం అనదగ్గ విధంగా లేదు. గెలుపు ఓటములు కొద్ది అటుఇటుగా ఎవరివైపు అయినా జరగవచ్చుగాక. కాని దానిని మొత్తంగానే గాలి ఇటోఅటో జోరుగా వీయట మనలేము.

అనగా, పరిస్థితి ఇప్పటికే అస్పష్టంగా ఉందన్నమాట. 2019లోక్‌సభ ఎన్నికలు సంబంధించి జోస్యాలు అయితే చెప్పవచ్చుగాని, హేతుబద్ధమైన రీతిలో అంచనాలు వేయగల స్థితి కన్పించటం లేదు. ఇక్కడ గుర్తుంచుకోవ లసిన ముఖ్యమైన విషయం మరొకటి ఉంది. ఎన్నికలు పూర్తిగా సమీపించినపుడు ఏ పార్టీ ఏ కూటమిలో ఉండ గలదో, ఫలితాలు వెలువడినాక అప్పటి అవకాశాలను బట్టి ఎవరు ఏ కూటమివైపు ఆకర్షితులు కాగలరో మనం ఈ రోజున చెప్పగలమా? ఈ ప్రశ్న ఇంత అనిశ్చయంగా ఉండటానికి కారణాలు అందరికీ తెలిసినవే. ఎన్నికల కూటములు, అధికార కూటములు రెండూ ఫ్రీ మార్కెట్ వ్యవహారంగా ఎప్పుడో మారిపోయాయి. ఇందులో అత్యధికులకు సిద్ధాంతాలు, పవిత్రతలు, నైతికతలు అంటూ ఏవీ లేవు. ఇది మనం గతంలోనూ చూసిందే. ఫ్రీ మార్కెట్‌లో పార్టీల మద్దతును ప్రభావితం చేసేవి పదవులు, ధనం, అదే విధమైన ప్రయోజనాలు మరేవో కల్పించగల ఒప్పందాలు. ఆ కారణంగా, ఒకవేళ ఏ కూటమికో తిరుగులేని ఆధిక్యత లభించితే తప్ప, ఎన్నికల అనంతరం కూడా రంగుల రాట్నం తిరుగుతూనే ఉంటుందన్న మాట. సందర్భం అంటూ వచ్చినందున చెప్పుకుంటున్నాము గాని ఇవన్నీ దేశ ప్రజలు చూస్తూ వస్తున్న విషయాలే. అయినప్పటికీ గుర్తు చేసుకోవటం ఎందుకంటే, ప్రస్తుత ఆశనిరాశలు ఉద్వేగాలకు రాజకీయ పార్టీల వలె ప్రజలు లోను కానక్కర లేదని చెప్పేందుకే. కాకపోతే ఇందుకు ఈ ఏడాదిలో కర్ణాటకతో ఆరంభించి మరో మూడు అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల అనంతరం పూర్తిగా కాదుగాని మరి కొద్దిగా స్పష్టత రావచ్చు. అంతవరకు వేచి చూడటం మంచిది.

ఇక వర్తమానానికి వస్తే, ముఖ్యంగా గుజరాత్‌లో బిజెపి బలం తగ్గటం, రాజస్థాన్, యుపి, బీహార్ ఉప ఎన్నికలలో ఆ పార్టీ పరాజయాలు ఎన్‌డిఎకు నిరుత్సాహాన్ని, ప్రతిపక్షాలకు ఉత్సాహాన్ని కలిగించటం కనిపిస్తున్నదే. వీటన్నింటిమధ్య త్రిపుర ఓటమి ఆ ఉత్సాహాన్ని కొంత తగ్గించటం నిజమే అయినా అదెక్కడో మారుమూల రాష్ట్రం కావటం, అక్కడ ఓడింది వామపక్షాలు అవటమన్నది ఆ ఓటమి ప్రభావం సాధారణ రూపంలో ప్రతిపక్షాలపై కొంత తక్కువగా ఉంది. వీటన్నంటి చివరన ప్రస్తుతం ప్రతిపక్ష శిబిరంలో మంతనాలు చురుకుగా మొదలయ్యాయి. వచ్చేనెలలో జరిగే కర్ణాటక ఎన్నికల వరకు ఇది ఇట్లాగే ఉంటుంది. అక్కడ ఎవరు గెలుస్తారనే దానిని బట్టి ఇవి మరింత వేగాన్ని అందుకోవటం లేదా మందగించటమన్నది ఆధారపడి ఉంటుంది.

దానినట్లుంచి, వర్తమానపు మంతనాల గురించి కొంత చెప్పుకోవాలి. ఇందులో ఒక ధ్రువం కాంగ్రెస్, మరొక ధ్రువం కొన్ని ప్రతిపక్షాలు కాగా, ఇంకా ఎటూ మాట్లాడని వారితో కూడిన మూడవ ధ్రువం ఒకటున్నది. కొద్దిరోజుల పాటు ఢిల్లీలో గడిపిన ఈ రచయితకు అర్థమైనంత మేరకు పరిస్థితి ఈ విధంగా ఉంది. ఎన్నికలకు ముందు, లేదా ఆ తర్వాత కేంద్రస్థానంలో కాంగ్రెస్ పార్టీ ఉండటం, అందుకు తక్కినవారు అంగీకరించటమన్నది ఒక ప్రశ్న. అయితే అది ఆ పార్టీకి వచ్చే సీట్లు ఎన్ని అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఇతరులు అంగీకరించటంపై మరికొంత ఉంటుంది. ఈ రెండూ ఇప్పటికైతే ప్రశ్నార్థకాలే. తక్కిన పార్టీలలో ఏవి వేరుగా ఒక ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి అదే వేదికనుంచి కాంగ్రెస్ చర్చలు జరుపుతాయి, అసలు ఆ ఫ్రంట్ పార్టీలకు ఎన్ని సీట్లు వస్తాయి, అవి కాంగ్రెస్‌ను బలపరచేందుకు సిద్ధపడతాయా, లేక తమ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతివ్వాలని షరతు పెడతాయా అన్నది మరొక ప్రశ్న. ఈ ప్రశ్న ఎవరికి రాగల సీట్లు ఎన్ని అనే దానిని బట్టి కొంత ఉన్నా, ఒకవేళ తక్కువ వచ్చినప్పటికీ తమ అభ్యర్థికి కాంగ్రెసే మద్దతు ఇవ్వాలనే వైఖరిని వీరు తీసుకుంటే ఆశ్చర్యం ఉండదు. ఎంతసేపూ ఇతర పార్టీలే కాంగ్రెస్‌కు అధికార మివ్వాలా అన్నవాదన గతంలోనూ ఉండటం తెలిసిందే. పైగా ఇపుడు రాహుల్ గాంధీ పట్ల ఇతరులకు గురి అన్నది లేదు గనుక ఈ వాదన ఈసారి మరింత బలపడుతుంది.

కాంగ్రెస్ మరో మెట్టు దిగుతుందా అనే ప్రశ్న తలెత్తుతున్నది సరిగా ఇక్కడనే. గతంలో కాంగ్రెస్ పార్టీ తన ఏక ఛత్రాధిపత్య వైభవాన్ని కోల్పోయిన తర్వాత, ఇతరులతో కలిసి ఉమ్మడికూటమి ప్రసక్తి లేదని, తమ ప్రభుత్వాన్ని తక్కిన పార్టీలు బయటి నుంచి బలపరచాలని అంటూ కొండకొమ్మున కూర్చోవటం, కాని అది సాగదని అర్థం కావటంలో విధిలేక మెట్టు దిగివచ్చి యుపిఎ రూపంలో అధికారాన్ని పంచుకోవటం తెలిసిందే. ఈసారి అవసర మైన పక్షంలో ఇంకొక మెట్టుదిగి, ఏ విధంగానైనా బిజెపిని ఆపటం అవసరం గనుక తమకు కాస్త ఎక్కువ సీట్లు వచ్చినా సరే ప్రధాని పదవి కోసం పట్టుబట్టకుండా ఇతర పార్టీల కూటమి అభ్యర్థిని బలపరచగలదా? అందుకు కూడా ఆ పార్టీ నాయకత్వం మానసికంగా ఇప్పటి నుంచే సిద్ధం కావటం మంచిదేమో.

> గతంలో కాంగ్రెస్ పార్టీ తన ఏక ఛత్రాధిపత్య వైభవాన్ని కోల్పోయిన తర్వాత, ఇతరులతో కలిసి ఉమ్మడికూటమి ప్రసక్తి లేదని, తమ ప్రభుత్వాన్ని తక్కిన పార్టీలు బయటి నుంచి బలపరచాలని అంటూ కొండకొమ్మున కూర్చోవటం, కాని అది సాగదని అర్థంకావటంలో విధిలేక మెట్టు దిగివచ్చి యుపిఎ రూపంలో అధికారాన్ని పంచుకోవటం తెలిసిందే. ఈసారి అవసర మైన పక్షంలో ఇంకొక మెట్టుదిగి, ఏ విధంగానైనా బిజెపిని ఆపటం అవసరం గనుక తమకు కాస్త ఎక్కువ సీట్లు వచ్చినా సరే ప్రధాని పదవి కోసం పట్టుబట్టకుండా ఇతర పార్టీల కూటమి అభ్యర్థిని బల పరచగలదా? అందుకు కూడా ఆ పార్టీ నాయకత్వం మానసికంగా ఇప్పటి నుంచే సిద్ధం కావటం మంచిదేమో.

సామర్థ్యాల పతాక, పోరాటాల ప్రతీక



మరిపెద్ది వినుతారెడ్డి
9515405916

స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం మానవాళి 19, 20వ శతాబ్దాల్లో పెద్దఎత్తున పోరాటాలు నడిపింది. నేటికీ కొనసాగిస్తున్నది. అనేక మార్పులు, విజయాలు స్వంతం చేసుకున్నది. అయితే ఈ హక్కులలో మా వాటా సంగతి ఏమిటని తరతరాల వివక్షకు గురైన మహిళాలోకం నిలదీస్తున్నది. ఒంటరిగా ఉంటే సాధించలేమని గత అనుభవాలు తెలియచేస్తున్నవి. అందుకే ప్రపంచ మహిళావని మొత్తం కలసికట్టుగా ఒకే గొంతుతో నినదిస్తున్నది. పాదంపాదం కలిపి ఉద్యమిస్తున్నది.

మహిళలు ఎంతగా కదిలినా తమ న్యాయమైన హక్కుల కోసం నిలదీసినా ఇంకా అభివృద్ధిలోని ప్రతికోణంలో వెనుకబడే ఉన్నారు. లైంగిక వేధింపులు, మహిళలపై దాడులు, హత్యలు, వేతనాల్లో తేడాలు ఇంకా పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. స్త్రీ, పురుష సమానత్వం, బాలికా, మహిళా సాధికారత ఇంకా సాధించబడలేదు. గతంలో ఏనాడూ ఊహించనంత పెద్దసంఖ్యలో మహిళలు నేడు వేతన రంగంలో ఉద్యోగులుగా జీవనభృతి పొందుతున్నారు. విద్య, ఆరోగ్య రంగాలు అనేకరంగాల్లో పోటీపడి తమ మేధావిత్వాన్ని నిరూపిస్తున్నారు. రక్షణరంగంలో, విమానయాన రంగంలో అంతరిక్ష రంగంలో తమ సాహసోభరిత శక్తిని చాటిచెపుతున్నారు. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో ప్రతిభను చూపుతున్నారు. రాజకీయరంగంలో, పాలనారంగంలో తమ నాయకత్వ సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారు. అనేకదేశాల్లో కొనసాగుతున్న వివక్షను రూపుమాపడానికి ఎన్నో చట్టాలను రూపొందిస్తున్నారు. అయినా ఇంకా మహిళా ప్రగతికి అనేక ఆటంకాలు ఎదురౌతున్నాయి. వివక్ష, దోపిడీల నుండి మహిళలను కాపాడడమే నేటి ప్రపంచ సవాల్. గృహహింస నుండి రక్షణ పొందే చట్టాలు లేక 100కోట్లమంది పైగా మహిళలు హింసలపాలవుతున్నారు. ప్రపంచ వేతనాల లింగ వ్యత్యాసాలు ఇంకా 23%గా ఉన్నది. అదే గ్రామీణ ప్రాంతాల్లో 40% గా కూడా ఉంది. వేతనం లేని మహిళల శ్రమ కనీస గుర్తింపుకు కూడా నోచుకోవడం లేదు. జాతీయ పార్లమెంట్లలో మహిళా భాగస్వామ్యం చాలా దేశాల్లో నామమాత్రంగానే ఉన్నది.పెద్దపెద్ద కంపెనీల యాజమాన్యాలలో మహిళల భాగస్వామ్యం నామమాత్రంగా కూడా లేదు. నిబద్ధతతో కూడిన చర్యలు చేపట్టకుంటే బాలికలను, గర్భస్థపిండాలను చిదిమేసి స్త్రీ, పురుష నిష్పత్తిని ఇంకా పెంచే అవకాశం ఉంది. ఈ ప్రమాదాన్ని అందరం గుర్తించాలి. ప్రపంచమంతా ముఖ్యంగా పురుషులు గుర్తించి మహిళల హక్కుల సాధనా ఉద్యమాలు నడపాల్సిన చారిత్రాత్మక బాధ్యత నిర్వర్తించాలి.

అందుకే ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి "మహిళల హక్కుల గురించి మనం మాట్లాడుతున్నామంటే వాళ్లకేదో మేలు చేస్తున్నామని భావించరాదు. లింగసమానత్వం మానవ హక్కుల సమస్య. అంతేకాదు అది మనందరి అవసరం. మహిళలపట్ల వివక్ష, అసమానత మనందరికీ ప్రమాదకరం" అన్నారు. పురుషులంతా గమనించి మహిళా హక్కుల కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున చిత్తశుద్ధితో పాల్గొనాలి.

ప్రపంచ ఆర్థికఫోరమ్ 2017 ప్రపంచ లింగ తేడాల నివేదిక ప్రకారం పరిస్థితులు ఇలాగే కొనసాగితే లింగసమానత్వం సాధించడానికి ఇంకా 200 ఏండ్లు పడుతుంది. మహిళా ప్రగతి సాధించాలంటే ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాలు, ఉద్యమాలు ఏ మాత్రం చాలవు. ఎంతో పెద్ద మార్పులు, విప్లవాత్మక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు 'ప్రగతి కొరకు ఒత్తిడి చేద్దాం'పేరుతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. లింగసమానత్వం ఒకే రాత్రి సాధించలేము గానీ అందుకోసం నిరంతర, సంఘటిత ఉద్యమాల ప్రపంచవ్యాప్త ఉద్యమాలు నడపాలి. రోజురోజుకు ప్రపంచ మహిళలు అనేక సానుకూల అంశాలను సాధిస్తున్నారు. మార్పుకోసం కృషి చేస్తున్నారు. అయినా ఒక గొప్ప ప్రపంచ మహిళా ఉద్యమం నేటి తక్షణావశ్యకత. ప్రగతి కొరకు ఒత్తిడి అనే పిలుపు మహిళా సమానత కోసం అందరం కదలాలని ప్రపంచమంతటిని ఒత్తిడి చేయడం కోసం. మహిళలమంతా కలిసి మన హక్కుల కోసం గొంతెత్తి నినదిద్దాం. కలసి కదలి పోరాడుదామనే స్ఫూర్తిని మహిళలకు కలిగించడం దీని ఉద్దేశ్యం. మిత్రులు, ఉద్యోగ సహచరులు, సమూహంలో నివసించే తోటివారమంతా కలుద్దాం.

హడలెత్తిస్తున్న పరీక్షల రుసుములు

ఎడిటర్‌కు లేఖ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.నిజానికి పెరుగుతున్న ఉన్నత విద్యా ప్రవేశాలు మంచిదే అయినప్పటికీ అదే స్థాయిలో నిరుద్యోగిత కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే అవగాహన పొంది ప్రభుత్వ ఉద్యోగాలనే ఆశయంగా పెట్టుకుని తల్లిదండ్రుల ఆదాయంపై ఆధారపడి ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమించే నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటనలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వారిని కుంగదీస్తుండగా, మరొకవైపు వచ్చిన కాసిన్ని ప్రకటనల రుసుములు కూడా నిరుద్యోగుల పాలిట శాపంగా మారుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా దరఖాస్తుకై అంతర్జాల సహాయ కేంద్రాలు మొదలు పుస్తకాలు, రవాణా, భోజన ఇత్యాది కారణాలతో ప్రతీ నిరుద్యోగి తీవ్రంగా నష్టపోతున్నారు. అందులోనూ రాష్ట్ర ప్రభుత్వ నియామకాల కంటే బ్యాంకులు వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల నియామకాలు మరింత ఎక్కువ రుసుములు పెట్టడం నిరుద్యోగులకు ఇబ్బందికరంగా తయారైంది.దేశ అత్యున్నత సర్వీసు అయినటువంటి సివిల్స్ పరీక్షల వలె తక్కువ రుసుములు సహా ఇతరత్రా సంవత్సర ప్రణాళిక వంటి నిర్ణయాలతో ప్రభుత్వాలు నిరుద్యోగులకు కాసింత సాంత్వన కలిగించేలా మానవతా దృక్పథంతో ఆలోచించాలి.

– వినోద్ కుమార్ సుద్దాల

సంస్కృతి

షడ్రుచుల సేవనం

తెలుగు సంవత్సరాది వచ్చిందంటే తెలుగువారికి ఒకటే సందడి. ప్రతి ఇంటా ఉగాది పచ్చడి ఘుమఘుమలు. జీవితంలోని కష్టసుఖాలు షడ్రుచుల వంటివనీ, ఉప్పు, పులుపు, కారం, తీపి, చేదు, వగరు లాంటి ఆరు రుచులనూ ఒక్కసారే సేవిస్తే, జీవితంలో కష్టసుఖాలు కూడా ఉగాది పచ్చడి అంత సురుచికరంగా సౌకర్యవంతంగా మారి మన జీవన మనుగడకు దోహదం చేస్తాయనే నమ్మకం.



భక్ష్యాలు(బొబ్బట్లు)

కావలసిన పదార్థాలు :
మైదా : అరకిలో
పచ్చి శెనగపప్పు : పావుకిలో
బెల్లం : పావు కిలో
యాలకుల పొడి : కొద్దిగా
నెయ్యి : సరిపడా

తయారీ విధానం:
మైదాపిండి జల్లించి పెట్టుకోవాలి. మైదా పిండిలో సరిపడా నీరుపోసి ముద్దగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఒక పాత్రలో శెనగపప్పును వేసి మెత్తగా ఉడికించుకోవాలి. పప్పు ఉడికిన తర్వాత మిగిలిన నీటిని పూర్తిగా వంపేయాలి. ఈ పప్పులో బెల్లం తురుము, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. కలిపిన తర్వాత చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఇప్పుడు మైదా పిండిని చిన్నచిన్నఉండలుగా తీసుకొని సిద్ధం చేసి పెట్టుకున్న శెనగపప్పు ముద్దని మధ్యలోపెట్టి మళ్లీ ఉండలుగా చేసి కాస్త మందంగా చపాతిలా చేసి, పెనం మీద నెయ్యి వేసి కాల్చాలి.



మామిడికాయ పులిహోర

వేసవిలో లేత పులుపు గల మామిడికాయలు మనకు అందుబాటులో ఉంటాయి. వీటితో చాలా రకాల రెసిపీలు చేయవచ్చు. అయితే లేత మామిడికాయలతో చేసే పులిహోర చాలా రుచిగా ఉంటుంది. ఈ పులిహోర ఉగాది రోజు చేస్తారు. ఆరోగ్యకరమైన ఉగాది స్పెషల్ మామిడికాయ పులిహోర ఎలా తయారు చేసుకోవాలో నేర్చుకుందాం.

కావాల్సిన పదార్థాలు
అరకప్పు మామిడి తురుము
2 రెమ్మలు కర్వేపాకు
చిటికెడు పసుపు
పావు టీ స్పూన్ ఇంగువ
1 టీ స్పూన్ అల్లం తురుము
6 పచ్చిమిర్చి
3 ఎండుమిర్చి
1 టీస్పూన్ మినప్పప్పు
1 టీస్పూన్ శనగపప్పు
1 టీ స్పూన్ ఆవాలు
అర టీస్పూన్ నూనె
2 టేబుల్ స్పూన్ జీడిపప్పు
3 కప్పులు అన్నం (పొడిగా వండాలి)

తయారు చేయు విధానం
*ముందుగా అన్నం పొడిగా వండి పెట్టుకోవాలి.
*పాన్ స్టౌ మీద పెట్టి అందులో నూనె వేసి వేడయ్యాక అందులో ఆవాలు వేయాలి. ఆవాలు చిటపటలాడిన తరువాత అందులో శెనగపప్పు, మినప్పప్పు వేసి లైట్ బ్రౌన్ కలర్ వచ్చే వరకూ వేయించుకోవాలి. వెంట వెంటనే అందులో పచ్చిమిర్చి, ఎండు మిర్చి ముక్కలు, అల్లం తురుము, కరివేపాకు, అల్లం, పసుపు, ఇంగువ వేసి, కొన్ని సెకండ్లు తక్కువ మంట మీద వేగించుకోవాలి.
*పోపు వేగిన తర్వాత అందులో పచ్చి మామిడి తురుము వేసి మరికొన్ని నిముషాలు వేయించాలి.
*తర్వాత అందులోనే రోస్ట్ చేసి పెట్టు కొన్నవేరుశెనగలు, జీడిపప్పు వేసి మిక్స్ చేసి స్టౌ ఆఫ్ చేసి పక్కన పెట్టుకోవాలి.
*ఇప్పుడు ముందుగా వండి పెట్టుకొన్న అన్నంను పోపులో వేసి, ఉప్పు చిలకరించి మొత్తం మిశ్రమాన్ని కలగలుపుకోవాలి. ఉగాది స్పెషల్ మామిడికాయ పులిహోర రెడీ.



ఉగాది పచ్చడి

కావల్సిన పదార్థాలు..ఒక చెంచా వేపపువ్వు, చిన్న చెరకు ముక్క, చిన్న కొబ్బరి ముక్క, ఆరు అరటిపళ్లు. నిమ్మకాయంత చింతపండు, చిన్న మామిడికాయ, 100గ్రా. బెల్లం, ఒక పచ్చి మిరపకాయ, చిటికెడు ఉప్పు, రెండు ఏలకులు, రెండు గ్లాసుల నీళ్లు.

తయారీవిధానం..ముందుగా చెరకు,కొబ్బరి, బెల్లం, మిరపకాయ, మామిడికాయలను చిన్నచిన్న ముక్కలుగా చేసుకుని విడివిడిగా జాగ్రత్తగా పెట్టాలి. వేప పువ్వును శుభ్రపరిచి రేకల్ని మాత్రం పక్కన పెట్టుకోవాలి. ఏలకులు గుండగా చేసి అట్టేపెట్టాలి. రెండు గ్లాసుల నీళ్లలో చింతపండును బాగా పిసికి, పులుపు నీళ్లను ఒక గిన్నెలోకి వడగట్టాలి. అందులో బెల్లం గుండను వేసి బాగా కలియబెట్టాలి. ఆ తర్వాత అరటిపళ్లను బాగా ముద్ద చేసి ఆ నీళ్లలో కలపాలి. ఎక్కడా అరటి పండు ముక్కలు ఉండకూడదు. అందులో చిటికెడు ఉప్పు, ఏలకల గుండ, కొబ్బరి, మిరపకాయ, మామిడికాయ ముక్కల్ని వేసి బాగా కలపాలి. అంతే పచ్చడి సిద్ధం.



బంగారపు రంగు... పూర్ణం బూరెలు

కావలసిన పదార్థాలు: పచ్చి శనగపప్పు:పావు కిలో, బెల్లం: 200 గ్రా,యాలకుల పొడి: కొద్దిగా,నెయ్యి: 4 స్పూన్లు పూతపిండికి,మినపప్పు: 1 గ్లాసు,బియ్యంపిండి: 2 గ్లాసులు,ఉప్పు: చిటికెడు, నూనె: వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: మినపప్పు రెండు గంటలు పాటు నానబెట్టుకుని మెత్తగా రుబ్బుకుని తడిపిన బియ్యంపిండిలో వేసి తగినంత ఉప్పు కలిపి ఒక గంట నాననివ్వాలి. శనగపప్పు కుక్కర్లో పప్పులా ఉడికించుకోవాలి. నీరు లేకుండా వడకట్టాలి. అందులో బెల్లం తరిగి కలపాలి. అదే పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి పై మిశ్రమం వేసి వేయించి ఉడికించాలి. నీరు ఇగిరిన తర్వాత మిశ్రమం ఓ గిన్నెలో వేసి చల్లార్చాలి. ఆ తర్వాత చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఈ ఉండలను రెడీగా ఉన్న పిండిలో ముంచి కాగిన నూనెలో వేసి దోరగా బంగారు రంగు వచ్చేవరకు వేయించి తీసుకోవాలి.

పచ్చడి ప్రయోజనాలు!

ఉగాది పచ్చడి ఆధ్యాత్మికంగానే కాకుండా ఆరోగ్యపరంగాను మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఉగాది పచ్చడిని వేపపువ్వు, చింతపండు, మామిడికాయలు, బెల్లం, మిరియాలు, ఉప్పు వేసి తయారుచేస్తారు. వాటి ఉపయోగాలేంటో చూద్దాం..

*** వేప పువ్వు:** ఇందులో రోగనిరోధక లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రుతువుల్లో వచ్చే మార్పు వల్ల పిల్లలకు సోకే ఆటలమ్మ, స్ఫోటకం, కలరా, మలేరియాకు నిరోధకంగా పనిచేస్తుంది. గుమ్మానికి వేపాకులు కట్టడం వల్ల స్వచ్ఛమైన గాలి ఇంట్లోకి ప్రవేసిస్తుంది. దీనికి రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉంది.

*** బెల్లం :** ఇందులోనూ ఔషధ గుణాలు ఎక్కువే. ఆయుర్వేదంలో చాలా మందులకు బెల్లాన్ని ఉపయోగిస్తారు. గర్భిణులు బెల్లం తింటే రక్తప్రసరణ బాగా జరిగి శరీరానికి అవసరమైన ఇనుము పుష్కలంగా అందుతుంది. రక్తహీనత సమస్య నుంచి బయటపడతారు. అజీర్తి, పొడి దగ్గులాంటివి దూరం చేస్తుంది.

*** మామిడికాయ :** మామిడిలో పులుపు, తీపితోపాటు వగరు గుణం కూడా ఉంది. దీని వల్ల చర్మం నిగారింపు మెరుగుపడుతుంది. విపరీతమైన చలి తర్వాత వేడి వల్ల పెదాలు పగలడాన్ని మామిడిలోని వగరు గుణం నివారిస్తుంది. ఇందులోని విటమిన్ సి వ్యాధి నిరోధక శక్తి పెంపొందించి, చర్మ వ్యాధులను దూరం చేస్తుంది.

*** చింతపండు :** మామిడి ముక్కలు, చింతపండు పులుపు కలిసి మనలో ఆలోచనాశక్తిని మరింత పెంచి సన్మార్గంలో నడిపిస్తాయి. దీని వల్ల ఒత్తిడి దూరమవుతుంది. ఈ పులుపు వేసవిలో వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

***మిరియాలు :** వీటిలోని వగరు లేదా కారం గుణం తలనొప్పి, కండరాలు, నరాల నొప్పులను నివారిస్తుంది. చిటికెడు మిరియాల పొడి తీసుకుంటే అజీర్తి సమస్యలు మాయమవుతాయి. ముఖంపై మొటిమలు తగ్గించేందుకు యాంటీ బయోటిక్‌గానే కాకుండా అధిక వేడికి చక్కని ఔషధంగా పనిచేస్తాయి. ఆలోచనాశక్తిని కూడా పెంపొందిస్తాయి.

***ఉప్పు:** మానసిక, శారీరక రుగ్మతలను తగ్గించడానికి ఎంతగానో సహాయపడతాయి.

అంతేకాదు ఉప్పు లక్ష్మీ స్వరూపం. అక్షయతృతీయ రోజున బంగారం కొనే స్తోమత లేనివాళ్లు కనీసం ఉప్పు అయినా కొనాలని పండితులు చెబుతారు. ఈ షడుచుల సమ్మేళనంలో ఉప్పు కూడా ఓ భాగమైంది.

దేవుడి తొలి అడుగు

లోకంలో ఎవరికీ నేనక్కర్లేదు అన్న భావన మనిషిని ఎంతో భయంకరంగా క్రుంగదీస్తుంది. సామాజిక,ఆర్థిక, సాంస్కృతిక తేడా లేకుండా ఎప్పుడైనా, ఎవరినైనా పట్టి పీడించగల సమస్య ఇది. ప్రపంచాన్ని గడగడలాడించిన నియంత హిట్లర్ చివర్లో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు తన సైనికాధికారులతో ఇవే మాటలన్నాడు. లోతైన జీవిత సత్యాలను ఎంతో సరళంగా, ప్రభావయుక్తంగా ఆవిష్కరిస్తూ యేసుప్రభువు అత్యంత సామాన్యమైన ఉదాహరణలు తన బోధల్లో చెప్పాడు. అలాంటిదే తప్పిపోయిన కుమారుని ఉపమానం. ఇద్దరు కుమారుల్లో చిన్నవాడు తండ్రి ప్రేమను, క్రమశిక్షణను ఉల్లంఘించి, విభేదించి తన ఆస్తిని లాక్కొని దూర దేశానికి వెళ్ళిపోయాడు., స్నేహితులతో కలిసి అదంతా దుబారా చేశాడు. డబ్బు అడుగంటిన మరుక్షణం అంతా అతన్ని వదిలి ఒంటరివాణ్ణి చేశారు.చివరికి పూటగడవని దీనావస్థలో తండ్రిని గుర్తు చేసుకొని ఇంటికి తిరిగొచ్చాడు. కోపంతో తండ్రి ముందు తిట్టినా, ఆ తర్వాత కనీసం పనివాడిగానైనా తనను చేరదీస్తాడన్న నమ్మకం అతనిది. కానీ అతని అంచనాలన్నీ తారుమారయ్యాయి. తాను ఇల్లు వీడిన మరుక్షణం నుండి తన మీద బెంగతో తండ్రి క్రుంగి పోతున్నాడని, ఒకప్పుడు ఎంతో సందడిగా ఉండే ఇల్లు తాను వదిలేశాక కళ తగ్గి వెల వెల బోతోందని అతను తెలుసుకున్నాడు. తండ్రి అతన్ని గట్టిగా హత్తుకొని, ముద్దుపెట్టి. ఆనందం పట్టలేక ఏడ్చేశాడు. చనిపోయాడనుకున్న నా కొడుకుతిరిగొచ్చాడంటూ సంబరాలు, విందులు చేశాడు. కొడుకు తిరిగొచ్చిన ఆనందంతో ఆ ఇల్లు పరలోకంగా మారింది.

ఈ లోకంలో మనం ఎవరికి అవసరమున్నా లేకున్నా, దేవునికి మాత్రం మనలో ప్రతి ఒక్కరూ కావాలి. ఎందుకంటే ఈ విశ్వాన్నంతా దేవుడు తన బిడ్డలైన మనకోసమే చేశాడని బైబిల్ చెబుతోంది. అయితే దేవునితో విభేదించి లోకాన్ని స్నేహించిన కారణంగా హింస,కుట్రలు, స్వార్థం, అపవిత్రత, అసూయ, ద్వేషం లాంటి లోకస్నేహితుల దుర్మార్గపు ప్రభావంలో పడి దేవుడిచ్చిన 'దైవిక విశిష్ట వ్యక్తిత్వం' పోగొట్టుకున్నాం. నకిలీది, కృత్రిమమైనది,మనది కానే కానిదీ అయిన ఒక 'విషపూరిత తత్వాన్ని' ధరించుకొని ఇపుడు తిరుగుతున్నాం. మతాలుగా విడిపోయి, మనకు తెలియకుండానే దోపిడీ ముఠాలుగా ఏర్పడ్డాం. ప్రేమ,క్షమా లేని కుట్రపూరితమైన, దౌర్జన్యపూరిత్తమైన జీవన శైలి కలిగి ఉండే వాళ్ళు దేవుని పిల్లలెలా అవుతారు? అది చర్చి, దేవాలయం, మసీదు, గురుద్వారా, దర్గా ఏదైనా సరే అపవిత్రత, అవినీతి, మోసం, వివక్ష, స్వార్థం, ఆశ్రిత పక్షపాతం వంటివి అక్కడ రాజ్యమేలుతూవుంటే అవి దేవుని సన్నిధికి నిలయాలేలా అవుతాయి? ఈ దుర్లక్షణాలన్నీ దేవుడు హేయమైనదిగా భావించే 'పాపం' అనే నారింజపండు లోని తొనలు. మనిషి దేవుని నుండి దూరమయ్యాడన్నది యుగయుగాల వాస్తవం. అదే అతన్ని పాపానికి దగ్గర చేసింది. మళ్ళీ దేవునికి దగ్గరకావడం ద్వారా అతడు తన పాపస్వభావం నుండి ప్రక్షాళనం పొందుతాడు. అలా విశ్వాసిగా మారి తాను పూర్వానందాన్ని పొందడమే కాక, లోకాన్ని కూడా ఆనంద భరితం చేస్తాడు. ఇదే యేసు బోధల బైబిల్ సారాంశం. మనిషితో తన అనుబంధాన్ని పునరుద్ధరించుకోవడానికి దేవుడే తొలి అడుగు వేశాడు, మనిషిని తిరిగి తాను సంపాదించుకునే వరకూ దేవుడు ప్రయత్నిస్తూనే ఉంటాడని రాబోయే గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సందర్భాలు గుర్తు చేస్తాయి.





రెవ.టి.ఎ. ప్రభుకిరణ్
98488 21472

దాహం తీర్చడమూ పుణ్యప్రదమే

వేసవి ఉష్ణోగ్రతలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఎండవేడిమి కాక పుట్టిస్తోంది. ఎండనుండి రక్షణ కోసం ఇంట్లో కూలర్లు, ఏసీలు ఇలా ఎవరి తాహతుకు తగ్గట్టు వాళ్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సాయంత్రం అయితే చాలు చల్లని పానీయాలు, లస్సీ, పళ్ల రసాలతో సేదతీరుతున్నాము. ఎండతాపాన్నుంచి బయటపడే మార్గాలన్నీ ఇలా ఎవరికి తోచిన విధంగా వాళ్లు సంసిద్ధం చేసుకుంటాము. కొందరు పుణ్యాత్ములు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు నిజంగా అభినందనీయులనే చెప్పాలి. ఆకలి గొన్న వానికి అన్నం పెట్టడం, దప్పికగొన్నవాని దాహం తీర్చడం కూడా పుణ్యప్రదమేనని ముహమ్మద్ ప్రవక్త ప్రబోధించారు. మూగజీవాల, పశుపక్షాదుల ఆకలి తీర్చడం, వాటి దాహార్తిని తీర్చడం కూడా పుణ్యప్రదమేనని ముహమ్మద్ ప్రవక్త చెప్పారు. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) తన అనుచర శిష్యగణానికి పూర్వం ఒక వ్యక్తి కుక్క దాహం తీర్చి స్వర్గంలోకి వెళ్లిన సంఘటన గురించి వివరించారు.

''ఒక వ్యక్తి మిట్టమధ్యాహ్నం వేళ పని మీద బయలుదేరాడు. ఎండతాపంతో నాలుక పిడచకట్టుకుపోసాగింది. కనుచూపుమేరలో ఒక చిన్న బావిని చూడగానే దప్పిక తీర్చుకునేందుకు బావిదగ్గరకు చేరుకున్నాడు. అతికష్టమ్మీద బావిలో దిగి దోసెళ్లతో నీళ్లను పట్టుకొని తృప్తిగా నీళ్లుతాగి దాహార్తిని తీర్చుకున్నాడు. బావినుంచి బయటికి వచ్చి వచ్చిన దారిన వెళుతుండగా ఒక కుక్క మాత్రం దాహంతో బురదను నాకుతూండటాన్ని చూసి చలించిపోయాడు. వెంటనే తన దప్పిక బాధ అనుభవంలోకి వచ్చింది. వెంటనే బావిలోకి దిగి తన రెండు చర్మపు మేజోళ్లతో నీళ్లు పీల్చుకున్నాడు. నీళ్ల మేజోళ్లను దంతాల సహాయంతో బిగపట్టుకుని బావిలో నుంచి పైకి వచ్చి దప్పికతో అలమటిస్తున్న కుక్కకు నీళు త్రాపించి దాహాన్ని తీర్చాడు. అల్లాహ్ అతని పాపాలను మన్నించి నిత్యస్వర్గలోకానికి వారసుడిగా చేశాడు.'' ప్రవక్త సహచరులు ఈ విషయంలో ఆశ్చర్యపోతూ ''పశువుల దాహం తీర్చినంతమాత్రానికే అల్లాహ్ స్వర్గం ప్రసాదిస్తాడా'' అని ప్రశించారు. దానికి ప్రవక్త ''పక్షులైనా, జంతువులైనా, మనుషులైనా నోరున్న ఏ ప్రాణి పట్ల దయచూపినా అల్లాహ్ ప్రసన్నత తప్పక దక్కుతుంది.'' అని చెప్పారు. నోరులేని మూగజీవాల దాహార్తిని తీరిస్తేనే అల్లాహ్ ప్రసన్నుడయ్యి స్వర్గలోకాన్ని ప్రసాదిస్తే ఇక మన తోటి మానవ మాత్రుల దాహార్తిని తీరిస్తే అల్లాహ్ ఇంకెంత ప్రసన్నడవుతాడో అంచనా వేయవచ్చు. అందుకే ఈ వేసవిలో మూగజీవాల దాహం తీర్చి ఎన్నో పుణ్యాలను మూటగట్టుకోవచ్చు. మన ఇళ్ల మేడలపై, కిటికీలలో, బాల్కనీ ప్రదేశాలలో, ఇంటిముందు వసారాల్లో తిండిగింజలు, మంచినీళ్ల ఏర్పాటు చేయండి. నీళ్లను మట్టి కుండల్లో పెట్టడం మాత్రం మర్చిపోకండి. ఎందుకంటే మట్టిపాత్రల్లో నీళ్లు చల్లగా ఉంటాయి. పక్షులు, పావురాలు తాగడానికి వీలుగా ఉంటుంది. ఒకవేళ మనచుట్టు పరిసరప్రాంతాల్లో పశువులున్నట్లయితే వాటికోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి. పశుపక్షాదులు, మూగజీవాల దాహం తీర్చడమే కాకుండా మన ప్రాంతాల్లో పేదల వాడలను గుర్తించి అక్కడ చల్లటి మంచినీటిని ఏర్పాటు చేయాలి. వలస కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, బాటసారులు, ప్రయాణీకుల దాహం తీర్చాలి. స్థితిమంతులు మంచినీటి కటకట ఉన్న ప్రాంతాల్లో బోర్ వెల్ త్రవ్వించడం, ట్యాంకుల ద్వారా ఆ ప్రాంతాలకు నీటి సరఫరా చేయడం చేస్తే అల్లాహ్ అనుగ్రహానికి నోచుకోవచ్చు.

మంచినీళ్లు తాగే పద్ధతులు

*ముహమ్మద్ ప్రవక్త (సఅసం) మంచినీటిని తాగే పద్ధతులను వివరించారు.
*మంచినీళ్ల గ్లాసును కుడిచేత్తో తీసుకొని తాగాలి.*కూర్చుని తాగాలి. *నీళ్లగ్లాసును చూసి తాగాలి. *తాగేముందు బిస్మిల్లాహ్ పఠించాలి *ఎత్తిన గ్లాసును దించకుండా ఒకే శ్వాసలో తాగరాదు. పశువుల్లాగా ఒకే గుటకలో నీళ్లు తాగరాదు.*కనీసం మూడు శ్వాసల్లో నీళ్లు తాగాలి. *నీళ్లు తాగిన తరువాత 'అల్ హందులిల్లాహ్' అని పలికి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి.



ముహమ్మద్ ముజాహిద్
96406 22076



బిజెపి కనుసన్నల్లో టిఆర్ఎస్

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఒకవైపు సిఎం కెసిఆర్ మూడో ప్రత్యామ్నాయం పేరు వల్లిస్తుంటే మరో వైపు బిజెపి సర్కారుకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెడుతుంటే టిఆర్ఎస్ సభ్యులు పార్లమెంట్‌లో గందరగోళం చేస్తూ అడ్డుపడుతున్నారని సిఎల్‌పి ఉపనేత టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. బిజెపి కనుసైగలతో టిఆర్ఎస్ నడుచుకుంటోందన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ విభజన హామీల అమలు కోసం విపక్షాలు పోరాడుతుంటే, టిఆర్ఎస్ వైఖరి అందుకు విరుద్ధంగా ఉన్నదన్నారు. వ్యవసాయ పెట్టుబడి గిట్టుబాటు ధరకు ప్రత్యామ్నాయం కాదన్నారు. రుణ మాఫీ లబ్దినే ఇప్పటికీ రైతు పూర్తి స్థాయిలో పొందలేక పోయారని చెప్పారు.

కెసిఆర్ శక్తేంటో త్వరలో తెలుస్తది

మన తెలంగాణ / హైదరాబాద్ : సిఎం కెసిఆర్ ప్రతిపాదించిన కొత్త జాతీయ ప్రత్యామ్నాయాన్ని కాంగ్రెస్ నేత జైపాల్ రెడ్డి హేళన చేయడం సరికాదని టిఆర్ఎస్ ఎంఎల్‌సి ఎస్.జైపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వరస ఓటములు జీర్ణించుకోలేక జైపాల్ రెడ్డి కెసిఆర్ ఆలోచనలను తప్పు బడుతున్నారని విమర్శించారు. కెసిఆర్ శక్తి ఏమిటో త్వరలోనే దేశం చూడబోతోందన్నారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన జైపాల్ రెడ్డి అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తనను సమర్థించుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.



వంతెనలు, రోడ్లకు రూ.9.95కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయత్‌రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు వంతెనలు, రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.9.95కోట్లు మంజూరు చేసింది. మెదక్ జిల్లా చిత్కూర్– బాచుగూడ మధ్యలో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణానికి తొలుత 1.50కోట్ల అంచనాలతో అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం దీని అంచనా వ్యయాన్ని పెంచి 2.20కోట్లు మంజూరు చేసింది. ఆదిలాబాద్ నుంచి ఖండాలకు బీటి రోడ్ నిర్మాణానికి మొదట రూ.308.70కోట్లు మంజూరు చేయగా ప్రస్తుతం దీనిని రూ. 312.75 కోట్లకు పెంచి అనుమతులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా చెరికొండ నుంచి పల్లెచెల్క తాండకు రోడ్ కోసం రూ. 1.97కోట్లు, సిద్దిపేట జిల్లా రామన్నగూడెం వద్ద రాజీవ్ రహదారిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 1.75కోట్లు, నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 90లక్షలు మంజూరు చేశారు. వీటికి పరిపాలన అనుమతులు ఇస్తూ పంచాయత్‌రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

అసెంబ్లీ కార్యదర్శికి కోమటిరెడ్డి దరఖాస్తు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఈ నెల 12న అసెంబ్లీ లో జరిగిన అంశాలపై సిసి టివిల ఫుటేజ్‌లు ఇవ్వాలని మాజీ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాచార హక్కు చట్టం కింద అసెంబ్లీ కార్యదర్శికి దరఖాస్తు చేశారు.

బిసిలకు న్యాయం చేయాలి: జాజుల

మన తెలంగాణ/హైదరాబాద్: బడ్జెట్‌లో బిసిలకు జరిగిన అన్యాయాన్ని సవరించి న్యాయం చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సిఎంను కోరారు. బడ్జెట్ కేటాయింపులపై శాస్త్రీయంగా చర్చించి, భవిష్యత్ కార్యచరణను రూపకల్పనకు 22న హైదరాబాద్‌లో 112 బిసి సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని జాజులశుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

బడ్జెట్‌లో బిసిలకు అన్యాయం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు ప్రభుత్వం అన్యాయం చేసిందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగాచారి అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతనాలుగు సంవత్సరాలలో బిసిలకు కేవలం రూ. 11వేల కోట్లు కేటాయించి, నామమాత్రంగా ఖర్చు పెట్టారని చెప్పారు. ఎంబిసిలకు రూ.ఒక వెయ్యి కోట్లు కేటాయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తలసరి రాబడిలో 3వ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో రూ. 3,15,745గా ఉంది. అత్యంత తక్కువగా నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ. 82,694గా ఉంది. రాష్ట్రంలోని పది జిల్లాల్లో తలసరి ఆదాయం లక్ష రూపాయలు మించలేదు. కేవలం రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో రూ. 1.30 లక్షల కంటే తక్కువే ఉంది. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమే అయినప్పటికీ మూడవ స్థానంలో (చిన్న రాష్ట్రాలను మినహాయిస్తే) నిలిచింది. 2011–12 ఆర్థిక సంవత్సరంలో దేశ సగటు తలసరి ఆదాయం రూ. 63,462 ఉన్నప్పుడు కూడా తెలంగాణ (అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం) తలసరి ఆదాయం రూ. 91,121గా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ తలసరి ఆదాయం రూ. 1,12,764గా ఉంటే తెలంగాణ మాత్రం రూ. 1,75,534 సాధించగలిగింది. రాష్ట్ర జిడిపి పెరుగుదల కారణంగా తలసరి ఆదాయం కూడా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో తలసరి ఆదాయంలో వృద్ధిరేటు 8.6% ఉంటే తెలంగాణలో మాత్రం అది 13.4%గా నమోదైంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ జిఎస్‌డిపి, తలసరి ఆదాయంలో వృద్ధి కొనసాగుతూనే ఉంది. వ్యవసాయానికి అనువైన సాగునీటితో పాటు విద్యుత్, విత్తనాలు, అవసరమైన మోతాదులో ఎరువులు తదితరాలను సమకూర్చడం వలన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మెరుగుదల కనిపించిందని, ఆ ప్రభావం మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చిందని ఆర్థికశాఖ అధికారులు వ్యాఖ్యానించారు. రాష్ట్ర జిడిపి గణాంకాలను పరిశీలించినా మొత్తం రూ. 7,32,657 కోట్లకు చేరుకోవడంతో గతేడాదితో పోలిస్తే 14.1% (ప్రస్తుత ధరల సూచిని పరిగణనలోకి తీసుకుంటే) వృద్ధిరేటు నమోదైంది. జాతీయ స్థాయిలో ఇది కేవలం 9.8% మాత్రమే. దేశ జిడిపిలో తెలంగాణ రాష్ట్ర జిడిపి (జిఎస్‌డిపి) 4.37%గా ఉన్నట్లు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన 'సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2018'లో వెల్లడించింది. రాష్ట్ర జిడిపిలో సైతం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలదే అగ్రస్థానం. మొత్తం రూ. 7,32,657 కోట్ల జిఎస్‌డిపిలో హైదరాబాద్ రూ.1,45,207 కోట్లు, రంగారెడ్డి రూ. 1,09,135 కోట్లు, మేడ్చల్ రూ. 53,262 కోట్లుగా ఉంది. కనిష్టంగా కొమురంభీం లో రూ. 6,253 కోట్ల మేరకు జిఎస్‌డిపిలో నమోదైంది.

కులపత్రం ఇవ్వలేదని దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఫోన్ చేయడంతో సుమారు 20 మంది తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని స్పెషల్ ఆర్ఐ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనిరుధ్, విఆర్ఐ పూర్ణ, విఆర్ఒ రేఖలపై దాడి చేశారు. వెంటనే వీరిని చికిత్సం నిమిత్తం మహావీర్ ఆస్పత్రికి తరలించారు. దాడిలో ప్రధాన నిందితుడు నరేన్‌తో పాటు మరో ఆరు మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉద్యోగుల విధుల బహిష్కరణ...

ఆసిఫ్‌నగర్ మండలం తహసీల్దారు కార్యాలయం సిబ్బందిపై జరిగిన దాడికి నిరసనగా జిల్లాలోని రెవిన్యూ సిబ్బంది శనివారం విధులు బహిష్కరించి కలెక్టర్ కార్యాలయంలో నిరసన చేపడుతున్నట్లు హైదరాబాద్ రెవిన్యూ ఎంప్లాయీస్ జెఎసి ఒక ప్రకటనలో తెలిపింది. నిరసనలో జిల్లాలోని అన్ని సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొంటారని పేర్కొంది.

అంకె తప్పకుండా..

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు తెలిసింది. విపక్షాలు చేస్తున్న వాదనల్లో ఏది తప్పో వివరమైన గణాంకాలను ప్రస్తావించాలని, అసెంబ్లీ రికార్డుల్లో ఇది నమోదయ్యేలా నిర్దిష్టంగా ఇప్పటివరకు వివిధ పార్టీల నాయకులు చేసిన విమర్శలకు సంబంధించిన అంశాల గణాంకాలను సిద్ధం చేయాల్సిందిగా అధికారులకు సూచించినట్లు సమాచారం. అంతిమంగా ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొన్న పథకాల వివరాలు, చేసిన కేటాయింపులతో ప్రజల్లోకి వెళ్ళాలని సిఎం భావిస్తున్నారు. విమర్శలను రాజకీయంగా తిప్పికొట్టడానికి బదులుగా అసెంబ్లీ వేదికగానే ఆ ఆరోపణల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేయాలనే వ్యూహం మేరకే సమావేశం జరిగినట్లు తెలిసింది.

అసైన్డ్ భూముల్లో ఇటుక బట్టీలు



మన తెలంగాణ/రేగోడ్ : ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ అసైన్డ్ భూములలో ఇటుక బట్టీలను యధేచ్ఛగా నిర్వహిస్తున్నారు. మెదక్ జిల్లా రేగోడ్ మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామ శివారులో గల ప్రభుత్వ అసైన్డ్ భూములలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ బట్టీల ద్వారా కాలుష్యం ఏర్పడడంతో పాటు వనాలను, చెట్లను నరికి చట్ట విరుద్ధమైన పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే వాల్టా చట్టానికి అక్రమ ఇటుక బట్టీల నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో నిర్వాహకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. కాగా ఈ ఇటుక బట్టీలలో కార్మికులతో పాటు బాల కార్మికులు పనిచేస్తున్నారు. ఇటుక బట్టీలపై

చోద్యం చూస్తున్న అధికారులు, వాల్టాకు తూట్లు

చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడంతో ప్రజలు మండిపడుతున్నారు. బట్టీల ఏర్పాటులో సాధారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా సదరు నిర్వాహకులు పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఇటుక బట్టీలను పంట పొలాల మధ్య ఏర్పాటు చేయడంతో వ్యవసాయ భూమి సారవంతం తగ్గి పంటలు పండకుండా పోతున్నాయి. ఇటుక బట్టీల నిర్వాహణకు బొగ్గు అవసరం ఉంటుందని, అందుకు ఖర్చు ఎక్కువగా కావడంతో నిర్వాహకులు దాదాపు 80 శాతం వరకు ఇటుకను కాల్చడానికి కలపను వినియోగిస్తున్నారు. దీంతో ఒక బట్టీని కాల్చడానికి ఎన్నో పెద్ద చెట్లను నేలకూల్చుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడేందుకు హరితహారం ద్వారా వేల కోట్ల రూపాయలను వెచ్చించి మొక్కలను నాటుతుంటే మరోవైపు ఇలాంటి అక్రమార్కులు అంతకు మించి చెట్లను నరుకుతున్నారు. దీంతో రోజు రోజుకూ పర్యావరణం దెబ్బతింటుంది. ఈ ఇటుక బట్టీలను నిర్వహణ కోసం ప్రభుత్వం నుండి లేదా గ్రామ పంచాయతీ నుండి అనుమతులు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి కొంతమేర పన్ను చెల్లించాల్సి ఉంటుందని, అదే విధంగా మైనింగ్ అధికారుల నుండి అనుమతులు తప్పనిసరైనప్పటికీ ఎలాంటి అనుమతులు లేకుండా బట్టీలను కొనసాగిస్తున్నారు. మరో వైపు ఈ బట్టీలకు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కువ జరుగుతుండడంతో ఇటుకకు మంచి గిరాకీ ఉంటుంది. దీనిని ఆసరా చేసుకొని ఇటుక వ్యాపారులు అధికారుల అండదండలతో తమపని తాము యేదేచ్ఛగా నిర్వహిస్తు లాభాలను గడిస్తున్నారు. అధికారులు అటువైపు కన్నెత్తైనా చూడడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

తహసీల్దార్ వివరణ



ఇటుక బట్టీల నిర్వాహణకు తప్పనిసరిగా మైనింగ్ శాఖ నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, ఎలాంటి అనుమతులు లేనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సాదత్ తెలిపారు.

టిఆర్ఎస్ ఎంపిల ధర్నా

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: రిజర్వేషన్ల పెంపు పై తెలంగాణ అసెంబ్లీ పంపించిన తీర్మానాన్ని కేంద్రం ఆమోదించి, రాజ్యాంగం సవరణ చేపట్టాలనే డిమాండ్‌తో టిఆర్ఎస్ ఎంపిలు శుక్రవారం కూడా లోక్‌సభలో నినాదాలతో హోరెత్తించారు. రిజర్వేషన్లపై రాష్ట్రాలకు అధికారా లు అప్పగించాలని గత కొన్ని రోజులుగా టి ఆర్ఎస్ ఎంపిలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు.శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ఎంపిలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను 12 గంటలకు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన తర్వాత కూడా అదే సీన్ రిపీటైంది. కావేరీ అంశంపై అన్నాడిఎంకె ఎంపిలు కూడా పట్టుబట్టారు. ఈ సందర్భంగా లోక్‌సభలో టిఆర్ఎస్ పక్షనేత జితేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధే మా ఆజెండా అని స్పష్టం చేశారు. తెలంగాణను అన్ని రంగాలలో ముందుకు తీసుకు వెళ్లడమే ధ్యేయంగా టిఆర్ఎస్ ఎంపిలు పోరాడుతారని అన్నారు. మా డిమాండ్లు మాకున్నాయని, వాటికోసమే కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అవిశ్వాసానికి మద్దతు ఇవ్వడం కన్నా, తమకు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని, వాటిపై దృష్టిసారిస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేయడంపై కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి రాధామోహన్ సింగ్‌ను తమ పార్టీ ఎంపిలు కలిశామన్నారు. ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల కోట్లాది రూపాయలు వృథా కాకుండా చూడొచ్చని కేంద్రమంత్రికి తెలిపామన్నారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని జితేందర్ రెడ్డి చెప్పారు.మధ్యాహ్నం 12గంటల వరకు సభ వాయిదా పడగానే పార్లమెంటు గేట్ నంబరు1 వద్ద టిఆర్ఎస్ ఎంపిలు జితేందర్ రెడ్డి, వినోద్ కుమార్, కవిత, కొత్త ప్రభాకర్ రెడ్డి, బూరనర్సయ్య గౌడ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు నినాదాలు వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. టిడిపి, వైసిపి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ వేరువేరుగా



చదివారు. రెండు తీర్మానాలను స్పీకర్ ఒకేసారి పరిగణలోకి తీసుకున్నారు. సభ సజావుగా జరగడానికి సహకరించాలని లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సూచించినప్పటికీ.... టిఆర్ఎస్ ఎంపిలు స్పీకర్ పోడియం వద్దనే ఉండి నిరసన కొనసాగించారు. దీంతో సభ సజావుగా సాగనందున సోమవారానికి సభను వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

అవిశ్వాసానికి మద్దతివ్వం : కెకె

ఎన్‌డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా టిడిపి, వైసిపి తీసుకువచ్చిన అవిశ్వాసానికి మద్దతివ్వబోమని టిఆర్ఎస్ స్పష్టం చేసింది. ఆ రెండు పార్టీలు తీసుకువచ్చి తీర్మానం రాజకీయ జిమ్మిక్కుగా టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు పిటిఐతో చెప్పారు. అవిశ్వాసానికి మద్దతిచ్చే ప్రశ్నేలేదన్నారు. తీర్మానం నెగ్గించుకునేందుకు వాళ్లకు అసలు సంఖ్యా బలం ఉందా అని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్లపై రాష్ట్రాలకు అధికారం కల్పించేందుకు కేంద్రంతో ఎన్నోసార్లు సంప్రదింపులు జరిపామని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు.

ఎంఎల్‌ఎల సభ్యత్వాల రద్దుపై హైకోర్టులో వాదనలు

మన తెలంగాణ/హైదరాబాద్ (లీగల్ కరస్పాండెంట్) : సభా నిబంధనల పేరిట తమ శాసనసభ సభ్యత్వాల రద్దు అనుచితం అని కాంగ్రెస్ నేతలు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లు హైకోర్టుకు విన్నవించుకున్నారు. తెలంగాణ లెజిస్లేటివ్ అసెంబ్లీ నుంచి తమను బహిష్కరించడాన్ని వీరిరువురు హైదరాబాద్ హైకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారం విచారణ సాగింది.తమ సభ్యత్వాల రద్దు విషయంలో స్పీకర్ వైఖరి సరిగ్గా లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది రవిశంకర్ జంధ్యాల తెలిపారు. స్పీకర్ అధికారాలు, పరిధి, ఆయన వ్యవహార శైలి వంటివి తీవ్ర స్థాయి రాజ్యాంగ అంశాలను లేవనెత్తుతున్నాయని స్పష్టం చేశారు. సభా నిబంధనల పేరిట తమ క్లయింట్లను స్పీకర్ బహిష్కరించారని, అయితే సభా కార్యకలాపాలకు అడ్డు తగలడం , సభా నిర్వహణకు ఇబ్బంది కల్గించడం వంటి పరిణామాల నేపథ్యంలోనే సభ్యులపై ఈ విధమైన సభా నిబంధనల పేరిట చర్యలు తీసుకోవల్సి ఉంటుందని పిటిషనర్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగం అసెంబ్లీ కార్యకలాపాల పరిధిలోకి రాదని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చిందని గుర్తు చేశారు. మరి గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిందని చెపుతున్న చర్యలకు సభా నిబంధనలను ఏ విధంగా వర్తింపచేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా రాజ్యాంగంలో ఎక్కడా కూడా సభా బహిష్కరణకు వీలుందనే అంశం లేదని న్యాయవాది విన్నవించుకున్నారు. తీసుకున్న చర్యలను బట్టి చూస్తే అధికారంలో ఉన్న వారు నిబంధనలకు విరుద్ధంగా, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతంగా వ్యవహరిస్తున్నారని వెల్లడవుతోందన్నారు. జస్టిస్ చలమేశ్వర్ వెలువరించిన సుప్రీంకోర్టు తీర్పును లాయర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. సభలోపల కూడా సహజ న్యాయ సూత్రాలు , రాజ్యాంగంలోని 14,19 అధికరణలు వర్తిస్తాయని స్పష్టం చేశారని అయితే ఈ కేసుకు సంబంధించి వీటన్నింటిని ఉల్లంఘించారని, నోటీసులు జారీ చేయలేదని, సభ్యులు తమ వాదన విన్పించుకునే అవకాశం కల్పించలేదని, అంతేకాకుండా జరిగిందని చెపుతున్న గాయం కూడా వాదన కూడా నమ్మదగ్గదిగా లేదని లాయర్ తెలిపారు. ఈ దశలో తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ డి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై జవాబు ఇచ్చేందుకు తమకు కొంత వ్యవధి కావాలని కోరారు. దీనికి సమ్మతించిన న్యాయమూర్తి ఈ అంశంపై తిరిగి విచారణ సోమవారం ఉదయం పదిన్నరకు జరుగుతుందని తెలిపారు. పిటిషనర్ల తరపు వాదనలు ముగిశాయని ఇక ప్రతివాదులు తమ వాదనలను సోమవారం తెలియచేసుకోవల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అక్రమిస్తే అంతుచూస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కోవాలని, ఒక్క ఫోన్ కాల్‌తో రాష్ట్రంలోని ఎవరికైనా ఇసుక ఏ ధరలో లభిస్తుందో తెలిసేలా విధానాన్ని రూపొందించాలని కెటిఆర్ సూచించారు. గనుల పర్యవేక్షణలో జియో ఫెన్సింగ్, జీయో టాగింగ్, ఉపగ్రహ ఛాయాచిత్రాల ఉపయోగం, డ్రోన్ల వినియోగాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో తీసుకురానున్న మైనింగ్ పాలసీ దేశంలోనే అత్యుత్తమమైనదిగా ఉండాలన్నారు. 'ఈ– ఆక్షన్' ద్వారానే గనుల, ఇసుక రీచ్‌ల లీజులు జరగాలని, ఇందుకోసం అవసరం అయిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని సున్నపు రాయి గనుల లీజుపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో వచ్చే ఈ గనుల లీజులకు గ్లోబల్ వేలం నిర్వహించాలన్నారు. గత సంవత్సర కాలంలో గనుల శాఖలో అనేక కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు మంత్రికి వివరించారు. వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో 354 తనిఖీలు నిర్వహించామని, 79 ఉల్లంఘనలు గురించి వారిపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

రాతి ఇసుకపై దృష్టి పెట్టండి : కెటిఆర్

పర్యావరణ సమతుల్యత కోసం రాక్ సాండ్ వినియోగాన్ని పెంచాలని కెటిఆర్ స్పష్టంచేశారు. ప్రభుత్వం చేపట్టిన సాగునీటి, ఆర్ అండ్ బి శాఖల నిర్మాణాల్లో ఈ తరహా ఇసుక వినియోగాన్ని పెంచడం కోసం ఆయా శాఖల ఇంజనీరింగ్ శాఖాధిపతులతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషిని కోరుతామన్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ సైతం రాక్ శాండ్ క్రషర్ల ఏర్పాటును పరిశీలించాలని ఆదేశించారు. పలు జిల్లాల్లో చేపట్టిన సాండ్ టాక్స్ విధానం విజయవంతం అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్దంగా ఉండాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను గనుల శాఖ ఆదాయం లక్ష్యాన్ని సాధించినట్లు మంత్రి తెలిపారు. ఈ సంవత్సరానికి గాను నిర్దేశిత రూ. 3166 కోట్లకు గాను మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా ఫిబ్రవరి నెలాఖరుకు రూ. 3500 కోట్లు (110 శాతం) ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ముఖ్యంగా ఇసుక ఆదాయ లక్ష్యం 388 కోట్లకు గాను 538 కోట్ల ఆదాయం (139 శాతం) ఖజానాకు లభించినట్లు తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలపై ఉక్కుపాదం మోపడంతో ప్రజల సంపద ప్రభుత్వానికి చేరిందన్నారు. ఖనిజాల ఆదాయం ప్రజల ఆస్తి అని, అది వారి అభివృద్ధికే ఉపయోగపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపైనా అధికారులతో మంత్రి కెటిఆర్ చర్చించారు. ఈ స్టీల్ ప్లాంట్‌కు ఇనుప ఖనిజం కేటాయింపులపై ఎన్‌ఎండిసి డైరెక్టర్, ఇతర ప్రతినిధులతో ఇనుప ఖనిజం కేటాయింపులపై చర్చించారు. ఇప్పటికే పలు సార్లు కేంద్రాన్ని కోరినా బయ్యారం పై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపైనా కేంద్ర గనుల శాఖను కలుస్తామన్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేయనుంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా 17 వేల రేషన్ దుకాణాల్లో 'ఇ–పాస్' విధానాన్ని అమలు చేస్తోంది. ఈ విధానంలో లబ్దిదారుల వేలిముద్రలు సేకరించి వాటి ఆధారంగా సరుకులు పంపిణీ చేస్తుంది. దాంతో బోగస్ కార్డులు లేకుండా పోయాయి. బోగస్ కార్డుల్ని ఏరివేయాలన్న పేరుతో గత కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీని ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. ఇ–పాస్ విధానం అమలులోకి వచ్చిన నేపథ్యంలో కొత్త కార్డుల్ని జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

లబ్ధిదారులందరికీ కార్డుల జారీ

ప్రస్తుతం రేషన్ దుకాణాల జాబితాలో తమ పేర్లు ఉండి, కార్డులు లేనివారికి కూడా రెండు నెలల్లో కొత్త రేషన్ కార్డులు రానున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి కొత్త ఆహార భద్రత కార్డులు ఇవ్వాలని ప్రయత్నం జరుగుతున్నా అవి అమలుకు నోచుకోలేదు. గతంలో కొత్త కార్డులు ముద్రించి జారీ చేసేందుకు సిద్ధం కాగా, అంతలోనే కొత్త జిల్లాల ఏర్పాటయ్యాయి. దాంతో పాత పది జిల్లాల పేర్లతో ఉన్న కార్డులన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. ఆ తర్వాత కొత్త కార్డుల ముద్రణ చేపట్టలేదు. ఇపాస్ విధానంలో రేషన్ సరుకులు పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో కార్డులు లేకున్నా లబ్దిదారులు రేషన్ తీసుకునే వెసులుబాటు ఉండటంతో కొత్త కార్డులు కావాలనే డిమాండ్ అంతగా రాలేదు. అయినా త్వరలోనే లబ్దిదారులందరికీ ఆహార భద్రత కార్డులు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

హోదాపై అవిశ్వాస గోదా

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: ప్రత్యేక హోదా విషయం లో ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతోన్న అన్యాయాన్ని నిరసిస్తూ లోక్‌సభలో వైఎస్ ఆర్‌సిపి, టిడిపి ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు స్పీకర్ సుమిత్రామహాజన్ చర్చకు తీసుకోలేదు. శుక్రవారం ప్రశ్నోత్తరాలు ముగిసిన తర్వాత అవిశ్వాసంపై చర్చ జరిగే అవకాశం ఉందని అంతా భావించారు. ''లోక్‌సభ నియమావళిలోని 17వ అధ్యాయం 198(బి) నిబంధన మేరకు వైఎస్‌ఆర్‌సిపి, టిడిపిలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు నాకు అందాయి. సభలో సభ్యులు ఆందోళన చేయకుండా ఉంటే దానిపై చర్చ చేపడతాను'' అని స్పీకర్ మహాజన్ చెప్పారు. ఆ సమయంలో కొన్ని పక్షాలు వేర్వేరు డిమాండ్లతో స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేస్తుండటంతో ఆమె సభను సోమవారానికి వాయిదా వేశారు. దీంతో రెండు పార్టీల నేతలు సోమవారం కూడా మరోసారి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో పాటు తృణమూల్ కాంగ్రెస్, సిపిఎం, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్‌ఆద్మీపార్టీ, ఎంఐఎం పార్టీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించాయి. లోక్‌సభ స్పీకర్ అవిశ్వాసం తీర్మానాలను చదివి వినిపిస్తున్న సమయంలో ఆయా పార్టీ ఎంపిలు నిలబడి మద్దతు ప్రకటించారు. జాతీయస్థాయిలో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఇతర రాజకీయపార్టీల మద్దతు కోసం వైఎస్సార్ పార్టీ, టిడిపి ఎంపిలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అనంతరం వైఎస్సార్ పార్టీ ఎంపి



వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ సభ ఆర్డర్‌లో లేదని లోక్‌సభను వాయిదా వేయడం అన్యాయమన్నారు. స్పీకర్ పోడియంలోకి వచ్చి ఎంపిలు ఆందోళన చేస్తున్నారనే సాకుతో సభను ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. ఎంపిలు వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళనలు చేసినా ఆర్థిక బిల్లును ఎలా ఆమోదించారని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం ఎందాకైనా పోరాడుతామని, జాతీయపార్టీల మద్దతు కూడగట్టి అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో ఎన్‌డిఎ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం టిడిపి లోక్‌సభ పక్షనేత తోట నర్సింహ్మం మాట్లాడుతూ సభ ఆర్డర్ లేదని అవిశ్వాసం నోటీస్‌ను స్పీకర్ చర్చకు చేపట్టకపోవడాన్ని తప్పుపట్టారు, టిడిపిపై, ఎపిపై కేంద్రం కక్ష సాధిస్తోందని ఆయన ఆరోపించారు. అన్ని పార్టీలను కలిసి మద్దతు కోరతామని తోట నర్సింహ్మం స్పష్టం చేశారు. సోమవారం మరో మారు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వంపై వైఎస్సార్, టిడిపి పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. కాంగ్రెస్‌తో స్నేహంగా ఉన్న 20 పార్టీలు అవిశ్వాసానికి మద్దతిస్తాయని ఎపి పిసిసి అధ్యక్షుడు రఘువీరా రెడ్డి పేర్కొన్నారు. అన్ని పార్టీలను సంప్రదించాలని లోకసభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున ఖర్గేను సోనియా ఆదేశించారని రఘువీరా తెలిపారు. ప్రత్యేక హోదాకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. మోడీ మళ్లీ ఎన్‌డిఎకు నాయకత్వం వహించి ప్రభుత్వంలోకి వస్తారని ఏ ఒక్కరూ విశ్వసించడంలేదన్నారు. అంతకముందు పార్లమెంట్ ఆవరణలోగల గాంధీ విగ్రహం వద్ద టిడిపిపి, వైఎస్సార్ ఎంపిలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు.

సభ అదుపులో ఉంటేనే అవిశ్వాసంపై చర్చ : స్పీకర్

రాజ్యాంగంలోని 75(3) ప్రకరణ ప్రకారం లోక్‌సభకు మంత్రిమండలి బాధ్యత వహిస్తుంది. దానిపై నమ్మకం కోల్పోయామని భావించినప్పుడు ఏ సభ్యుడైనా అవిశ్వాస తీర్మాన కోసం నోటీసు ఇవ్వొచ్చు. లోక్‌సభ నియమావళిలోని 17 అధ్యాయం 198(బి) నిబంధన మేరకు అవిశ్వాస తీర్మానం కోసం నోటీసును లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు ఇస్తారు. సభ అదుపులో ఉంటే అవిశ్వాసం చర్చ ఉంటుందని స్పీకర్ తెలిపారు.



మిడ్‌మానేరు నిర్వాసితులకు సత్వరమే పరిహారం

మన తెలంగాణ/హైదరాబాద్ : మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా మానువాడలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం వెంటనే విడుదల చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ కోరారు. ఈ మేరకు ఆయన సిఎంకు శుక్రవారం లేఖ రాశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో భాగంగా 2006–07లో మానువాడ గ్రామస్థులు భూములు కోల్పోయారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రం ఏర్పాటై టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినా నిర్వాసితులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. వెంటనే పరిహారం చెల్లించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రమణ డిమాండ్ చేశారు.

మైనార్టీల సమస్యలు తీర్చండి

మన తెలంగాణ/హైదరాబాద్: మైనార్టీల సమస్యల పరిష్కారానికి సిఎం ఆసక్తి చూపడం లేదని టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్ అన్నారు. ముస్లిం కాంప్లెక్స్ భవన్‌కు శంకుస్థాన చేశారే కాని నిధులు కేటాయించలేదన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు బి.ఎన్.రెడ్డి, కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇస్లామిక్ సెంటర్‌కు స్థలం అలాట్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటిస్తామన్నా అమలు చేయడం లేదన్నారు.

ఎయిర్‌పోర్టులో బుల్లెట్ల కలకలం

మన తెలంగాణ/శంషాబాద్ : ఎయిర్‌పోర్టులో శుక్రవారం సాయంత్రం బుల్లెట్ల కలకలం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుండి బ్యాంకాక్ వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ వైఎస్‌ఆర్‌సిపి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బ్యాగ్‌ను స్కానింగ్ చేయగా అందులో నాలుగు 32 లైవ్ బుల్లెట్స్ లభ్యమైనట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టులోని సిఐఎస్‌ఎఫ్ అధికారులు బుల్లెట్లను స్వాధీనం చేసుకొని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. బుల్లెట్లకు సంబంధించిన లైసెన్స్ చూపించడంతో విచారించి పంపించినట్లు తెలిపారు.

ఎయిర్ బస్ అత్యవసర ల్యాండింగ్

మన తెలంగాణ/శంషాబాద్ : ఎయిర్‌బస్ 380 విమానం అత్యవసరంగా ల్యాండ్ అయిన సంఘటన శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయ్ నుండి బ్యాంకాక్ వెలుతుండగా విమానంలో ఒక ప్రయాణికుడు అస్వస్థతకు గురికాగా విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఎసిటి అధికారుల అనుమతితో అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు తెలిపారు. ప్రయాణికుని ఆసుపత్రికి తరలిస్తుండగా ఎయిర్‌పోర్టులోని వీల్ చైర్‌లోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సూడాన్ దేశానికి చెందిన మహ్మద్ అలీగా గుర్తించామన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత

22 ఎద్దులు స్వాధీనం, నలుగురిపై కేసు నమోదు

మన తెలంగాణ/కాగజ్‌నగర్ టౌన్ : మహారాష్ట్ర నుండి కరీంనగర్‌కు లారీలో అక్రమంగా పశువులను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర నుండి కాగజ్‌నగర్ మీదుగా ఓ లారీలో పశువులను (ఎద్దులు) తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పట్టణ ఎస్‌ఐ బాలి ప్రభాకర్ రెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో మాటు వేసి వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంలో 23 ఎద్దులు ఉండగా, అందులో నుండి ఒక ఎద్దు చనిపోయినట్లు తెలిపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ఈ వాహనాన్ని పట్టుకున్నామని, పోలీస్ సిబ్బంది మధు, రవిలు చాకచక్యంగా వ్యవహరించారని చెప్పారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి పట్టుకున్న పశువులను కోసినిలో త్రినేత్ర రాధాగోపాల కృష్ణ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

అతి కిరాతకంగా యువకుని హత్య

పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితులు

మన తెలంగాణ / పెద్దమండడి : మండల పరిధిలోని బలిజపల్లి తండా ఎర్రగడ్డ తండాలో గత మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఓ హత్య కేసులో నిందితున్ని గురువారం రాత్రి అదునుచూసి అతి కిరాతకంగా హత్య చేసి సమీపంలోని చెరువు కట్టపై పూడ్చిపెట్టిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం ప్రకారం.. ఎర్రగడ్డ తండాకు చెందిన రవి గత కొన్ని సంవత్సరాల క్రితం నుండి ముంబాయిలో నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. తల్లిదండ్రులు ఇద్దరు కూడా చనిపోవడంతో తమ్ముడు సురేష్, చెల్లెలు సునీతలు, బాబాయ్ శంకర్ దగ్గర ఉంటున్నారు. మూడు సంవత్సరాల క్రితం ముంబాయిలోని ఇంటి విషయమై ఎర్రగడ్డ తండాకు చెందిన లోక్యాతో రవి గొడవ పడి అతన్ని హత్య చేసిన కేసులో నిందితునిగా ఉన్నాడు. ఈ సంఘటనలో రవి కొన్ని రోజుల పాటు జైల్లో కూడా ఉండి ఇటీవల జైలు నుండి విడుదలయ్యాడు. చెల్లెలు సునీత పెళ్లి సంబంధం కోసం గురువారం సాయంత్రం ముంబాయి నుండి రవి ఎర్రగడ్డ తండాకు వచ్చాడు. ఇదే అదనుగా భావించిన గతంలో రవి చేతిలో హత్యకు గురైన లోక్యా తండ్రి గోవింద్, హూంలా, సీత్యా ముగ్గురు వ్యక్తులు రవిని అతి కిరాతకంగా బండరాయితో మోది హత్య చేసి అక్కడి నుండి తీసుకెళ్లి మృతదేహాన్ని కుంటకట్ట సమీపంలో పాతిపెట్టారు. నిందితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తామే హత్య చేసినట్లుగా ఒప్పుకొని లొంగిపోయారు. మృతుని బాబాయ్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్లమెంటులో బిసి కమిషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయండి

ఢిల్లీలో 62 మంది ఎంపిలకు బిసి నేతల వినతి

మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే తెచ్చేలా కృషి చేయాలని వివిధ పార్టీల పార్లమెంటు సభ్యులకు తెలంగాణ బిసి నేతలు విజ్ఞప్తి చేశారు. ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 62 మంది ఎంపిలను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. టిడిపి, జనతాదళ్ (యునైటెడ్), బిజూ జనతాదళ్, తృణముల్ కాంగ్రెస్, అన్నా డిఎంకె, డిఎంకె, కాంగ్రెస్, ఎస్‌ఫి, ఆర్‌జెడి, బిఎస్‌పిలకు చెందిన పార్లమెంటు సభ్యు లను కలిసి చర్చలు జరిపినట్లు ఆర్ కృష్ణయ్య తెలిపారు. వెంటనే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపచేయక పోతే పార్లమెంటు సభ్యుల ఇళ్ళ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. పార్లమెంటులో 32 పార్టీల ఎంపీలున్నా ఒక్క పార్టీ కూడా బిసిల గురించి పట్టించుకోక పోవడం దుర్మార్గమని ఈ సందర్భంగా కృష్ణయ్య అన్నారు.

ఒబిసి రిజర్వేషన్లను వర్గీకరించాలి

కేంద్ర స్థాయిలో ఓబిసి రిజర్వేషన్లను ఎబిసిడిఇ గ్రూపులుగా విభజించాలని జాతీయ బిసి కమిషన్ చైర్మన్ జస్టిస్ రోహిణికి ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ప్రతినిధి బృందంలో బిసి నేతలు నీలం వెంకటేశ్, భూపేష్ సాగర్, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్ ఉన్నారు.

రైతు బడ్జెట్ కానే కాదు

సత్యాగ్రహ యాత్రలో ప్రొఫెసర్లు కోదండరాం, యోగేంద్ర యాదవ్



మన తెలంగాణ/సూర్యాపేట : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టి జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, స్వరాజ్ అభియాన్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ అన్నారు. ప్రభుత్వాలు బడ్జెట్ ప్రవేశపెట్టడంలో చూపినంత హడావుడి రైతును ఆదుకోవడంలో కన్పించడం లేదని విమర్శించారు. రైతు ప్రయోజనాలను కాపాడే బడ్జెట్‌గా చెప్పుకొంటున్న ప్రభుత్వాల మాటల్లో పసలేదన్నారు. రోజురోజుకు వ్యవసాయ ఉత్పత్తులలో ఖర్చులు పెరిగి పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌పి సత్యాగ్రహ యాత్రలో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతు పండించిన పంటలను పరిశీలించి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధర వివరాలను ఇరువురు అడిగి తెలుసుకున్నారు. కాగా, టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్థూల ఆధాయం లక్ష 30 వేల కోట్లుకాగా, బడ్జెట్ మాత్రం లక్ష 70 వేల కోట్లకు ప్రవేశపెట్టామనడం ప్రజల్ని సందేహాత్మకంలో పడేసిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆయన వెంట జెఏసి కో ఛైర్మన్ ఇటికాల పురుషోత్తం, రైతు జెఏసి కన్వీనర్ కన్నెగంటి రవి, స్టీరింగ్ కమిటీ సభ్యులు సూరం ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ గడ్డకు సింగూరు జలాలు


మిషన్ భగీరథ నీటికి పూజలు చేస్తున్న మంత్రి పోచారం

మన తెలంగాణ/ కామారెడ్డి : మిషన్ భగీరథ పనులపై ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుండగా సిఎం కెసిఆర్ ఆదేశాలతో ప్రతిష్టాత్మక పథకం ఉద్దేశం నెరవేరింది. 105 కిలోమీటర్ల మేర ప్రధాన పైప్‌లైన్ నిర్మించడంతో సింగూరు జలాలు బాన్సువాడ గడ్డకు చేరాయి. భగీరథ ప్రయత్నంతో ప్రభుత్వం విజయాన్ని ముద్దాడింది. 2019లో ఇంటింటా సురక్షిత తాగునీరు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏడాది ముందుగానే లక్ష్యాన్ని చేరుకుంది. ఈ పనులు పూర్తవడంతో కామారెడ్డి జిల్లాలో తాగునీటి ఎద్దడి పటాపంచలవనుంది. ఊహించని రీతిలో పనులు వడివడిగా చేపట్టిన అధికారులు ట్రయల్ రన్ చేపట్టి విజయవంతం చేశారు. త్వరలోనే సాంకేతిక పనులను పూర్తిచేసి ఇంటింటా నీరందిస్తామని భరోసా నింపడంతో జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లాలో తొలిసారిగా తన నియోజకవర్గ కేంద్రానికి మిషన్ భగీరథ నీటిని తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ. 42వేల కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపట్టింది. 26 సెగ్మెంట్ల ద్వారా కృష్ణ, గోదావరి, మంజీరా నదుల నుండి 60 టిఎంసిల నీటిని తాగునీటి అవసరాలపై వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇందులో భాగంగా 1,70,000 కిలోమీటర్ల మేర పైప్ లైన్ నిర్మించి ఇంటింటికీ నీరందించనున్నారు. సింగూరు నుండి జిల్లాకు నీటి సరఫరాకై నిర్మించిన పైప్‌లైన్ పనులు పూర్తవడంతో రాష్ట్రంలోనే తొలిసారి భగీరథ నీరు జిల్లాకు చేరాయి. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మిషన్ భగీరథ నీటికి శుక్రవారం బాన్సువాడలో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. కృషి, పట్టుదలకు నిదర్శనమే సిఎం కెసిఆర్ అని ఉద్ఘాటించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే ఇంటింటా మంచినీరు సరఫరా చేస్తామని తీపి కబురు వినిపించారు.

భగీరథ, కాకతీయ పనులను జూన్ 30లోగా పూర్తి చేయాలి

▸▸ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



మన తెలంగాణ/వరంగల్ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలను అమలు చేస్తున్నది. పథకాలను అమలు చేయడంలో అధికారులు సరిగా పనిచేయడంలేదు. ఇదేమైనా (నీటి పారుదల శాఖ) పునరావాస కేంద్రమా? పనిచేయని అధికారులు జిల్లాల్లో ఎందుకు ? వారిని వెంటనే సరెండర్ చేయాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కలెక్టర్లను ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇరిగేషన్‌శాఖ అధికారుల పనితీరుపై కడియం శ్రీహరి, మంత్రి అజ్మీర చందూలాల్ మండిపడ్డారు. సమీక్షా సమావేశానికి వస్తున్నప్పుడు కనీస సమాచారంతో రావాలనే సెన్స్ కూడా లేదంటూ కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హన్మకొండలోని నందనా గార్డెన్‌లో ఉమ్మడి వరంగల్‌లో అమలు చేస్తున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, హరితహారం పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకంలో నాల్గొవ ఫేజ్‌లో మంజూరైన చెరువులకు సంబంధించిన పనుల అంచనాలను పంపడంలో ఇంజనీర్లు నిర్లక్ష్యం చేయడం పట్ల అధికారులను తీవ్రస్థాయిలో మందలించారు. నాల్గవ విడత పనులకు సంబంధించి టెండర్లను మార్చి 31 వరకు పూర్తి చేయాలని, మిషన్ కాకతీయ మొదటి, రెండు, మూడవ దశ పనులను జూన్ 30 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తోంది. ముఖ్యమంత్రి జనగామ జిల్లాలో మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయని అనుకుంటున్నారని, మీరేమో ఇంకా పనులు చేయడంపై కడియం శ్రీహరి అసహనాన్ని వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు మంచినీళ్లను అందించే విధంగా పనులను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా జూన్30 వరకు వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో, జూలై 31 వరకు వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మిషన్ భగీరథ పనులన్ని పూర్తి కావాలని అధికారులను, సమావేశంలో శాసనమండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దల పద్మ, శాసన మండలి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, ఎంఎల్‌ఏలు పాల్గొన్నారు.

20న భవన నిర్మాణ కార్మికుల నిరసన

మన తెలంగాణ / హైదరాబాద్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు పెట్టాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న 'ఛలో కార్మిక శాఖ కార్యాలయం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వంగూరు రాములు, ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటం రాజు తెలిపారు. కేంద్ర చట్టం ప్రకారం 60 ఏళ్ళ వయస్సు పైబడిన కార్మికులకు పెన్షన్, కార్మికుల పిల్లల చదువులకు స్కాలర్ షిప్‌లు, అడ్డాలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక సహాయం చేయాలని, ప్రస్తుతం ఇస్తున్న స్కీమ్‌లకు నిధులు పెంచాలని వారు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో విమర్శించారు.

పాత కక్షలతో రాజుకున్న రాజకీయ వేడి



ఘర్షణలో ధ్వంసమైన గృహోపకరణాలు, కిష్టాపురం గ్రామంలో శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న డిఎస్‌పి రమణారెడ్డి, సిబ్బంది

మన తెలంగాణ/చింతలపాలెం : చిలికి చిలికి గాలి వానైనట్లు రెండు వర్గాల మధ్య జరిగిన స్వల్ప ఘర్షణ పెరిగి రాజకీయ పార్టీల మధ్య ఘర్షణగా మారి ఇండ్లలోని సామాగ్రి మోటార్ వాహనాలు, గడ్డి వాములు, ఇతరత్రా వస్తువులు ధ్వంసమైన సంఘటన మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టిఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు వర్గాల వ్యక్తులు పాత కక్షలతో ఒక వర్గానికి చెందిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రత్యర్థులు సుమారు 12 ఇండ్లపై గురువారం అర్థరాత్రి సమయంలో దాడికి పాల్పడి ఇంట్లోని సామాగ్రిని ఇనుప రాడ్లు, గొడ్డళ్లు, కత్తులు, రాళ్లతో ధ్వంసం చేశారు. 10 గడ్డి వాములకు నిప్పంటించారు. అనంతరం ఇళ్లలో ఉన్న మూగ జీవాలను సైతం వదలకుండా వాటిపై దాడి చేసి హింసించారు. సుమారు 6 ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. గ్రామంలో తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన సుమారు 5 బోర్ల స్టార్టర్ బాక్సులకు నిప్పంటించి ధ్వంసం చేశారు. ఈ దాడిలో మిరియాల జానమ్మ అనే వృద్ధురాలిపై కత్తితో, షేక్ సుభానీని ఇనుప రాడ్డుతో తలపై గాయపర్చారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ దాడులకు కారణమైన వ్యక్తుల వివరాలు తెలి యాల్సి ఉందని, వారు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల సమయం దగ్గరవుతుండడంతో అభ్యర్థులు తమ బలాన్ని పెంచుకోవడం కోసం ఇరు వర్గాల మధ్య ఈ దాడులు జరుగు తున్నాయన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన ఇరు వర్గ దాడుల గురించి తెలుసుకున్న కోదాడ డిఎస్‌పి రమణారెడ్డి గ్రామానికి చేరుకొని శాంతి భద్రతలు నిర్వహించారు. ఆయన వెంట కోదాడ సిఐ రవి, చింతలపాలెం ఎస్‌ఐ పరమేష్, మేళ్ళచెర్వు ఎస్‌ఐ సత్యనారాయణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కిష్టాపురంలో పికెట్ : మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో రాజకీయ పార్టీ మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని గుర్తించిన పోలీసు అధికారులు గ్రామాన్ని తమ అదుపులో తీసుకుని పికెట్ నిర్వహిస్తున్నారు. దాడులకు కారణమైన వ్యక్తులను గుర్తించి అదుపులో తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నకిలీ విత్తనాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

▸▸ తాండూరులో రూ.కోటి విలువ చేసే నకిలీ విత్తనాల పట్టివేత
▸▸ పక్షం రోజుల్లో రూ. కోటిన్నర విత్తనాల స్వాధీనం
▸▸ నకిలీ విత్తనాల రాకెట్‌లో 22 మంది అరెస్టు



మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా అడ్డు అదుపు లేకుండా సాగుతుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు వ్యాపారులు ముఠాగా ఏర్పడి తెలంగాణతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లాది రూపాయల టర్నోవర్‌తో సాగుతున్న ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు దాడులు చేస్తున్నప్పటికీ అక్రమ దందాకు తెర పడడం లేదు. గురువారం అర్థరాత్రి తాండూరు పోటీలు లారీలో ఉప్పు బస్తాల మాటున అక్రమంగా తరలిస్తున్న రూ. కోటి విలువ చేసే నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. ప్రకాశం జిల్లా బండ్లమిట్ట నుంచి మహారాష్ట్రకు ఉప్పులోడును తీసుకెళ్లేందుకు పర్మిట్ ఉండ గా ఉప్పు బస్తాల మధ్య నాల్గొ వరుస కింద గ్లైసిల్ పత్తి విత్తనాల బస్తాలను నింపి మహారాష్ట్రలకు తరలిస్తున్నారు. తాండూర్ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు రేపల్లి వాడ వద్ద నిలిపి ఉన్న లారీని సోదా చేయగా నకిలీ వత్తనాల అక్రమ రవాణా బట్టబయలైంది. లారీ డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన స్థలాన్ని రామగుండం పోలీసు కమిషనర్ విక్రంజిత్ దుగ్గల్ సందర్శించి నకిలీ విత్తనాలను అక్రమంగా తరలించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా పక్షం రోజులుగా పోలీసులు 22 మందిని అరెస్టు చేయగా రూ. కోటిన్నర విలువ చేసే నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. ఇటీవల బెల్లంపల్లిలో రూ.12లక్షల విలువ చేస్తే ఆరున్నర క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకోగా కాగజ్‌నగర్‌లో రూ. 20లక్షల విలువచేసే నకిలీ పత్తి విత్తనాలను సాధ్వీనం చేసుకున్నారు. అంతే కాకుండా కన్నెపల్లిలో రూ. 3.75లక్షల విలువ చేసే3 క్వింటాళ్ల విత్తనాలను పట్టుకొని నలుగురు వ్యాపారులను అరెస్టు చేశారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. రైతులు అధిక దిగుబడులను ఆశించి,ఎక్కువ ధరలు వె చ్చించి గ్లైసిల్ విత్తనాలు కొనుగోలు చేయడం అక్రమార్కులకు వరంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పట్టణాల నుంచి మంచిర్యాల, కొమురంభీం జిల్లాల్లో అక్రమంగా గోదాంలను ఏర్పాటు చేసుకొని, విత్తనాలను నిల్వచేస్తున్నారు. ఈ దందా జోరుగా సాగుతున్నా అప్పుడప్పుడు పోలీసులు అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి, స్వాధీనం చేసుకుంటున్నా పూర్తి స్థాయిలో నకిలీ విత్తనాల రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టడం లేదు. ఈ సీజనల్ దందా వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తుండగా రైతులు అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి, మోసపోతున్నారు.

గాంధీ జయంతి నాటికి స్వచ్ఛ తెలంగాణ

పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ) చిత్రాల వీడియో సిడిలను పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ శుక్రవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 84% కుటుంబాలు వ్యక్తిగత మరుగుదొడ్ల సౌకర్యం ఉందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి 100% మరుగుదొడ్ల నిర్మాణం జరిగి తెలంగాణ స్వచ్ఛ రాష్ట్రంగా అవతరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర స్వచ్ఛ భారత మిషన్ ద్వారా చేసే కార్యక్రమాలను వీడియో సిడిల ద్వారా ప్రచారం చేస్తామని చెప్పారు. తద్వారా మరుగుదొడ్ల వినియోగ అవసరాన్ని ప్రజలందరికి తెలియచేస్తామన్నారు. బహిరంగ మల విసర్జన రహిత సమాజాన్ని తీర్చిదిద్దడానికి ఈ ప్రచారం దోహదం చేస్తుందని చెప్పారు. మరుగుదొడ్లను నిర్మించుకోవడం, ఉపయోగించుకోవాల్సిన అవసరం, ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.కార్యక్రమంలో పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూప్రసాద్, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్‌పై 'ప్రేమ' దాడి

మన తెలంగాణ/బోధన్ (నిజామాబాద్ జిల్లా): రుద్రూర్ మండలం అంబం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యావాలంటర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతిపై యువకుడు శుక్రవారం దాడి చేసి గాయపరిచాడు. స్థానికంగా ఈ సంఘటన సంచలనం సృష్టించింది. విద్యావాలంటీర్‌కు ఇటీవల వివాహం నిశ్చయం కావడంతో వెంటపడి వేధిస్తున్న యువకుడు నేరుగా పాఠశాలకు వెళ్ళి విద్యావాలంటీర్‌ను చితకబాది ఆమె సెల్‌ఫోన్‌ను లాక్కుని యువతిని వివాహం చేసుకునే వ్యక్తికి ఫోన్ చేసి బెదిరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నన్ను కాదని ఎవరిని వివాహం చేసుకున్న చంపేస్తానని, వివాహం అంటూ చేసుకుంటే నన్నే చేసుకోవాలని బెదిరించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ఈ సంఘటనను చూస్తూ పాఠశాల సిబ్బంది నివ్వెరపోయారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న విద్యావాలంటీర్‌పై యువకుడు దాడి చేస్తున్న సమయంలో అక్కడే ఉన్న సిబ్బంది పట్టించుకోకపోవడం విడ్డూరం. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైతం బాధితురాలి తరుపున, పాఠశాల తరపున పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తుంది. రుద్రూర్ పోలీసుస్టేషన్‌లో బాధితురాలి తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాలపై

విడియో చిత్రీకరణకు ప్రణాళిక

మన తెలంగాణ / హైదరాబాద్ : గిరిజన తెగలైన గోండు, కోలామ్, కోయల సంస్కృతి, సంప్రదాయాలపై గిరిజన సంక్షేమ శాఖ విడియో చిత్రీకరణకు సన్నాహాలు చేస్తోంది. పై తెగల ఆచార వ్యవహారాలు, జీవన విధానం, నేపథ్యం, గృహ నిర్మాణ శైలి, ఆహారం–అలవాట్లు, మరణ సంబంధ వ్యవహారాలు, సంప్రదాయక వృత్తులు, ఆర్థిక సంబంధ వ్యవహారాలు, జీవన చక్రపు ముఖ్య ఘట్టాలు తదితరాలపై విడియో చిత్రీకరణకు తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఆసక్తి గల చిత్ర నిర్మాతలు సంబంధిత చిత్ర దృశ్య చిత్రీకరణకు మార్చి 27, అంతకు ముందు కార్యాలయ పనిదినాల్లో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ సంచాలకులు, డిఎస్ఎస్ భవ న్ కార్యాలయానికి సంప్రదించాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 040 23319947, సెల్ : 7382620487 నెంబర్లకు సంప్రదించాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సూచించారు.

రైతు సమితులు పెత్తనం చెలాయిస్తే పనిచేయలేం

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమితుల సభ్యులు పెత్తనం చేయడం, అధికారం చెలాయించడం వంటివి ఉండరాదని, అలా ఉంటే పనిచేయడం కష్టమని అధికారులు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డికి లేఖ ఇచ్చినట్లు తెలిసింది. బషీర్‌బాగ్‌లో వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్యాలయాన్ని కూడా మార్చాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. సమితుల్లో అత్యధికంగా టిఆర్‌ఎస్ కార్యకర్తలే ఉండటంతో ఇబ్బందికరంగా మారింది. పెట్టుబడి పథకం చెక్కుల పంపిణీ మొదలు పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు సమితి సభ్యుల పర్యవేక్షణే కీలకం కానుండటంతో అధికారులు ఏ సమాచారమైనా తమకు చెప్పాల్సిందేనని సభ్యులు ఇప్పుడే వత్తిడి తెస్తున్నట్లు పేర్కొంటున్నారని వ్యవసాయాధికారి ఒకరు తెలిపారు. రైతు సమన్వయ సమితిలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి సభ్యులు 1.61 లక్షల మంది ఉన్నారు. భవిష్యత్తులో పంపిణీ చేసే వరి నాటు యంత్రాలు, ఇతర వ్యవసాయ యంత్రాల పరికరాల పంపిణీలో సమితుల నుంచి పైరవీలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల 22న బోర్డు సమావేశం

ఈ నెల 22న తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం జరగనుంది. రైతు సమితుల విధి విధానాలపై ఈ భేటీలో చర్చించనున్నారు.


బాలీవుడ్ కంపెనీతో ప్రమోషన్లు

ఎంత పెద్ద సినిమా అయినా సూపర్‌హిట్‌గా నిలవాలంటే ప్రమోషన్లు ఒక రేంజ్‌లో ఉండాల్సివస్తోంది. టీజర్, ట్రైలర్, పోస్టర్ నచ్చితేనే ప్రేక్షకులు సినిమాలకు వెళ్తున్నారు. ఇక సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శక దిగ్గజం రాజమౌళి అందరికంటే ముందుంటాడు. 'బాహుబలి' సినిమా ప్రమోషన్స్ కోసం అతను అప్పట్లో మార్చింగ్ యాంట్స్ అనే బాలీవుడ్ కంపెనీతో టైఅప్ అయ్యాడు. ఆ సినిమా అప్పుడే మరొక సినిమా కోసం కూడా ఒప్పందం కుదిరిందని సమాచారం. అందుకే ఇప్పుడు రాజమౌళి దర్శకత్వం వహించబోయే మల్టీస్టారర్ మూవీ ప్రమోషన్లు కూడా ఆ కంపెనీనే చూసుకుంటుందట. ఈ మూవీ హీరోలు రామ్‌చరణ్, ఎన్టీఆర్‌లను ఈ కంపెనీనే లాస్‌ఏంజిల్స్‌కు తీసుకెళ్లి ఫొటోషూట్ చేయించిందని తెలిసింది. అంటే సినిమా షూటింగ్ మొదలుపెట్టే ముందే ప్రమోషన్ల పని మొదలుపెట్టేశారన్నమాట. ఇద్దరు స్టార్ హీరోలతో కూడిన పోస్టర్‌ను ముందుగానే విడుదల చేస్తారని తెలిసింది. ఇందులో నిజనిజాలు ఏంటో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



సవ్యసాచి ఫస్ట్‌లుక్

నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సవ్యసాచి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'ప్రేమమ్' తర్వాత చైతన్యచందుల కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ (సివిఎం)లు మాట్లాడుతూ ''తన రెండు చేతులను సమర్థవంతంగా వినియోగించగల అర్జునుడిని 'సవ్యసాచి' అంటారు. టైటిల్‌కు తగ్గట్టుగానే సినిమాలో నాగచైతన్య క్యారెక్టరైజేషన్ ఉంటుంది. చైతన్య మాస్ యాక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు. మనదేశంలో షూటింగ్ పూర్తయ్యాక అమెరికా వెళ్లనున్నాం. షూటింగ్‌తో సహా అన్ని పనులను పూర్తిచేసి జూన్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం. కీరవాణి 'బాహుబలి' తర్వాత సంగీతాన్ని సమకూరుస్తున్న చిత్రమిది''అని అన్నారు. రావు రమేష్, వెన్నెల కిషోర్, సత్య, తాగుబోతు రమేష్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః యువరాజ్, ఆర్ట్ః రామకృష్ణ, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరావు, ఫైట్స్ః రామ్‌లక్ష్మ ణ్.



నాగచైతన్య

ఏప్రిల్ 5న ఆచారి అమెరికా యాత్ర

విష్ణు మంచు హీరోగా నటించిన 'ఆచారి అమెరికా యాత్ర' చిత్రం ఏప్రిల్ 5న విడుదలకానుంది. జి.నాగేశ్వర్‌రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన రాగా...తమన్ స్వరపరిచిన పాటలు సంగీత ప్రియులను ఎంతగానో అలరిస్తున్నాయి. విష్ణు, నాగేశ్వర్‌రెడ్డిల కలయికలో వచ్చిన దేనికైనా రెడీ, ఈడో రకం ఆడో రకం సినిమాలు సూపర్‌హిట్‌గా నిలిచి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన విషయం తెలిసిందే. 'ఆచారి అమెరికా యాత్ర' కూడా అదే తరహా వినోదభరిత చిత్రం కావడంతో విష్ణు, నాగేశ్వర్‌రెడ్డిలు హ్యాట్రిక్ హిట్ సాధిస్తారని నిర్మాతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ప్రజ్ఞ జైస్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో స్టార్ కమేడియన్ బ్రహ్మానందం ముఖ్య పాత్రలో నటించారు. యమ్.ఎల్.కుమార్ చౌదరి సమర్పణలో పద్మజ పిక్చర్స్ బ్యానర్‌పై కీర్తి చౌదరి, కిట్టు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లలో షూటింగ్ జరుపుకున్న 'ఆచారి అమెరికా యాత్ర'ను ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 5న భారీగా విడుదల చేయనున్నారు. తనికెళ్ల భరణి, కోట శ్రీనివాస రావు, పోసాని కృష్ణమురళి, పృథ్వీ, విద్యుల్లేఖ రామన్, ప్రభాస్ శ్రీను, ప్రదీప్ రానా, ఠాకూర్ అనూప్ సింగ్, సురేఖవాణి ఈ సినిమాలో ప్రధాన తారాగణంగా నటించారు. ఈ చిత్రానికి రచయితః మల్లాది వెంకటకృష్ణ మూర్తి, ఛాయాగ్రాహకుడుః సిద్ధార్థ్, ఎడిటింగ్ః వర్మ, మాటలుః డార్లింగ్ స్వామి, ఆర్ట్ః కిరణ్, యాక్షన్ః కనల్ కన్నన్.



మంచు విష్ణు

నానీతో కొరటాల చిత్రం?



నాని



కొరటాల శివ

వరుస హిట్లతో జోరు మీదున్న నాని యంగ్ స్టార్‌గా ప్రేక్షకుల్లో మంచి క్రేజ్‌ను తెచ్చుకున్నాడు. తనకంటే ముందు వచ్చిన పలువురు యంగ్ హీరోలను దాటేసి ఇతను యువ కథానాయకునిగా మంచి పేరుతెచ్చుకున్నాడు. ప్రస్తుతం అతని సినిమాలకు మంచి మార్కెట్ ఉంది. నాని సినిమాలు రూ.30 కోట్ల వరకు బిజినెస్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతను స్టార్ దర్శకులపై దృష్టిపెట్టినట్లు తెలిసింది. మొన్నటివరకు కొత్త దర్శకులతో సినిమాలు చేసి హిట్స్ అందుకున్న నాని ఇప్పుడు బడా దర్శకులతో రూ.25 కోట్ల బడ్జెట్‌తో సినిమా ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నాడట. నిర్మాతలు కూడా ఓకే అంటున్నట్లు తెలిసింది. అయితే ముందుగా నాని స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో ఓ బిగ్ మూవీని చేయబోతున్నట్లు సమాచారం. కొరటాల ఇప్పటివరకు స్టార్ హీరోలతోనే సినిమాలు చేశాడు. కానీ అతను తొలిసారిగా యంగ్ హీరో నానీతో సినిమా చేయబోతున్నాడని తెలిసింది. మహేష్‌తో కొరటాల చేస్తున్న 'భరత్ అనే నేను' సినిమా తర్వాత ఈ చిత్రం తెరకెక్కనుందని టాక్. కొరటాల మిత్రులే ఈ సినిమాను నిర్మిస్తారని తెలిసింది.



శృతిహాసన్

ఆ పని తప్పనిసరిగా చేస్తుందట

ప్రతి వారికి తమ దైనందిన జీవితంలో రకరకాల అలవాట్లు ఉంటాయి. ఉదయం నిద్ర లేచిన దగ్గరనుంచి మళ్లీ రాత్రి పడుకునే వరకు కొన్ని నిర్దిష్టమైన పనులు చేస్తుంటారు. అయితే సౌత్‌బ్యూటీ శృతిహాసన్ నిద్రించే ముందు ఓ పని తప్పనిసరిగా చేస్తుందట. ఆమె తండ్రి కమల్‌హాసన్ చిన్నప్పుడే ఓ విషయం నేర్పించాడట. అదేమిటంటే... ఏ రోజైనా సరే ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రించలేకపోతే... ఆ రోజున మనసుకు నచ్చని పని ఏదో చేసి ఉంటామని అర్థం చేసుకోవాలని చెప్పాడట కమల్. తన జీవితంలో ఈ మాటలను మరచిపోనంటున్న శృతిహాసన్... ప్రతి రోజు నిద్రపోయే ముందు ఆ రోజు చేసిన అన్ని పనులను గుర్తు చేసుకుంటానని చెప్పింది. తప్పయినా ఒప్పయినా ఏదైనా సరే అన్ని పనులను గుర్తుచేసుకుంటానని చెప్పిన ఆమె... ఏదైనా తప్పు పనులు చేసి ఉంటే మాత్రం వాటిని జీవితంలో మళ్లీ చేయకూడదని నిర్ణయం తీసుకుంటుందట. అలా చేసిన తర్వాతే తనకు ప్రశాంతంగా నిద్ర పడుతుందని శృతిహాసన్ చెప్పింది. ప్రతి రోజు నిద్రించేముందు ఆరోజు మొత్తాన్ని గుర్తుచేసుకోకపోతే ఏదో వెలితిగా ఉంటుందని ఆమె పేర్కొంది.

లావణ్యకు లక్కీ ఆఫర్



లావణ్య త్రిపాఠి

'అందాల రాక్షసి'లో పక్కింటి అమ్మాయిగా ఎంతో అందంగా కనిపించి... 'భలే మగాడివోయ్' చిత్రంలో తన గ్లామరస్ నటనతో ప్రేక్షకులను మురిపించిన బ్యూటీ లావణ్య త్రిపాఠి. ఆతర్వాత ఆమె వరుసగా టాప్ హీరోలతో సినిమాలు చేస్తూ వచ్చింది. అయితే ఈమధ్య చేతిలో పెద్దగా సినిమాలు లేక ఆమె డీలాపడిపోయింది. ఈ నేపథ్యంలో తాజాగా లావణ్యకు మంచి ఆఫర్ దక్కింది. రవితేజ హీరోగా 'కందిరీగ' ఫేమ్ సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కే సినిమాలో ఈ భామ హీరోయిన్‌గా ఎంపికైంది. ముందుగా ఈ పాత్రకు క్యాథరిన్‌ను తీసుకుందాని అనుకున్నారు. కానీ చివరికి దర్శకుడు సంతోష్ శ్రీనివాస్... రవితేజకు జోడీగా లావణ్యను తీసుకున్నాడు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కే ఈ చిత్రంలో ఈ భామ పాత్ర సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందట. తన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలుస్తుందని భావిస్తోంది లావణ్య త్రిపాఠి.

రెండో సినిమాకే రెండింతల పారితోషికం!



కైరా అద్వానీ

కొంతమంది యంగ్ హీరోయిన్లకు కెరీర్ ప్రారంభంలోనే అదృష్టం కలిసివస్తుంది. సినిమా అవకాశాల పరంగానే కాదు రెమ్యునరేషన్ పరంగానూ అన్నీ వారికి కలిసివస్తుంటాయి. బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వానీకి కూడా ఇదేవిధంగా అదృష్టం కలిసివస్తోంది. ప్రస్తుతం ఈ భామ మహేష్‌బాబుతో 'భరత్ అనే నేను' సినిమాలో నటిస్తోంది. తెలుగులో తన తొలి చిత్రంలోనే సూపర్‌స్టార్‌తో నటిస్తూ ఫిల్మ్‌మేకర్స్ దృష్టిలో పడింది. ఈ సినిమాలో ఆమె ఫస్ట్‌లుక్‌ను ఇంతవరకు రిలీజ్ చేయలేదు. కానీ అప్పుడే మరో టాలీవుడ్ స్టార్ హీరోతో సినిమా చేయడానికి సిద్ధమైంది. రామ్‌చరణ్‌బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రానున్న సినిమాలో హీరోయిన్‌గా చేసేందుకు ఆమె ఇటీవల ఒప్పుకుంది. అయితే తెలుగులో తన మొదటి సినిమాతో పోలిస్తే ఈ సినిమాకు అమ్మడు తీసుకుంటున్న పారితోషికం గురించి తెలిస్తే ఎవరైనా షాక్ అవుతారు. 'భరత్ అనే నేను' సినిమాకు ఆమె రూ.50 లక్షలు తీసుకుంటే రామ్‌చరణ్ సినిమాకు ఏకంగా కోటి రూపాయలను తీసుకుంటోందట. తన మొదటి సినిమా విడుదల కాకముందే కైరాకు ఇప్పటికే భారీ ఆఫర్స్ వస్తున్నాయి. కొన్ని సినిమా కథలు నచ్చకపోవడంతో చేయనని చెప్పిన ఈ బ్యూటీ బోయపాటి చెప్పిన కథలో ఆమె పాత్ర నచ్చడంతో వెంటనే ఒప్పేసుకున్నట్లు సమాచారం. అయితే రెమ్యునరేషన్ విషయాన్ని కూడా కైరా ముందే చెప్పడంతో నిర్మాతలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది.



పూజాహెగ్డే

పూజాహెగ్డేకు ఆ సినిమా సవాలే

ఎన్టీఆర్‌త్రివిక్రమ్ క్రేజీ కాంబినేషన్‌లోని మూవీ కోసం ప్రేక్షకులు ఎంతగా ఎదురుచూస్తున్నారో అంతకన్నా ఎక్కువగా హీరోయిన్ పూజాహెగ్డే ఎదురుచూస్తోంది. తనని ఈ సినిమాలో హీరోయిన్‌గా ఖరారు చేయడంతో ఆమె కాళ్లు భూమి మీద నిలవడం లేదట. మరోపక్క సూపర్‌స్టార్ మహేశ్‌బాబు సినిమా కూడా ఓకే కావడంతో ఆమె ఆనందం రెట్టింపయ్యింది. ఇక ఎన్‌టిఆర్‌తో సినిమా అంటే ఒక్క విషయంలో పూజకు బాగా భయంగా ఉందట. సింగిల్ టేక్ ఆర్టిస్ట్ అయిన తారక్ పక్కన నటించాలంటే బాగా టెన్షన్‌గా ఉందని ఆమె చెబుతోంది. అల్లుఅర్జున్‌తో 'డీజే...'లో ధీటుగా ఆడి పాడిన పూజకు ఎన్‌టిఆర్‌తో సినిమా అంటే సవాలే. పైగా తారక్ బాగా సన్నబడి కొత్త ఎనర్జీతో ఉత్సాహంగా ఉన్నాడు. ఇక అతను డ్యాన్సుల్లో దుమ్ము లేపడం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవడం కూడా కష్టమే. సుమారు 15 కిలోల వరకు తారక్ బరువు తగ్గి త్రివిక్రమ్ సినిమా కోసం సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా కోసం అతను సిక్స్‌ప్యాక్ లుక్ కోసం ప్రయత్నిస్తున్నాడన్న విషయం తెలిసిందే. ఇక త్రివిక్రమ్ సినిమాల్లో హీరోయిన్లకు కూడా మంచి ఎమోషనల్ సీన్స్ ఉంటాయి. అందుకే పూజ ఆందోళన చెందుతోంది కాబోలు. తుది దశలో ఉన్న 'సాక్ష్యం' సినిమా షూటింగ్‌ను పూర్తిచేసుకున్న తర్వాత ఎన్‌టిఆర్ సినిమా షూటింగ్‌లో పూజ చేరుతుంది. ఇప్పటివరకు టాలీవుడ్‌లో గట్టి బ్లాక్‌బస్టర్ లేని తనకు ఈ సంవత్సరం అది నెరవేరుతుందనే ధీమాలో ఈ బ్యూటీ ఉంది. ఇక రామ్‌చరణ్ 'రంగస్థలం'లో పూజ చేసిన ఐటమ్‌సాంగ్ ఓ రేంజ్‌లో ఉంటుందని టాక్.

భారతదేశ ప్రతిష్టను పెంచిన చిరుతేజ్ సింగ్

తన అద్భుత మేధాశక్తితో ప్రపంచ రికార్డును నెలకొల్పిన గిరిజన బాలిక చిరుతేజ్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన బాలల చిత్రం 'చిరుతేజ్ సింగ్'. నిర్మాత ఎన్.ఎస్.నాయక్ సహాయ సహకారాలతో అవార్డు విన్నింగ్ లఘు చిత్రాల దర్శకుడు డా.ఆనంద్ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మనాలి రాథోడ్, సౌమ్య వేణుగోపాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. కేవలం 3 నిమిషాల వ్యవధిలో 236 ప్రపంచ పటాలను గుర్తించి బాల మేధావిగా ఎన్నో పతకాలు, ప్రశంసలను అందుకొని తెలుగు జాతి, భారతదేశ ప్రతిష్టను పెంచిన చిరుతేజ్ సింగ్ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మనసుకు హత్తుకునే సన్నివేశాలతో చిన్నారులకు ప్రేరణ కలిగించేలా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రాన్ని అనాథ పిల్లల కోసం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియో ప్రివ్యూ థియేటర్‌లో ప్రదర్శించడం జరిగింది. స్టార్ హీరోయిన్ సమంత అక్కినేని ఈ సందర్భంగా చిత్ర బృందానికి తన అభినందనలు తెలియజేశారు. దర్శకుడు వీరశంకర్, నిర్మాతలు రాజ్ కందుకూరి, మధుర శ్రీధర్, సంగీత దర్శకుడు రఘు కుంచె, యంగ్ హీరో అభిజిత్, సాగర్ చంద్ర, సీతా నారాయణ్ తదితరులు ఈ చిత్రాన్ని చూసి ప్రశంసించడం జరిగింది. ఈ చిత్రానికి సంగీతంః గీతా పూనిక్, కెమెరాః జై, ఎడిటింగ్ః యాదగిరి కంజర్ల, రచన, దర్శకత్వంః డా.ఆనంద్ కుమార్.





2 శాతానికి కరెంట్ ఖాతా లోటు

న్యూఢిల్లీ: అత్యధికంగా చమురు దిగుమతులు కారణంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి దేశీయ అక్టోబర్–డిసెంబర్ కరెంట్ ఖాతా లోటు పెరిగింది. ఈమేరకు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) గణాంకాలను విడుదల చేసింది. జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో లోటు 13.5 బిలియన్ డాలర్లతో 2 శాతం పెరిగింది. అంతకుముందు ఇదే సమయంలో కరెంట్ ఖాతా లోటు 8 బిలియన్ డాలర్లు(1.4 శాతం)గా ఉంది. దిగుమతులు మరింతగా పెరడంతో అత్యధిక వాణిజ్య లోటు వచ్చిందని ఆర్‌బిఐ పేర్కొంది. భారత్ వాణిజ్య లోటు 44.1 బిలియన్ డాలర్లతో వృద్ధిని సాధించగా.. ఏడాది క్రితం ఇది 33.3 బిలియన్ డాలర్లుగా ఉంది. అదే సమయంలో అక్టోబర్–డిసెంబర్ కాలంలో పేమెంట్ల బ్యాలెన్స్ మిగులు 9.4 బిలియన్ డాలర్లుగా ఉందిఇ. సంవత్సరం క్రితం ఇది 1.2 బిలియన్ డాలర్లుగా ఉంది. డిసెంబర్ ముగింపునాటి త్రైమాసికంలో మూలధనం, ఆర్థిక ఖాతా మిగులు 12.6 బిలియన్ డాలర్లకు పెరగ్గా.. క్రితం ఏడాది ఇదే సమయంలో 7.3 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా ఫిబ్రవరి నెలలో దేశీయ ఎగుమతులు 25.8 బిలియన్ డాలర్లతో 4.5 శాతం పెరిగాయని గురువారం వాణిజ్యశాఖ కార్యదర్శి వెల్లడించిన విషయం తెలిసిందే.

జియో ఆలోచన ఇషాదే..



- ఇంట్లో నెట్‌వర్క్ సరిగ్గా లేదంటూ నా కుమార్తె ఫిర్యాదు
- అలా కొత్త టెక్నాలజీ వైపు అడుగులు
- 4జి వోల్ట్‌తో జియో ఆవిర్భవించింది: ముఖేష్ అంబానీ

లండన్ : బిలియనీర్ ముఖేష్ అంబానీకి చెందిన టెలికామ్ సంస్థ జియో దేశంలో ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. అయితే ఈ సంస్థ ఆవిర్భావం వెనుకు అసలు కారణం ఆయన బహిర్గతం చేశారు. 2011 సంవత్సరంలో తన కుమార్తె ఉషా ఆలోచనతోనే జియో పుట్టిందని.. ఈ సంస్థను ప్రారంభించిన రెండేళ్లలోనే ప్రపంచంలోనే అతిపెద్ద డాటా వినియోగం దేశంగా భారత్ అవతరించిందని ముఖేష్ అన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ అర్సెలర్ మిట్టల్ బోల్డ్‌నెస్ కార్యక్రమంలో 'డ్రైవర్స్ ఆఫ్ చేంజ్' అవార్డును రిలయన్స్ అందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖేశ్ తన కుటుంబంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జియో కోసం రిలయన్స్ భారతీయ మొబైల్ మార్కెట్‌లో 31 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిందని తెలిపారు. 'నా కుమార్తె ఇషా 2011లో జియో ఆలోచనకు బీజం వేసింది. ఆ సమయంలో ఇషా సెలవుల నిమిత్తం అమెరికా నుంచి భారత్ వచ్చింది. ఓ రోజు ఇంట్లో తన కోర్సుకు సంబంధించిన వర్క్ చేసుకుంటోంది. అప్పుడు డాడీ మన ఇంట్లో ఇంటర్నెట్ అధ్వాన్నంగా ఉందని చెప్పింది' అని ముఖేష్ గుర్తుచేసుకున్నారు. అయితే భవిష్యత్తులో ప్రపంచం డిజిటల్ టెక్నాలజీతోనే నడుస్తుందని ఇషా, ఆకాశ్ నాకు చెప్పారు. కొత్త ప్రపంచం ప్రతి అంశం డిజిటల్‌లోనే నడుస్తాయని వారు వివరించారు. అలా వారి ఆలోచనల నుంచే ఈ జియో వచ్చింది. 2016 సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టిన జియో ఇప్పుడు భారత్‌లో గేమ్ ఛేంజర్‌గా మారింది. 2జి నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేయడానికి భారతీయ టెలికాం రంగానికి 25 ఏళ్లు సమ యం తీసుకుంటే.. 4జి ఎల్‌టిఇ నెట్‌వర్క్‌ను రూపొందించడానికి జియోకి కేవ లం మూడేళ్లే పట్టిందన్నారు. 5జి నెట్‌వర్క్ కూడా త్వరలో రానుందని ముఖేశ్ అంబానీ చెప్పారు. 2016లో జియోను ప్రవేశపెట్టి.. ఉచితంగా సిమ్ కార్డులు ఇవ్వడంతో పాటు అతి తక్కువ ధరలకే ఉచిత కాల్ సేవలు, డేటా అందిస్తున్నామని అన్నారు. త్వరలో జియో కొత్త డేటా కనెక్ట్ ప్రక్రియను ప్రవేశపెట్టనున్నట్లు ముఖేశ్ తెలిపారు. దీని ద్వారా మన ఇంటికే కాకుండా, వివిధ వ్యాపారాలకు, కార్లకు నెట్ కనెక్షన్లు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. 1జి మొబైల్ నెట్‌వర్క్‌కు అమెరికా నాంది పలికింది. ఆ తర్వాత యూరప్ 2జిని తీసుకురాగా, చైనా 3జి నెట్‌వర్క్‌తో ముందడుగు వేసింది. జియో ప్రపంచంలోనే అతిపెద్ద 4జి ఎల్‌టిఇ నెట్‌వర్క్‌ను స్థాపించిందని ముఖేష్ వివరించారు. ఇది 2019లో 4జిలో భారత్‌ను లీడర్‌గా నిలుపనుందని అన్నారు. భారతదేశంలోని ప్రతిభావంతులైన యువత ఉన్నారని వారితో 2028 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా తయారవుతుందని అన్నారు.

రూ.10 ప్లాస్టిక్ నోట్లు రానున్నాయ్..




న్యూఢిల్లీ: ఐదు పట్టణాల్లో రూ.10 ప్లాస్టిక్ నోటును పరీక్షించనున్నామని ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. ఐదు నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని మరో ప్రశ్నకు సమాధానమిచ్చింది. 10 ప్లాస్టిక్ నోట్లను తీసుకొచ్చే క్రమంలో క్షేత్రస్థాయిలో కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్‌లలో ట్రయల్ నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం మహాత్మాగాంధీ సిరీస్‌లో వచ్చిన కొత్త రూ.500 నోటు సైజు 66 ఎంఎం X 150 ఎంఎం ఉండగా, అలాగే రూ.2000 నోట్ల సైజు 66 ఎంఎం X 166 ఎంఎంగా ఉందని చెప్పారు. వీటిని సులభంగా గుర్తించేందుకు రెండు నోట్ల మధ్య 10 ఎంఎం తేడా ఉంటుందని ఆయన సమాధానమిచ్చారు. కాగా రూ.2000 నోటుపై అనేక ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో కేంద్రం మరోసారి కీలక ప్రకటన చేసింది. నల్లధనాన్ని నిరోధించే క్రమంలో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేశారు. ఇలాగే రూ.2వేల నోటును కూడా రద్దు చేస్తారని ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో ఆర్థికశాఖ లోక్‌సభలో స్పష్టతనిచ్చింది. రద్దు చేసే ప్రతిపాదనేమీ లేదని చెప్పారు.

మార్కెట్లోకి హోండా యాక్టివా 5జి

న్యూఢిల్లీ: హోండా మోటార్ యాక్టివా 5జి శ్రేణిలో కొత్త మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. గత మోడల్‌తో పోలిస్తే కొత్త యాక్టివాలో అనేక మార్పులు చేశారు. యాక్టివా 5జి ధర గత 4జి ధర కంటే ఓ రూ.1000 ఎక్కువ ఉండనుంది. స్టాండర్డ్ మోడల్ రూ.54,096, డీలక్స్ మోడల్ ధర రూ.55,961గా ఉంది. యాక్టివా 5జి బాడీని గత వెర్షన్‌తో పోలిస్తే కొన్ని మార్పులు చేశారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33176.00	–509.54	–1.51%
నిఫ్టీ	10195.15	–165.00	–1.59%



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28950	30962.57	–0.17%
ముంబై	29710	31775.40	–0.54%
ఢిల్లీ	29550	31604.28	–0.51%
కోల్‌కతా	30020	32106.95	0%
కేరళ	28050	30000.00	0.71%
బెంగళూరు	28400	30374.33	–0.7%
హైదరాబాద్	28920	30930.48	–0.28%
గల్ఫ్	1402.5	1500.00	–0.68%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41400.00	41500.00	–0.24
ముంబై	41400.00	41500.00	–0.24
ఢిల్లీ	41400.00	41500.00	–0.24
కోల్‌కతా	41400.00	41500.00	–0.24
హైదరాబాద్	41400.00	41500.00	–0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	325
వరంగల్	332	చిత్తూరు	363
విజయవాడ	317	చెన్నై	370
గోదావరి	317	బెంగళూరు	365

మరో భారీ పతనం


- 509 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- ఎల్‌టిసిజి పన్ను, రాజకీయ ఉద్రిక్తతలు, ఫెడ్ సమీక్ష ఆందోళనలు



న్యూఢిల్లీ: స్టాక్‌మార్కెట్ సూచీలు కొద్ది రోజులుగా బేర్ మంటున్నాయి. శుక్రవారం అమ్మకాలు ఒక్కసారిగా వెల్లువెత్తడంతో మార్కెట్ ముగిసే సమయానికి ప్రధాన సూచీలైన సెన్సెక్స్ 509 పాయింట్లు కోల్పోయి 33,176 వద్ద ముగిసింది. నిఫ్టీ 165 పాయింట్లు నష్టపోయి 10,195 వద్ద స్థిరపడింది. ఎల్‌టిసిజి (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్) పన్ను, రాజకీయ ఉద్రిక్తతలు, వచ్చే వారంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమీక్ష వంటి అంశాలు మార్కెట్‌ను కృంగదీశాయి. మార్కెట్ పతనానికి ఎఫ్‌ఐఐల అమ్మకాలు కారణమయ్యాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లలోఅమ్మకాల ఒత్తిడి నెలకొంది. అధిక వేయిటేజి కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీ, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి షేర్లు 12 శాతం నష్టపోవడంతో సూచీలు బాగా తగ్గాయి. ఎన్‌ఎస్ఇలో ని కీలకమైన నిఫ్టీ బ్యాంక్ సూచి 300పాయింట్లు నష్టపోయి 24,489 పాయింట్లు వద్ద ముగిసింది. అన్ని రంగాలకు చెందిన సూచీలు నష్టాల్లో ముగిశాయి. మిడ్ సెషన్ నుంచి ఊపందుకున్న అమ్మకాలు చివర్లో మరింత పెరగడంతో మార్కెట్లు భారీగా పతనమయ్యాయి.

దేశీయ, అంతర్జాతీయ అంశాల ప్రభావం

ప్రపంచ స్టాక్‌మార్కెట్లలో కొనసాగుతున్న బలహీనతలు, దేశీయంగా ఉపఎన్నికలలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఎదురుగాలులు వంటి పరిణామాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలు రేపాయని విశ్లేషకులు అంటున్నారు. మెటల్, రియల్టీ, ఆటో, ఫార్మా, ప్రైవేట్ బ్యాంక్స్ 21.5 శాతం మధ్య పతనమయ్యాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐఒసి, టాటా మోటార్స్, అల్ట్రాటెక్, బిపిసిఎల్, ఏసియన్ పెయింట్స్, ఎన్‌టిపిసి, అదానీ పోర్ట్స్, హీరోమోటో, అంబుజా, సన్ ఫార్మా నష్టపోయాయి. మరోవైపు ఎం అండ్ ఎం, యస్‌బ్యాంక్, హెచ్‌యుఎల్, విప్రో, టెక్ మహీంద్రా షేర్లు స్వల్పంగా లాభపడ్డాయి. మార్కెట్ నష్టాల నేపథ్యంలో చిన్న షేర్లు కూడా అమ్మకాల ఒత్తిడితో నష్టాల బాటపట్టాయి. బిఎస్ఇలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1 శాతం మేరకు క్షీణించాయి. మొత్తం షేర్లలో 1744 నష్టపోగా, 933 షేర్లు మాత్రమే పెరిగాయి. నగదు విభాగంలో గురువారం ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ.705 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. బుధవారం కూడా రూ. 259 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. కాగా.. బుధవారం రూ. 432 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న దేశీ ఫండ్స్(డిఐఐలు) గురువారం రూ. 256 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.



భారీ నష్టాలతో ప్రారంభం


దేశీయ మార్కెట్ నష్టాల్లోనే ట్రేడింగ్‌ను ప్రారంభించింది. సెన్సెక్స్ 33,685 వద్ద, నిఫ్టీ 10,345 వద్ద ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు ఆరంభం నుంచే అమ్మకాల వైపు మొగ్గు చూపారు. మార్కెట్లలో మిడ్ సెషన్ నుంచీ అమ్మకాలు మరింత ఊపందుకోగా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లలోభారీగా అమ్మకాలు జరిగాయి. కాగా ప్రస్తుత మార్కెట్లో దిద్దుబాటు కొనసాగుతోందని, ఇది స్వల్పకాలం ఉండనుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సిఐఐ తెలంగాణ కార్యవర్గం ఎన్నిక



మన తెలంగాణ / హైదరాబాద్ : సిఐఐ తెలంగాణ రాష్ట్ర శాఖ 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సిఐఐ తెలంగాణ నూతన ప్రెసిడెంట్ గా సంజయ్ సింగ్, వైస్ ఛైర్మన్‌గా డి. రాజు ఎన్నికయ్యారు. ఐటిసిలో ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ బిజినెస్ వ్యవహారాలను చూసిన సంజయ్ సింగ్ ఐఐటి కాన్పూర్‌లో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అలాగే వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన డి. రాజు నిజామాబాద్ కు చెందిన వారు. ఉస్మానియా వర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్, ఎంబిఏ పట్ట భద్రులు కూడా. గత 36 ఏళ్లుగా వివిధ హోదాల్లో పని చేసిన ఆయన ప్రస్తుతం కిర్బీ బిల్డింగ్స్ సిస్టమ్స్‌లో ఎండి అండ్ సిఈఓగా ఉన్నారు.

కొబ్బరి పరిశ్రమపై 3రోజుల శిక్షణ




మన తెలంగాణ /హైదరాబాద్ : కొబ్బరి పీచు పరిశ్రమపై కాయర్ బోర్డు మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాయర్ బోర్డు ఎంఎస్ఎంఈ (చిన్న మధ్యతరహా పరిశ్రమల) రంగంలో అభ్యర్థులకు శిక్షణనిస్తోంది. హైదరాబాద్ విద్యానగర్‌లోని సెట్విన్ ట్రయినింగ్ సెంటర్‌లో ఈ నెల 15న ప్రారంభమైన ఈ తరగతులు శనివారం వరకు జరుగనున్నాయి. ఈ సదస్సుపై అభ్యర్థులకు మానవ వనరుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తోంది. సెట్విన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. వేణు గోపాల్ రావు ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దేశంలో కొబ్బరి పీచు పరిశ్రమకు ఉన్న ఆదరణ, ఇటీవలి కాలంలో వస్తున్న వినూత్న ఉత్పత్తులు, భవిష్యత్తులో ఉన్న ఉపాధి అవకాశాలు తదితరాలపై అవగాహన కల్పించారు.

ఆడి కార్లు మరింత ప్రియం

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ ఆడి కార్ల ధరలను పెంచింది. తాజాగా కంపెనీ కారు మోడళ్లపై రూ.9లక్షల వరకు ధరలను పెంచుతున్నట్లు సంస్థ పేర్కొంది. ప్రభుత్వం దిగుమతి సుంకాలు పెంచడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని, పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయని కంపెనీ ప్రకటించింది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని పెంచిన విషయం తెలిసిందే. అన్ని మోడళ్లపై 4 శాతం వరకు ధరలను పెంచుతున్నామని, మోడల్ ఆధారంగా కార్లపై రూ. లక్ష నుంచి రూ. 9లక్షల వరకు ధరలు పెరగనున్నాయని సంస్థ పేర్కొంది. దేశీయ మార్కెట్లో ఎస్‌యువి రేంజ్ నుంచి స్పోర్ట్స్ కారు వరకు ఆడి మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ. 35.35లక్షల నుంచి రూ. 2.63 కోట్ల వరకు ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం దిగుమతిపై సుంకాన్ని 10 నుంచి 15 శాతానికి పెంచింది. మోటార్ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలు తదితర వాటిపై ఈ పెంపు భారం ఉంటోంది.

ప్రతిభ కనబర్చిన సంస్థలకు బిఎస్ఎన్ఎల్ రివార్డులు

మన తెలంగాణ /హైదరాబాద్ : అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బిఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీ సంస్థలను బిఎస్ఎన్ఎల్ తెలంగాణ సర్కిల్ ఘనంగా సత్కరించింది. హైదరాబాద్ ఆబిడ్స్ లోని సిజిఎం తెలంగాణ టెలికం సర్కిల్ కార్యాలయంలో ఫ్రాంచైజీ మీట్ ను గురువారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సిజిఎం తెలంగాణ టెలికం సర్కిల్ వి. సుందర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయా సంస్థల పనితీరును అభినందించారు. 2017–18 మూడో త్రైమాసికంలో అత్యధిక ఆక్టివేషన్స్ చేయించినందుకు గాను వరంగల్ జిల్లా ఏటూరు నాగారంకు చెందిన శ్రీజ సెల్ వరల్డ్‌కు, అలాగే బిఎస్ఎన్ఎల్ ఉపకరణాలు అత్యధిక విక్రయాలు చేసిన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కమ్యూనికేషన్స్‌కు చెందిన సయ్యద్ మజీద్ అలీకి బయోమెట్రిక్ డివైజ్‌ను బహూకరించారు.



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
హెచ్‌సిఎల్ టెక్	979.55	947.05	967.60	959.15	8.45	0.88
ఎంఅండ్ఎం	752.00	735.55	740.75	734.85	5.90	0.80
విప్రో	297.15	291.05	295.75	293.40	2.35	0.80
టెక్ మహీంద్ర	639.00	627.00	634.70	631.85	2.85	0.45
ఎస్ మహీంద్ర	316.85	310.00	312.90	311.85	1.05	0.34
అరబిందో ఫార్మా	585.00	568.80	572.55	572.30	0.25	0.04
పిరమల్ ఎంటర్	2,505.05	2,425.00	2,494.15	2,451.15	43.00	1.75
కెనరా బ్యాంకు	272.40	260.40	268.20	264.35	3.85	1.46
ఐడియా సెల్యూలర్	83.00	79.35	81.15	80.00	1.15	1.44
ఎన్ఎండిసి	126.70	124.00	125.95	124.55	1.40	1.12

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
కోల్ ఇండియా	281.40	276.20	278.20	295.50	17.30	5.85
అల్ట్రాటెక్ సిమెంట్	4,166.80	4,003.30	4,026.30	4,189.40	163.10	3.89
ఐఒసి	192.50	183.50	184.75	192.05	7.30	3.80
టాటామోటార్స్	352.60	338.40	339.75	353.10	13.35	3.78
ఎసియన్ పెయింట్స్	1,159.90	1,118.40	1,122.75	1,160.80	38.05	3.28
బిపిసిఎల్	458.50	443.00	447.55	462.05	14.50	3.14
అంబుజా సిమెంట్స్	243.10	234.05	234.75	242.30	7.55	3.12
అదాని పోర్ట్స్	382.25	367.45	370.50	382.15	11.65	3.05
ఎన్‌టిపిసి	169.45	163.65	164.85	169.90	5.05	2.97
హీరో మోటోకార్ప్	3,665.00	3,530.65	3,546.10	3,640.80	94.70	2.60

మొయిలీ ట్వీట్ దుమారం



బెంగళూరు : కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ పేరిట వెలువడ్డ వ్యాఖ్యలు తీవ్రస్థాయిలో వివాదానికి దారితీశాయి. అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్నాటకలో వీరప్ప మొయిలీ చేసినట్లుగాచెపుతున్న ట్వీట్‌లో ఎన్నికలలో ధనబలం కీలకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ కాంగ్రెస్‌లో ఎవరు ఎక్కువగా డబ్బులు వెదజల్లితే వారికే అసెంబ్లీ సీట్లకు టికెట్లు దక్కుతాయని మొయిలీ పేరిట ట్వీట్ వెలువడింది. అయితే తాను ఈ ట్వీట్ వెలువరించలేదని, కావాలనే కొందరు తన పేరును తీసుకువచ్చారని మొయిలీ వివరణ ఇచ్చుకున్నారు. అయితే ఇప్పటికే మొయిలీ పేరిట వెలువడ్డ ట్వీట్ సామాజిక మాధ్యమంలో సంచలనానికి దారితీసింది. కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సి) తక్షణం రాజకీయాలలో ధన బలం సమస్యను పరిష్కరించాల్సి ఉందని, టికెట్ల పంపిణీలో ఒక రింగ్ ఏర్పడటం సమ్మతించదగ్గ పరిణామం కాదని ఈ వివాదాస్పద ట్వీట్‌లో తెలిపారు. రాష్ట్ర పిడబ్ల్యుడి మంత్రితో కాంట్రాక్టర్లు, వారి తాబేదార్ల వలయం ఏర్పడటం మంచిది కాదని మొయిలీ పేరిట ట్వీట్ వెలువడింది. అయితే ఈ ట్విట్టర్ మొయిలీదా ? కాదా? అనేది నిర్ధారణ కాలేదు. ఓ వైపు ఈ ట్వీట్ కలకలం చెలరేగుతున్న దశలో మొయిలీ స్పందించారు. ఎవరో చేసిన తప్పిదం ఇదని స్పష్టం చేశారు. ఆ ట్విట్టర్ తన ఆధీనంలో లేదని , ఆ ట్వీట్ సరికాదని వ్యాఖ్యానించారు.

తలపై రివార్డు ఉన్న నక్సల్ అరెస్టు

రాయ్‌పూర్ : తన తలపై లక్ష రూపాయల రివార్డు ఉన్న ఓ నక్సల్ కమాండర్‌ను ఛత్తీస్‌గఢ్‌లోని కొండగాన్ జిల్లాలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. భద్రతా దళాలు సంయుక్తంగా గురువారం సాయంత్రం కూదూర్‌లో మాల్యా అలియాస్ కశ్యప్‌ను అదుపులోకి తీసుకున్నట్లు కొండగాన్ అదనపు ఎస్‌పి మహేశ్వర్ నాగ్ మీడియాకు వెల్లడించారు. తన గ్రామమైన కూదూర్‌లో మాల్యా ఉన్నట్లు సమాచారం అందడంతో భారత్–టిబెటన్ సరిహద్దు పోలీసులు (ఐటిబిపి) 41వ బెటాలియన్, జిల్లా పోలీసులు గ్రామంలో దాడి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దళాలను చూసి నక్సల్ పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నట్లు ఎఎస్‌పి తెలిపారు. కాగా, మాల్యా తలపై ప్రభుత్వం లక్ష రూపాయల రివార్డును ప్రకటించింది. హత్య, దోపిడీ, దాడులు తదితర నక్సల్స్ సంబంధిత ఘటనల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు.

రామసేతుకు హాని కలిగించం



న్యూఢిల్లీ : జాతి ప్రయోజనాల దృష్ట్యా సేతుసముద్రం నౌకాయాన ప్రాజెక్టు కోసం పురాతన రామసేతుకు ఎలాంటి హాని కలిగించబోమని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. సేతు సముద్రం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా బిజెపి నాయకుడు సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేయగా, రామసేతును తొలగించబోమని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అధ్యక్షతన గల బెంచ్‌కు కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ అఫిడవిట్ దాఖలు చేసింది. జాతి ప్రయోజనాల దృష్ట్యా రామసేతు దెబ్బతినకుండా సేతు సముద్రం నౌకాయాన ప్రాజెక్టుకు గతంలో నిర్ణయించిన అలైన్‌మెంట్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కేంద్రప్రభుత్వం యోచిస్తోందని ఆ అఫిటవిట్‌లో నౌకాయాన మంత్రిత్వశాఖ పేర్కొంది.

ఇర్ఫాన్‌కు అరుదైన క్యాన్సర్ వ్యాధి



ముంబయి: వైద్య పరీక్షలో తనకు న్యూరో ఎండోక్రైన్ ట్యూమర్ అనే అరుదైన క్యాన్సర్ ఉన్నట్లు తేలిందని శుక్రవారం ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ వెల్లడించారు. చికిత్స కోసం దేశం వెలుపల ఉండాల్సివస్తోందన్నారు.అరుదైన న్యూరో ఎండోక్రైన్ కణితిని ఎదుర్కోవడం క్లిష్టమైనప్పటికీ, తన చుట్టు ప్రక్కల ఉన్నవారి ప్రేమ, మద్దతులో వ్యాధిపై పోరాడుతున్నానని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రయాణం తనను దేశం వెలుపలకు తీసుకెళ్తోందన్నారు. తమ ఆశీస్సులు తెలియజేయాలనిప్రతి ఒక్కరిని వేడుకుంటున్నానని తెలిపారు.'పికూ'నటుడు 51 ఏళ్ల ఇర్ఫాన్ తన అనారోగ్యంపై వస్తున్న పుకార్ల గురించిమాట్లాడుతూ న్యూరో అనేది కేవలం మెదడుకు సంబంధించింది మాత్రమే కాదన్నారు.

రూ.2 వేల నోటును నిలిపివేయం

న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దు అనంతరం ప్రవేశపెట్టిన రూ.2 వేల కరెన్సీ నోట్‌ను నిలిపి వేయాలనే ప్రతిపాదన ఏది లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ స్వంతంత్ర మంత్రి పి రాధా కృష్ణన్ లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశంలోని ఐదు నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను విడుదల చేసి, క్షేత్ర స్థాయిలో పరీక్షించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కోచి, మైసూర్, జైపూర్, షిమ్లా, భువనేశ్వర్‌లలో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తామన్నారు. మహాత్మాగాంధీ ఫోటోతో రూ.500 నోట్లు 66 ఎంఎంx150 ఎంఎం, రూ.2000 నోట్ 66 ఎంఎంx 166 ఎంఎం పరిమాణంతో ముద్రిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు నోట్ల మధ్య వ్యత్యాసం సులభంగా గుర్తించేందుకు 10 ఎంఎం పరిమాణం తేడా ఉందని రాధా కృష్ణన్ తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకొని భారత ప్రింటింగ్ ప్రెస్‌లలో నోట్లను ముద్రించనున్నట్లు తెలిపారు. అయితే ఎప్పటి నుంచి ముద్రించనున్నారో ఆయన స్పష్టం చేయలేదు.

ఆప్ పంజాబ్ చీఫ్ రాజీనామా



న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఎపి) పంజాబ్ శాఖ అధ్యక్షుడు భగవంత్ మాన్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా ఈ సమాచారాన్ని తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ తనపై విచారణలో ఉన్న ఓ పరువు నష్టం కేసులో క్షమాపణ చెప్పడంపై భగవంత్ మాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ తనను 'డ్రగ్స్ లార్డ్' అని పేర్కొనడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ బిక్రమ్ సింగ్ మజితియా పరువు నష్టం కేసు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మజితియా మాదక ద్రవ్యాల వ్యాపారంలో భాగస్వామి అని కేజ్రీవాల్ గతంలో ఆరోపించినందుకు మజితియా ఈ దావా వేశారు.గురువారం కేజ్రీవాల్ క్షమాపణ లేఖను మజితియాకు పంపించారు. గతంలో తాను చేసిన ఆరోపణలు నిరాధారమని వెల్లడైందని చెప్తూ, క్షమాపణ చెప్పారు. అయితే కేజ్రీవాల్ వైఖరిని ఆప్ నేతలు తప్పుపట్టారు. తమకు సమాచారం ఇవ్వకుండా కేజ్రీవాల్ మజితియాకు క్షమాపణలు చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఆప్ నేత కుమార్ విశ్వాస్ పేర్కొన్నారు. కేజ్రీవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వేసిన పరువు నష్టం దావా కూడా విచారణలో ఉంది. ఈ కేసు కూడా లేకుండా చేసుకునేందుకు ఆయన జైట్లీకి కూడా క్షమాపణలు చెప్తారేమోనని ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. పంజాబ్‌లో ఆప్‌ను కేజ్రీవాల్ దారుణంగా హత్య చేశాడని కాంగ్రెస్ ఎంపి నవజ్యోత్ సిద్ధు మండిపడ్డారు.

'సింధ్ స్థానంలో ఈశాన్యం'

జాతీయ గీతంపై రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడి తీర్మానం

న్యూఢిల్లీ : జాతీయ గీతంలో సింధ్ స్థానంలో ఈశాన్యం అని చేర్చాలని ప్రతిపాదిస్తూ కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు రిపున్ బోరా శుక్రవారం రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. భారత్‌లో ఈశాన్యం కీలక ప్రాంతమని, అయినా ఆ ప్రాంతానికి జాతీయ గీతంలో చోటుదక్కకపోవడం దురదృష్టకరమన్నారు.మరోవైపు పాకిస్తాన్ భూభాగంలో ఉన్న సింధ్‌ను జాతీయ గీతంలో ప్రస్తావిస్తున్నారని ఎగువ సభలో ప్రైవేట్ సభ్యుడి తీర్మానం ప్రవేశపెట్టిన అనంతరం ఎంపి బోరా అన్నారు. జాతీయగీతంలో సింధ్ అనే పదాన్ని తొలగించి,దాని స్థానంలో ఈశాన్య భారతం అని చేర్చాలని ఈ సభ ప్రభుత్వాన్ని కోరుతోందని తీర్మానంలో పేర్కొన్నారు.గతంలో 2016లో జాతీయ గీతం జనగణమనలో సింధ్ అనే పదాన్ని తొలగించాలని,ఆపేరుతో దేశంలో ఏ రాష్ట్రంలేదని సరైన పదంతో దాన్ని సవరించాలని శివసేన సభ్యుడు అరవింద్ సావంత్ లోక్‌సభలోప్రస్తావించారు.జాతీయ గీతాన్ని నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్1911లో రచించగా1950లోపార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది.

ల్యాబ్‌ను వదిలి ల్యాండ్‌కు..

● శాస్త్రజ్ఞులు క్షేత్రస్థాయికి తరలాలి ● సైన్స్ కాంగ్రెస్‌లో ప్రధాని పిలుపు



ఇంఫాల్ : శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలను క్షేత్రస్థాయికి విస్తరించాల్సి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. పరిశోధనలు ప్రయోగశాలల దశను దాటి, క్షేత్ర స్థాయికి చేరాల్సి ఉందని కోరారు. శాస్త్రజ్ఞుల అమూల్య పరిశోధనల ఫలితం ప్రజలకు మరింత ప్రయోజనాలను కల్గించాల్సి ఉందని చెప్పారు. ఆర్ అండ్ డి అంటే కేవలం పరిశోధన అభివృద్ధి ఒకటే కాదు ఆర్‌డి అంటే దేశాభివృద్ధి సాగే పరిశోధనగా నిర్వచించుకోవల్సి ఉందన్నారు. ఇక్కడ 105వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభోత్సవకార్యక్రమంలో శుక్రవారం ప్రధాని మాట్లాడారు. పరిశోధనలు ల్యాబ్‌ల నుంచి ల్యాండ్‌కు తరలాల్సి ఉందని తెలిపారు. శాస్త్ర విజ్ఞానంలో నూతన ఆవిష్కరణలలో భారత్‌కు సముచిత స్థానం ఉందని, ఇదే సమయంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వినిమయం లో ఘనత వహించిందని చెప్పారు. పరిశోధనలు నిర్ధిష్ట రీతిలో దేశ భవిష్యత్తుకు ఉపయోగపడాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రగతి సౌభాగ్యం దిశలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే విధంగా సిద్ధంగా ఉండాలని అన్నారు. సాంకేతిక ఫలాలతో మానవాళికి పలు సేవలు తేలిక అవుతున్నాయని, ప్రత్యేకించి విద్యా, ఆరోగ్య పరిరక్షణ, బ్యాంకింగ్ సేవలలో టెక్నాలజీ వినియోగం పౌరులకు మేలుగా మారుతోందన్నారు. ఇప్పటివరకూ చేరని చోటికి శాస్త్ర సాంకేతిక మార్గాల ద్వారా చేరుకునేదెట్లా అనేదే సైన్స్ కాంగ్రెస్ ప్రధాన ఇతివృత్తం ఇది చాలా సముచితంగా ఉందని పేర్కొన్న ప్రధాని సామాన్యుడి సమస్యలను, సామాజిక ఆర్థిక క్లిష్టతలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సులువుగా ఛేదించవచ్చునని ఆశించారు. శాస్త్రీయ పరిశోధనలను ప్రజలందరికి చేరవేయాల్సి ఉందన్నారు. ప్రయోగ సంస్థలు, లాబ్‌లను మన పిల్లల సందర్శనకు ఉంచాలని, తరచూ స్కూల్ విద్యార్థులతో శాస్త్రజ్ఞులు ఇష్టాగోష్టిగా మాట్లాడే పద్ధతి ఉండటం మంచిదని సూచించారు. యువతలో శాస్త్రీయ వాతావరణం నెలకొనడం, టెక్నాలజీపై సరైన అవగావహన ఏర్పడటం , వినూత్న ఆవిష్కరణలకు వీలు కల్పించడం వంటివి కీలకం అని ప్రధాని విజ్ఞప్తి చేశారు.

సైంటిస్టులూ... విద్యార్థులతో కలవండి

శాస్త్రజ్ఞులు ప్రతి ఏటా కనీసం 100 గంటలు కనీసం వంద మంది స్కూల్ పిల్లలతో ముచ్చటిస్తే , ప్రత్యేకించి ప్రాధమిక ప్రాధమికోన్నత పాఠశాల విద్యార్థులకు కొత్త విషయాలు తెలియచేస్తే అది దేశంలోని యువతలో శాస్త్రీయ దృక్పథం నెలకొనడానికి, దానిపై ఆసక్తి పెరగడానికి దారితీస్తుందని ప్రధాని తెలిపారు. దేశంలో 2022 నాటికి 100 గిగా వాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన లక్ష్యం పెట్టుకున్నట్లు ప్రధాని వివరించారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, పునరుత్పాదక ఇంధన సృష్టి దిశలో ప్రయోగాలు సాగాల్సి ఉందన్నారు. సౌర శక్తి మరింత వినియోగంలోకి తెచ్చుకునేందుకు తక్కువ ధరలో తక్కువ సంక్లిష్టతతో కూడిన పరికరాల లభ్యత అవసరం అని ప్రధాని కోరారు. శాస్త్రజ్ఞుల అకుంఠిత దీక్ష ప్రతి ఒక్కరి గుర్తింపును దక్కించుకుంటుందని తెలిపిన ప్రధాని ఈ సందర్భంగాఇటీవల కన్నుమూసిన భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్స్‌ను ప్రస్తావించారు. బ్లాక్‌హోల్స్‌పై ఆయన పరిశోధనలతోనే కాకుండా ఒక స్ఫూర్తిప్రదాతగా, భౌతిక వైకల్యాన్నిఅధిగమించిన యోధుడిగా ఆయన అందరికీ గుర్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ దేశంలో శాస్త్రపరంగా సాధించిన విజయాలను ప్రస్తావించారు. 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలన జరుగుతుందన్నారు. శాస్త్రీయ విజయాలు కేవలం సైన్స్‌కే పరిమితం కావని వీటి పరిధి విస్తృతం అని, మొత్తం మానవాళిని పలు విధాలుగా ఇవి ప్రభావితం చేస్తాయని ప్రధాని చెప్పారు.

దలేర్‌కు రెండేళ్ళ జైలు



పాటియాలా : మనుష్యుల అక్రమ రవాణా కుంభకోణంలో పంజాబీ పాప్ గాయకుడు దలేర్ మెహందీకి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. మనుష్యుల అక్రమ చేరరవాణా వ్యవహారంలో ఆయన పాత్ర నిర్ధారణ కావడంతో స్థానిక న్యాయస్థానం శుక్రవారం దోషిగా నిర్ధారించింది. ఐపిసి సంబంధిత నిబంధనల పరిధిలో జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఫస్ట్‌క్లాస్ జడ్జి నిధి సైనీ ఈ శిక్షను ఖరారు చేశారని న్యాయవాది గుర్‌ప్రీత్ సింగ్ భాసిన్ చెప్పారు. ఈ గాయకుడికి జైలు శిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా కూడా విధించారు. పంజాబీ గీతాలతో అలరించే ఈ గాయకుడు తన సంగీత బృందంతో పాటు కొందరిని అక్రమంగా విదేశాలకు తరలించే వాడని ఫిర్యాదులు అందాయి. 2003లో మ్యూజిక్ ట్రూప్‌తో పాటు మెహందీ, ఆయన సోదరుడు షంషేర్ మెహందీలు అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు అక్రమంగా కొందరిని చేర్చినట్లు ఆరోపణలు అందాయి. దీనిపై కేసులు దాఖలు అయ్యాయి. దలేర్‌కు వ్యతిరేకంగా దాదాపు 35 ఫిర్యాదులు అందాయి. దీనితో సోదరులిద్దరిని అరెస్టు చేశారు. బెయిల్‌పై కొనసాగుతూ వస్తున్న వీరు వరుసగా కోర్టు విచారణను ఎదుర్కొంటున్నారు. మెహందీ ట్రూప్‌తో పాటు అమెరికా అక్రమంగా వలసవెళ్లేందుకు కొందరు ఈ సోదరులకు డబ్బులిచ్చారని వెల్లడైంది. అయితే వారు సరైన విధంగా గమ్యం చేరలేకపోవడంతో కథ అడ్డం తిరిగింది. దీనితో అక్రమ ఇమ్మిగ్రేషన్, ఈ చేరవేత ముడుపుల కేసు వెలుగులోకి వచ్చింది. తనను కెనడాకు తీసుకువెళ్లేందుకు ఈ బ్రదర్స్ తన వద్ద కూడా డబ్బులు తీసుకువెళ్లినట్లు న్యాయవాది తెలిపారు.అంతకు ముందు 1998,99లలో ఈ ట్రూప్ వారుతమ కచేరీ పేరిట దాదాపు పది మందిని అమెరికాకు చేరవేశారని కూడా ఫిర్యాదులు అందాయి. ఇక ఒక నటితో పాటు అమెరికాకు వెళ్లినప్పుడు దలేర్ ముగ్గురు బాలికలను శాన్‌ఫ్రాన్సిస్కోకు చేర్చారని ఆరోపణలు వెలువడ్డాయి. ఇక 99 అక్టోబర్‌లో ఇద్దరు సోదరులు కొందరు నటులతో కలిసి అమెరికా టూర్‌కు వెళ్లినప్పుడు ముగ్గురు బాలలను న్యూజెర్సీకి చేర్చినట్లు వెల్లడైంది. సంగీత కచేరీల ముసుగులో నడిచిన ఈ వ్యవహారంపై తీవ్రస్థాయి దర్యాప్తు జరిగింది. పలు సోదాలు, డబ్బులు ఇచ్చిన వారి ఫైళ్ల వివరాల పరిశీలన తరువాత కీలక సాక్ష్యాల వెల్లడి తరువాత దలేర్‌కు శిక్ష ఖరారు అయింది.

'నిర్భయ' ఇంకా ఎంత అందంగా ఉండేదో



ఎంత బలవంతులైనా రేపిస్టులకు లొంగిపోవాల్సిందే
నిర్భయ తల్లి సమక్షంలో మాజీ డిజిపి వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు : నిర్భయ తల్లి ఆశాదేవిని ఉద్దేశించి కర్నాటక రిటైర్డ్ అధికారి ఒకరు నిర్భయ తల్లి ఆశాదేవిని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్త్రీలను సన్మానించేందుకు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి మాజీ డిజిపి హెచ్‌టి సంగ్లియానాను ఆహ్వానించారు.ఈ కార్యక్రమానికి 'నిర్భయ' తల్లి ఆశా దేవి కూడా వచ్చారు. సంగ్లియానాను వేదిక మీదకు ఆహ్వానించి మాట్లాడాల్సిందిగా కోరారు.'నిర్భయ తల్లిని చూశాను. ఆమె చక్కగా, అందంగా ఉన్నారు. తల్లే ఇంత అందంగా ఉంటే ఇక నిర్భయ ఎంత అందంగా ఉండేదో నేను ఊహించగలను' అని సంగ్లియానా వ్యాఖ్యానించారు. మరో అడుగు ముందుకేసి 'మీరు ఎంత బలవంతులైనా సరే.. రేపిస్టులకు లొంగిపోవాల్సిందే. అలా అయితేనే మీరు, మీ జీవితాలు సురక్షితంగా ఉంటాయి, ఈ మాటలు ఇక్కడ కూర్చున్న ప్రతి ఒక్కరికి వర్తిస్తాయి' అంటూ వ్యాఖ్యానించారు. సంగ్లియానాపై మహిళా సంఘాలు ధ్వజమెత్తాయి. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

మాజీ డిజిపి వ్యాఖ్యలపై నిర్భయ తల్లి ఆశాదేవి తీవ్రంగా స్పందించారు. కొందరిమనస్తత్వాలు అంతేనని అన్నారు. నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా జరిగిన పోరాటాల గురించి ఆయన మాట్లాడితే బాగుండేదన్నారు.

రూ.222కోట్ల ఎన్నికల బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల విక్రయంపై కేంద్రం లోక్‌సభలో ఒక ప్రకటన చేసింది. ఇప్పటి వరకు రూ.222కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను అమ్మినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పి.రాధాకృష్ణన్ శుక్రవారం తెలియజేశారు. రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాల ప్రక్రియను పారదర్శకంగా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల బాండ్ల విధానాన్నితీసుకొచ్చిందన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు ఈ ఎన్నికల బాండ్ల విక్రయాలను కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ చేపట్టింది. మార్చి 9, 2018 వరకు తొలి విడత అమ్మకాల్లో భాగంగా రూ.222కోట్ల ఎన్నికల బాండ్ల విక్రయాలు జరిగాయని మంత్రి రాధాకృష్ణన్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఎస్‌బిఐ శాఖల్లోనే వీటి విక్రయాలు జరిపినట్లు మంత్రి పేర్కొన్నారు. బాండ్లు జారీ చేసిన తేదీ నుంచి 15రోజుల వరకు మాత్రమే చెల్లుబాటవుతాయన్నారు.

జెఎన్‌యు ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల కేసు

న్యూఢిల్లీ : కొందరు విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలతో జెఎన్‌యు స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (ఎస్‌ఎల్‌ఎస్) ప్రొఫెసర్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నైరుతి ఢిల్లీలోని వసంత్‌కుంజ్ పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేసినట్టు వెల్లడించారు. విద్యార్థినుల పట్ల ఆ ప్రొఫెసర్ అసభ్యంగా ప్రవర్తించేవారని, అసభ్య వ్యాఖ్యలు చేసేవారని, ఎవరైనా ఆయనకు అభ్యంతరం తెలిపితే ఆ విద్యార్థిని పట్ల ఆయన ప్రతీకారంతో వ్యవహరించేవారని విద్యార్థినులు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రొఫెసర్‌కు పరిపాలనా శాఖకు సంబంధాలున్నాయని, దీంతో ఒక పరికరాన్ని కూడా కొనుగోలు చేయకుండానే కోట్ల రూపాయలు వినియోగించినట్టు లెక్కలు చూపించారని ఫిర్యాదులో వారు జెఎన్‌యులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రొఫెసర్‌ను త్వరలోనే విచారిస్తామని పోలీసులు తెలిపారు.

నేడు కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ భేటీ



మన తెలంగాణ/న్యూఢిల్లీ: శనివారం నుండి దేశరాజధాని ఢిల్లీలో రెండు రోజుల పాటు జరగనున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరి సమావేశాలలో చర్చించాల్సిన అంశాలను ఖరారు చేసేందుకు శుక్రవారం సాయంత్రం పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అధ్యక్షతన కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభం ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలు కానున్నాయి. ఉ. 9 గంటలకు అధ్యక్షుడు రాహుల్ గాంధీ జెండా ఆవిష్కరణ చేయడంతో ఈ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఇటీవల మరణించిన పార్టీ నాయకులకు సంతాపం, స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పించనున్నారు. ఆ తర్వాత ఉదయం 9.30కి రాహుల్ గాంధీ ప్రారంభ ఉపన్యాసం చేయనున్నారు.మొదటిరోజు సమావేశాలలో ముఖ్యం గా రెండు తీర్మానాలపై చర్చ జరగనున్నది. రాజకీయ రంగం, వ్యవసాయ రంగాలపై విస్తృతంగా చర్చజరగనున్నది. శుక్రవారం జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు. అనంతరం తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రె స్ ప్లీనరీ సమావేశంలో చర్చించే అంశాలపై సబ్జెకట్స్ కమిటీ చర్చలు జరిపామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ధాన్యం కొనుగోలుకు మద్దతు ఇవ్వాలని, వచ్చే ఎన్నికలలో పార్టీ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా రుణ మాఫీ చేయాలని శుక్రవారం నాటి స్టీరింగ్ కమిటీలో అభిప్రాయం వ్యక్తం అయ్యిందని తెలిపారు. శనివారం నాటి సమావేశంలో ఈ అంశాలతో పాటు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫజల్ భీమా పథకం ఫెయిల్ కావడానికి కారణాలు ప్రస్తుత ఇన్సూరెన్స్ విధానంలో రైతులకు నష్టం, భీమా సంస్థలకు ఎక్కువ లాభం కావడానికి కారణాలపై కూడా చర్చించనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. పార్లమెంట్‌లో పాస్ అయిన ల్యాండ్ అక్విజేషన్ బిల్లుకి పలు సవరణలు తీసుకు రావాలని తెలంగాణ పార్టీ తరపున కోరామని, తెలంగాణలో ఈ యాక్ట్ అమలు అవడం లేదన్న విషయాన్ని కూడా చర్చించామని తెలిపారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే పై అంశాలన్నింటిని సవరిస్తామని, రైతులకు న్యాయం చేస్తామని శనివారం జరిగే ప్లీనరీలో వ్యవసాయ రంగంపై జరిగే చర్చలో ప్రస్తావించి ఒక తీర్మానాన్ని ఆమోదిస్తామని ఉత్తమ్ తెలిపారు. ఏపీ విభజన చట్టం 2014 అమలును మోడీ సర్కారు విస్మరిస్తుంది కాబట్టి కాంగ్రెస్ సర్కారు వస్తే దాన్నిఅమలు చేసే విధంగా హామీ ఇస్తూ తీర్మానాన్ని ఆమోదించాలని కోరామన్నారు.

లోక్‌సభలో ఇంద్రధనస్సు

గులాబీ, పసుపు కండువాలు, ఎర్రటోపీలు

న్యూఢిల్లీ : లోక్‌సభ శుక్రవారం రంగులను సంతరించుకుంది. దక్షిణాదికి చెందిన ఎంపీలు తమ పార్టీల రంగుల కండువాలతో నిరసనలకు దిగడం, సమాజ్‌వాది పార్టీ సభ్యులు తమ సాంప్రదాయకపు ఎరుపు టోపీలు పెట్టుకుని సభలో సందడి చేయడంతో ఉగాదికి ముందొచ్చిన హోలీ కన్పించింది. లోక్‌సభలో టిఆర్‌ఎస్, టిడిపి సభ్యులు అందరి దృష్టిని ఆకర్షించారు. టిఆర్‌ఎస్ సభ్యులు తమ గులాబీ కండువాలతో టిడిపి సభ్యులు పసుపు కండువాలతో కొట్టొచ్చినట్లుగా కన్పించారు. శుక్రవారం సభ తొలుత వాయిదా పడి తిరిగి సమావేశం కాగానే గులాబీ రంగు కండువాలతో టిఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లారు.తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంపుదలకు వారు పట్టుబడుతున్నారు. ఒక దేశం ఒక చట్టం పేరిట వారు ప్లకార్డులు చేతబూనారు. ఇక టిడిపి వారు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ధర్నాలు చేస్తు న్న విషయం తెలిసిందే. తమిళనాడుకు చెందిన అన్నాడిఎంకె సభ్యులు తమ పార్టీ రంగులను సూచించే నలుపు, తెలుపు, ఎరుపు కండువాలు, రిబ్బన్లతో సభలో కన్పించారు. కావేరీ నదీ జలాల అన్యాయం సరిదిద్దాలని, కావేరీ పంపిణీ బోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఇక యుపి ఎన్నికలలో రెండు ఎంపీ సీట్లను కైవసం చేసుకున్న సమాజ్‌వాది పార్టీ ఉత్సాహం సభలో రంగులలో తళుక్కుమంది. పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్‌తో పాటు ఎంపీలు అంతా ఎరుపు రంగు యుపి టైప్ టోపీలు ధరించి సందడి చేశారు. సభ్యులు ఓ వైపు రంగుల కండువాలతో నిరసనలతో సందడి చేయడం, మరో వైపు అవిశాస్వపు తీర్మానాల నోటీసు బాణాల దశలోనే స్పీకర్ సుమిత్రా మహాజన్ ఇక ఇప్పటికీ ఈ రంగులు చాలు అన్నట్లుగా సోమవారానికి సభను వాయిదా వేశారు.



జోరుగా మహాకూటమి యత్నాలు : ఎన్‌సిపి

ముంబై : ప్రతిపక్ష పార్టీల మహాకూటమి దిశలో ప్రయత్నాలు జోరందుకున్నాయని ఎన్‌సిపి పేర్కొంది. కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఎన్‌సిపి నేత శరద్ పవార్‌ను కలుసుకోవడం కీలక పరిణామం అని ఎన్‌సిపి ప్రతినిధి నవాబ్ మాలిక్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ ఎంపి ఉప ఎన్నికల ఫలితాల వెనువెంటనే రాహుల్ –పవార్‌ల భేటీ జరిగింది. ప్రతిపక్షాల మహాకూటమి ఏర్పాటు దిశలో కాంగ్రెస్ అధినాయకత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోందని , తన కన్నా సీనియర్ నేతలతో రాహుల్ చర్చల ప్రక్రియ మొదలు అయిందని తెలిపారు. వివిధ పార్టీల నేతలతో చర్చల ప్రక్రియను రాహుల్ చేపట్టారని , పెద్దపార్టీ అయినప్పటికీ ఆ భేషజాన్ని వీడి రాహుల్ అందరినీ కలుసుకుంటున్నారని , మహాకూటమి ఏర్పాటు దిశలో ఇది కీలక ముందడుగు అవుతోందని మహారాష్ట్ర మాజీ మంత్రి కూడా అయిన నవాబు తెలిపారు. యుపిఎను తిరిగి బలోపేతం చేసే దిశలో పవార్ వంటి వారి సాయాన్ని రాహుల్ తీసుకుంటున్నారని ఇది మంచి పరిణామం అవుతుందని అన్నారు. ఎన్‌డిఎలో లుకలుకలు బయలుదేరాయని, ఇప్పుడు టిడిపి దూరం అయిందని, అయితే బిజెపితో విభేదాలతో ఉన్న శివసేన కూడా ఇదే బాటలో వెళ్లుతుందని అనుకోవడం లేదని , శివసేన వారు బేరసారాలకు దిగే బాపతు అని, వారికి వైదొలిగే ధైర్యం లేదని ఎన్‌సిపి నేత చెప్పారు.

సిరియా దాడుల్లో 18మంది మృతి


డమాస్కస్ : సిరియాలో నరమేధం ఆగడం లేదు. తాజాగా ఆఫ్రిన్ పట్టణంపై జరిగిన దాడిలో 18 మంది మృతి చెందారు. ఉత్తర సిరియాలో కుర్దిశ్ వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివసించే ఆఫ్రిన్ సిటీపై టర్కీ ఫిరంగి దాడులు చేయడంతో వీరంతా మరణించినట్లు సిరియా మానవ హక్కుల సంఘం తెలిపింది. మరణించిన వారిలో ఐదుగురు చిన్నారులు కూడా ఉన్నట్లు పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న టర్కీ, సిరియాకు చెందిన తిరుగబాటు ప్రతినిధులు ఆఫ్రిన్ ప్రాంతంలో ప్రమాదకరమైన ఫిరంగులను ఏర్పాటు చేశారు. వీటి మూలంగానే ఆఫ్రిన్ ప్రాంతంలో అలజడులు చెలరేగుతున్నాయి. యూఎస్ మద్దతు గల కుర్దిశ్ పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్(వైపీజీ) నియంత్రణలో ఉన్న ఈ ప్రాంతం ఇప్పటికే టర్కీకి చెందిన బలగాల చేతిలో చిక్కుకోవడంతో రోజుకో ఘటన జరుగుతోంది. నగర ప్రజలు పారిపోయేందుకు వీలుగా ఒకే ఒక రోడ్డు మార్గం మాత్రమే ఉండటంతో వారంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కాగా గురువారం నాటికే 30 వేల మంది ఆఫ్రిన్ ప్రజలు మరణించినట్లు ఒక నిఘా సంస్థ తెలిపింది.

యువరాజు పెళ్లికి ఎలిజబెత్ ఓకే



లండన్ : తన మనుమడు హారీ అమెరికా సినీనటి మెఘాన్ మార్కీని వివాహమాడేందుకు బ్రిటన్ రాణి ఎలిజబెత్ –2అంగీకరించారు. తన సలహాదారులతో గురువాదరం జరిగిన సమావేశం సందర్భంగా రాణి ఎలిజబెత్ –2 ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.'నా ప్రియతమ మనుమడు హారీ చార్లెస్ ఆల్బర్ట్ డేవిడ్, రేచల్ మెఘాన్ మార్కీల వివాహానికి నా సమ్మతిని ప్రకటిస్తున్నాను' అని బంకింగ్ హోం ప్యాలెస్‌లో జరిగిన సమావేశంలో రాణి ఎలిజబెత్ –2 ప్రకటించారు. లండన్‌లోని రాయల్ రెసిడెన్స్ అయిన విండ్సర్ క్యాస్టిల్‌లోని సెయింట్ జార్జి చాపెల్‌లో మే 19న హారీ, మెఘాన్ మార్కీల వివాహం జరుగుతుంది.

ట్రంప్ షేకప్.. కీలక మార్పులకు సిద్ధం



వాషింగ్టన్ : అమెరికాలో ఉన్నత స్థాయి అధికార యంత్రాంగంలో భారీ మార్పులు చేర్పులకు ప్రెసిడెంట్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతా సలహాదారుడు (ఎన్ఎస్ఎ) హెచ్ ఆర్ మెక్‌మాస్టర్‌ను తొలిగించాలని ట్రంప్ నిర్ణయించినట్లు , ఇతర కీలక పదవులలో కూడా మార్పులకు సిద్ధం అవుతున్నట్లు వెల్లడైంది. అధికార యంత్రాంగంలో ట్రంప్ ఆపరేషన్‌పై వాషింగ్టన్ పోస్టు ప్రధాన వార్తను ప్రచురించింది. ఎన్ఎస్ఎ వైఖరి పట్ల ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారు. అయితే ఈ ఉన్నతాధికారిపై వేటు వేధింపు చర్యగా మారరాదని, తగు వారసుడిని ఎంచుకున్న తరువాత నిర్ణయాన్ని అమలు పర్చాలని ట్రంప్ భావిస్తున్నట్లు పత్రిక తెలిపింది. కేవలం ఈ పదవి ఒక్కటే కాకుండా మిగిలిన పలు కీలక స్థానాలలో మార్పులకు ట్రంప్ ఆలోచిస్తున్నట్లు , వైట్‌హౌజ్ లోని కొందరు సీనియర్లపై కూడా వేటు పడనున్నట్లు వెల్లడించారు. అయితే పత్రికలలో వచ్చిన వార్తలను వైట్‌హౌజ్ వర్గాలు ఖండించాయి. ఎన్ఎస్‌సి పదవీచ్యుతి వార్త నిజం కాదని , ప్రెసిడెంట్‌కు ఎన్ఎస్‌సికి సత్సంబంధాలు ఉన్నాయని , కావాలంటే దీనిని వారినుంచి నిర్ధారించుకోవచ్చునని వైట్‌హౌజ్ ప్రతినిధి సరాహ్ సాండర్స్ చెప్పారు.

ఇరాన్ అణ్వాయుధాలు వృద్ధి చేస్తే మేమూ చేస్తాం : సౌదీ


వాషింగ్టన్ : ఇరాన్ కనుక అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తుంటే తమ దేశం కూడా తదనుగుణంగానే చర్యలు చేపడుతుందని సౌదీ రాజు మహ్మద్ బిన్ సల్మాన్ హెచ్చరించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపేందుకు వాషింగ్టన్‌కు రావడానికి కొద్ది రోజుల ముందు ఈ విషయాన్ని వెల్లడించారు.'సౌదీఅరేబియాకు ఎలాంటి న్యూక్లియర్ బాంబు అవసరం లేదని, అయితే ఒకవేళ ఇరాన్ న్యూక్లియ ర్ బాంబును అభివృద్ధి చేస్తే కనుక మేము కూడా అదే పని చేస్తాం'అని సిబిఎస్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.ఈ ఇంటర్వ్యూలను పలు భాగాలుగా గురువారం విడుదల చేశారు. యూరప్‌లోను, ప్రపంచం చుట్టూ ఉన్న అనేక దేశాలు భయంకరమైన హిట్లర్ ఉన్నప్పటి వరకు ఏం జరిగిందన్నదితెలుసుకోలేకపోయాయని అన్నారు. తూర్పు మధ్య ప్రాంతంలో ఇలాంటి ఘటనలను తాను చూడాలని కోరుకోవడం లేదని అన్నారు.

సుక్మా ఘటన నివారించదగ్గదే

సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ ఆర్ఆర్ భట్నాగర్

న్యూఢిల్లీ : చత్తీస్‌ఘడ్‌లో నక్సల్స్ దాడిలో పోలీసు బలగాలు మృత్యువాత పడిన ఘటన నివారించదగ్గదే అని సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ ఆర్ఆర్ భట్నాగర్ పేర్కొన్నారు. సుక్మా జిల్లాలోని ఘటనాస్థలిని సందర్శించిన వచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కేసు పూర్వాపరాల్లోకి తాను వెళ్లబోవడం లేదని, కాని పారామిలటరీ దళాలు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తమ కార్యకలాపాలను కొనసాగించాలని సూచించారు. 'ఇది చాలా దురదృష్టకరమైన ఘటన. కాని ఇది నివారించదగ్గదే. ఈ ఆపరేషన్ ఎలా జరిగిందన్న దానిపై ఇప్పుడు ఆలోచిస్తున్నాం. ఏ విధమైన మంచి చర్యలు తీసుకున్నా, తీసుకోబోతున్నా, దీనికి సంబంధించి విచారణ జరుగుతోంది' అని చెప్పారు. బులెట్ ప్రూఫ్ వెహికిల్స్‌తో చాలా ప్రయోజనాలున్నాయని, మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో ఇవి కీలకంగా ఉంటాయని అన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి ఏడు గంటలు



తిరుమల : తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ తగ్గింది. శ్రీవారి దర్శ నం కోసం భక్తులు 12 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి ఏడు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటలు, కాలినడక భక్తులకు రెండు గంటల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని 69,385 మంది దర్శించుకున్నారు. 29,723 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. గురువారం శ్రీవారి హుండీకి రూ.3.10 కోట్ల ఆదాయం సమకూరింది.

కూలిన పాదచారుల బ్రిడ్జి

ఆరుగురు మృతి, నలుగురికి గాయాలు



మియామీ : మియామీలో కొత్తగా ఏర్పాటు చేసిన 950 టన్నుల బరువైన పాదచారుల బ్రిడ్జి కుప్పకూలిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. బ్రిడ్జి శిథిలాల్లో చాలా కార్లు చిక్కుకుపోయాయి. ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్శిటీ నుంచి స్టూడెంట్ హౌసింగ్ ప్రాంతాన్ని అనుసంధానం చేసే ఈ బ్రిడ్జి నిర్మాణం వారం క్రితమే పూర్తయినా దీని పై ఇంకా రాకపోకలను ప్రారంభించలేదు. 'ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు' అని మియామీ డేడ్ ఫైర్ చీఫ్ డేవ్ డౌనీ విలేకరులకు తెలిపారు. ప్రమాద స్థలిలో గాలింపు జరుగుతోందని, ఎవరైనా శిథిలాల్లో ఇరుక్కుని వుంటే వారిని తప్పకుండా బయటకు తీసుకొస్తామని డిప్యూటీ మేయర్ మౌరిస్ కెంప్ తెలిపారు.

బ్రిడ్జి కింద కనీసం 8 కార్లు చిక్కుకుని ఉంటాయని మియామీ డేడ్ అగ్నిమాపక దళ చీఫ్ పాల్ ఎస్టోపియన్ తెలిపారు. బ్రిడి కూలుతున్నప్పుడు పెద్ద శబ్దం వినిపించిందని, విపత్తు కలిగిన ప్రాంతంలా ఇది కనిపిస్తోందని, బాంబు పేలుడు తర్వాత పరిస్థితి నెలకొందని పోలీసు డిటెక్టివ్ జాన్ కర్లోస్ తెలిపారు.

అకాల వర్షాలతో రబీకి నష్టం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతన్నకు ఈ ఏడాది నష్టాలే

మన తెలంగాణ/ ఆదిలాబాద్ : ఎన్నో ఆశలతో పంటలను సాగు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు ఈ ఏడాది వ్యవసాయంలో నష్టాలు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ దిగుబడి కంటే రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తగ్గడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖరీఫ్ ప్రారంభంలో విత్తనాలు నాటుకొనే దశలో వర్షాలు అనుకూలంగా కురవడంతో అన్ని రకాల పంటలు బాగా పండుతాయని భావించారు. అయితే నకిలీ విత్తనాల కారణంగా పూత, కాత రాక వేలాది ఎకరాలలో సాగు చేసిన పంటలపై తీవ్ర ప్రభావం పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.69 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పత్తి పంటకు గులాబి రంగు పురుగు సోకడంతో ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తగ్గిందని అంటున్నారు. ఇలా దాదాపు 10 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి తగ్గిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక 1.05 లక్షల హెక్టార్లలో సాగు చేసిన సోయాబీన్ పంటను వర్షాలు దెబ్బ తీశాయని రైతులు వాపోతున్నారు. పంట పూత, కాత దశలో ఉన్న సమయంలో భారీ వర్షాలు కురవడంతో ఆశించిన మేరకు దిగుబడి రాలేదని అంటున్నారు. హెక్టారుకు కనీసంగా నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. ఇక 13509 హెక్టార్లలో జొన్న, 10340 హెక్టార్లలో మొక్కజొన్న, 47459 హెక్టార్లలో కంది, 7269 హెక్టార్లలో పెసర, 7114 హెక్టార్లలో మినుములు, 30792 హెక్టార్లలో వరిని సాగు చేయగా, పత్తి, సోయాబీన్‌తో కలుపుకొని జిల్లాలో ఈ ఏడాది 4.98 లక్షల హెక్టార్లలో పంటలను సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో పంటలు ఆశించిన స్థాయిలో పెరగడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు భావించారు. అయితే ఆ తరువాత వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉండడంతో దిగుబడులు అంతంతమాత్రంగానే వచ్చాయి. దీనికితోడు పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని వ్యాపారులు ధర చెల్లించడంలో ఇబ్బందులు సృష్టించడం, తేమ శాతం కొలిచే యంత్రాలతో రైతులను మోసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రారంభంలో నాలుగు వేలకు అటుఇటుగా ధర చెల్లించగా పంటను రైతులు పూర్తిగా అమ్ముకున్నారు. పంట చివరి దశలో ఉన్న సమయంలో పత్తి క్వింటాల్ ధర అమాంతం పెరిగి 5 వేలకు చేరుకుంది. పత్తినంతా అమ్ముకున్న తరువాత ధర పెరగడంతో రైతులు క్వింటాలుకు 5 నుంచి 8 వందల రూపాయల వరకు నష్టపోవాల్సి వచ్చింది. ఇలా అనేక విధాలుగా రైతులు నష్టపోగా, కూలీల కొరతతో పాటు పెరిగిన ధరల కారణంగా వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు సైతం భారీగా పెరిగాయి. పెట్టుబడులు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా దిగుబడులు రాకపోవడం, వచ్చిన దిగుబడులకు సరైన ధర మార్కెట్‌లో లేకపోవడంతో ఈ ఏడాది వ్యవసాయం రైతులకు అచ్చి రాలేదని అంటున్నారు. ఇక రబీ పంటలను సాగు చేసిన రైతులకు సైతం గత 25 రోజుల క్రితం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వడగళ్ల వాన కురవడంతో పంటలన్ని నేలపాలయ్యాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమకు ఇబ్బందులు తప్పవని జిల్లా రైతాంగం పేర్కొంటున్నారు.

2019లో బిజెపి ఎంపిలు 110

ముంబయి: లోక్‌సభ ఉపఎన్నికల్లో బిజెపి వైఫల్యాన్ని 'అహం, అహంకారం' ఓడిందని ఆ పార్టీ మిత్రపక్షమైన శివసేన అభివర్ణించింది. 2019 సాధారణ ఎన్నికల నాటికి బిజెపి లోక్‌సభ సభ్యుల సంఖ్య 110కి పడిపోతుందని ఎద్దేవా చేసింది. చిన్న రాష్ట్రం త్రిపురలో విజయం సాధించి ఉత్సవాలు జరుపుకునేందుకు సిద్ధమవుతుండగా, ఉత్తరప్రదేశ్‌లో పార్టీకి కంచుకోటగా ఉన్నగోరఖ్‌పూర్, ఫుల్‌పుర్ లోక్‌సభ సీట్లను ఎస్‌పి గెలుచుకోవడంతో బిజెపి క్యాంప్‌లో భయాందోళనలు సృష్టించిందని శివసేన తన అధికార పత్రిక 'సామ్నా' ఎడిటోరియల్‌లో పేర్కొంది.మిత్రులను విడిచిపెట్టి అబద్ధాల మార్గాన్ని అను సరించేవారు నష్టపోతారన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన 10 ఉప ఎన్నిక ల్లో తొమ్మిది స్థానాల్లో బిజెపి ఓడిపోయిందని పేర్కొంది. మొద ట్లో 282 మంది ఉన్న బిజెపి లోక్‌సభ సభ్యుల సంఖ్య మోడీ, అమిత్ షా నాయకత్వంలో 272కు పడిపోయిందని తెలిపింది.ఒకసారి పతనం ప్రారంభమయ్యాక, ఏ చాణక్యుడు రక్షించలేడని పేర్కొంది.

అనివార్యపు అవిశ్వాసానానికి మద్దతు : సురవరం

హైదరాబాద్ : కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తామని సిపిఐ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ పార్టీలు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. ఇది మంచి పరిణామం అని, దీనికి తమ పార్టీ మద్దతు ఉంటుందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పిటిఐ వార్తా సంస్థతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని విభజన దశలో పేర్కొన్నారని, ఈ విషయంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం నిలబెట్టుకోలేదని సురవరం తెలిపారు. ఈ దశలో అవిశ్వాస తీర్మానమే సహేతుక పరిణామం అవుతుందని స్పష్టం చేశారు. నిజానికి ప్రత్యేక హోదా వాగ్దానం చేసింది కేంద్ర ప్రభుత్వం అని, కాంగ్రెస్ పార్టీపరంగా చేసింది కాదనే విషయాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని తెలిపారు. అప్పట్లో రాజ్యసభలో వెంకయ్యనాయుడు, అరుణ్ జైట్లీలు వేర్వేరుగా ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించారని, దీనికి అప్పటి ప్రధాని ప్రభుత్వం తరఫున సమ్మతి తెలిపారని సురవరం గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉందనేది అప్రస్తుతం అని, గతంలో ప్రధాని, ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం ఖచ్చితంగా అధికారంలో ఉన్న ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా అందుకు సమానంగా ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కూడా విడుదల చేయలేదని, ఇది ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధం అవుతుందని , ప్రస్తుత ప్రభుత్వమే జవాబుదారి కావాల్సి ఉందని తెలిపారు. ఈ దశలో ఈ ప్రభుత్వంపై తీసుకువస్తున్న అవిశ్వాస తీర్మానంలో ఔచిత్యత ఉందని, దీనికి తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు.

తెలంగాణ భవన్‌లో కోమటిరెడ్డి, సంపత్ హల్‌చల్



మనతెలంగాణ/న్యూఢిల్లీ: పార్టీ ప్లీనరి సమావేశాలకు హాజరు కావడానికి దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్న కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ లకు ఢిల్లీ తెలంగాణ భవన్ లో అధికారులు రూములు కేటాయించక పోవడంతో వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మాజీ ఎమ్మెల్యేలకు గదులు కేటాయించవద్దని హైదరాబాద్ సాధారణ పరిపాలన విభాగం నుంచి ఆదేశాలు రావడంతో తాము నిరాకరించామని అధికారులు వివరణ ఇచ్చారు. అయితే అధికారులు ఇచ్చిన వివరణపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా నోటీఫై చేయనందున తాము ఇంకా శాసనసభ్యులమే కాబట్టి మాకు తెలంగాణభవన్ గెస్ట్‌హౌస్‌లో గదులు కేటాయించాల్సిందే అని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లు సీఎం కేసీఆర్ మోసాలను ప్రజలందరూ గమనిస్తున్నారంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూగత నాలుగు సంవత్సరాల నుంచి కేసీఆర్ ప్రజలందరిని కులాల వారీగా విడదీస్తూ మోసం చేస్తున్నారని విమర్శించారు.అప్పులు తీసుకొనివచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తిసేలా చేశారంటూ ఆరోపణలు చేశారు. ఆంధ్ర కాంట్రాక్టర్లకు తెలంగాణ ఆస్తులను దోచి పెట్టారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వానికి,మోడీకి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్న కెసిఆర్ శుక్రవారం వైఎస్సార్ పార్టీ, టిడిపిలు కేంద్ర ప్రభుత్వం పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు.దీన్నిబట్టి కెసిఆర్,బిజెపితో రహస్య ఒప్పందంచేసుకున్నారని అర్థం అవుతుందని ఆరోపించారు.

టిఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు

తమ్మినేని వీరభ్రధం

మన తెలంగాణ / హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ టిఆర్ఎస్ పార్టీతో సిపిఐ(ఎం)కు పొత్తులుండబోదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభ్రధం స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిజెపికి భిన్నంగా ఒక ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తామంటూ కెసిఆర్ చెప్పడం ఆహ్వానించదగిందేనని, అయితే కెసిఆర్ ఒక అపనమ్మకస్తుడని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో కూడా తమతో పొత్తు పెట్టుకుని ఎన్నికల ఫలితాలు రాకముందే బిజెపి నేతలతో మంతనాలు సాగించారని గుర్తు చేశారు. సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి. నర్సింహారావు, బి.వెంకట్‌తో కలిసి ఎంబి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయంగా దేశవ్యాప్తంగా వామపక్షాలు, ప్రజాస్వామ్య, సామాజిక శక్తులను ఏకం చేస్తున్న తరుణంలో అదే విధమైన నినాదమిస్తున్న టిఆర్ఎస్‌తో తమ పార్టీ పొత్తు పెట్టుకుంటుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 19న బిఎల్‌ఎఫ్ కార్యాలయాన్ని గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని ప్రారంభిస్తారని, అదే రోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాజన పాదయాత్ర ముగింపు వార్షికోత్సవం జరుగుతుందన్నారు.

లోయా మృతి దర్యాప్తు పిటిషన్లపై సుప్రీం తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ : సొహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరుపుతున్న సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా అనుమానస్పద మృతిపై స్వతంత్ర సంస్థచే దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం నాడు రిజర్వులో ఉంచింది. లోయా 2014 డిసెంబరు1న నాగ్‌పూర్‌లో తన సహచరుడి కుమార్తె వివాహ నికి హాజరు కాగా అకస్మాత్తుగా మృతిచెందారు.అయితే ఆయన గుండెపో టుతో మరణించినట్టు పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా అనుమానస్పద మృతిపై స్వతంత్ర సంస్థచే దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన అన్ని పిటిషన్లు ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని ఉన్నాయని మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీని యర్ అడ్వకేట్ ముకుల్ రోహత్‌గీ మాట్లాడుతూ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో బిజెపి అధ్యక్షుడు అమిత్ షాకు విముక్తికి వ్యతిరేకంగా ఎందుకు అప్పీ ల్ ఫైల్ చేయలేదని సిబిఐను అనేక మంది న్యాయవాదులు, పిటిషనర్లు ప్రశ్నించారని అన్నారు. దాఖలైన పలు పిటిషన్లపై ఉత్తర్వులు ఇవ్వ ను న్నట్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రాచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఆరోపణల్ని నిరూపించగలరా?

పవన్‌కు చంద్రబాబు సవాల్



అమరావతి: గుంటూరులో ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ సభలో మంత్రి నారా లోకేశ్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అవినీతి ఆరోపణలు అర్థరహితమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆ ఆరోపణలు చేసేవాళ్లు వాటిని నిరూపించగలరా? అని ప్రశ్నించారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. డబ్బే కావాలనుకుంటే లోకేశ్ హెరిటేజ్ చూసుకుంటే సరిపోతుందని, వ్యాపారాలతో ఏడాదికి రూ.65 కోట్లు మిగిలేదన్నారు. ప్రజాసేవ కోసమే లోకేశ్ రాజకీయాల్లోకి వచ్చారని సీఎం స్పష్టంచేశారు. లోకేశ్‌ను చిన్నప్పుడు తాను అర్ధరాత్రి తర్వాతే చూసేవాడినని, ఇప్పుడు దేవాన్ష్‌ను వారానికి ఒక్క రోజు మాత్రమే చూసుకొనే పరిస్థితి లోకేశ్‌ది అని చంద్రబాబు చెప్పారు.విభజన హామీల్లో భాగంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధు ల లెక్కలను పరిశీలించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటుచేసిన జేఎఫ్‌సీపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఆ కమిటీనే ఓ తప్పన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు అడగకుండా మధ్యవర్తులుగా ఉంటామనడానికి వీరెవరని సీఎం ప్రశ్నించారు. ఎన్డీయేలో ఉన్నంత వరకు ఇతర పార్టీలతో మాట్లాడేందుకు తమకు ఇబ్బందులు ఉండేవని, ఇక తనకు ఏ మొహమాటాలూ లేవన్నారు. అన్ని జాతీయ పార్టీలను కలుపుకొని వెళ్తానని సీఎం స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తన లక్ష్యమని చంద్రబాబు మరోసారి స్పష్టంచేశారు. ప్రాంతీయ పార్టీలు ఉండకూడదనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చని కేంద్రంపై అవిశ్వాసం ఎన్డీయేలో ఉండి పెట్టడం అనైతికత కాబట్టే, దాన్నుంచి వెంటనే బయటకు వచ్చి పెట్టామని సీఎం వివరించారు. ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల కోసం రెండు నెలల నుంచి వైసిపి అవిశ్వాసం అంటున్నా ఏ ఒక్క పార్టీ ముందుకు రాలేదని చంద్రబాబు అన్నారు. పీఎంవో చుట్టూ చక్కర్లు కొట్టే అవిశ్వాసాన్ని ఎవరూ నమ్మలేదన్నారు. తాను ఏ పార్టీలతో మాట్లాడకపోయినా టిడిపి అవిశ్వాసం పెట్టగానే అనేక పార్టీలు మద్దతు ఇచ్చేందుకు ముందుకొచ్చాయ న్నారు. అది జాతీయ పార్టీలకు టిడిపి పట్ల ఉన్న విశ్వసనీయత అని చంద్రబాబు అన్నారు.

ఇద్దరితో కేంద్రం డ్రామా


ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతో కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డితో ఒక డ్రామా.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో ఇంకో డ్రామా ఆడుతుందని ధ్వజమెత్తారు. అ విశ్వాసం, రాజీనామాలతో జగన్ ద్వారా దీక్షతో పవన్ కల్యాణ్ ద్వారా ప్రత్యేక హోదా ఇవ్వాలని బిజెపి కుట్ర చేస్తోందన్నారు. బిజెపి, వైసిపి, జనసేన డ్రామాలన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. తగిన సమయంలో ప్రతిపక్షాలకు గుణపాఠం చెబుతానని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా మహాకుట్ర జరుగుతోందని, దోషులను వదిలిపెట్టమని,..ప్రజాకోర్టులో నిలబెడతామని తెలిపారు. ప్రజా ప్రయోజనాలే తమకు ముఖ్యమని రాష్ట్రానికి న్యాయం చేయాలన్నదే తమ డిమాండ్ అని చెప్పారు. గతంలో టిడిపినిరాజకీయంగా దెబ్బతీయడానికే రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజించిందని మండిపడ్డారు. నేడు టిడిపిని దెబ్బతీసేందుకు రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేస్తోందన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రం (టిఎస్‌కెసి) ఆధ్వర్యంలో ఉపాధి కల్పన నైపుణ్యాలపై ఖైరతాబాద్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు (ఈ నెల 14,16న) ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో ప్రజెంటేషన్ స్కిల్స్ అంశంపై డా.ఎం.వాణి, ఆన్‌లైన్ ఎడ్యూకేషన్ రిసోర్సెస్ అంశంపై డా.సాంబశివరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిపరేషన్ ఆఫ్ రెస్యూమ్ ఇంటర్వ్యూ సిల్క్స్ అంశంపై ఎం. నాగరాజు తదితరుల శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా . చంద్రముఖర్జీ, వైస్ ప్రిన్సిపల్ గీతాలక్ష్మి పట్నాయక్, టిఎస్‌కెసి కో ఆర్డినేటర్ ఎస్.రాధిక, సాంబశివరావు, టిఎస్‌కెసి సభ్యులు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాజి రియల్ హీరో... పవన్ రీల్ హీరో : బుద్ధా



హైదరాబాద్: ప్రత్యేక హోదా విషయంలో నటుడు శివాజి రియల్ హీరో అని, జనసేన అధ్య క్షుడు, నటుడు పవన్ కల్యాణ్ రీల్ హీరో అని టిడిపి ఎంఎల్‌సి బుద్ధా వెంకన్న విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రత్యేక హోదా ఉద్యమానికి ఊపిరి పోసింది శివాజేనని ప్రశంసించారు. మొదటి నుంచి ప్రత్యే క హోదా కోసం పోరాడడంతో శివాజి రియల్ హీరోగా మిగిలిపోయారని, హోదా విషయంలో పవన్ మాత్రం విలన్‌గా మారిపోయారని దుయ్యబట్టారు. ఎపి సిఎం చంద్రబాబునాయుడిని కంటనీరు పెట్టించిన ప్రధాని నరేంద్ర మోడీ నాశనమవుతారని ధ్వజమెత్తారు. గుజరాత్ ఊచకోతను ప్రశ్నించినందుకే బాబుపై మోడీ కక్ష కట్టాడన్నారు.

ప్రశ్నార్థకంగా మారిన షమి భవిష్యత్తు!



ముంబయి: భారత స్పీడ్‌స్టర్ మహ్మద్ షమి భవితవ్యంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. షమి ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని అతని భార్య హసిన్ జహాన్ సంచలన ఆరోపణలు చేసిన నేపథ్యంలో భారత క్రికెట్ బోర్డు విచారణకు ఆదేశించింది. తన భర్త షమి ఫిక్సింగ్‌కు పాల్పడి ఉంటాడని హసిన్ చేసిన ఆరోపణలు కలకలం రేకెత్తించాయి. దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బిసిసిఐ విచారణకు నడుంబిగించింది. ఈ ఆరోపణలపై పూర్తిసాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని అవినీతి నిరోధక విభాగం (యాంటీ కరప్షన్ సెక్యూరిటీ) వింగ్ ముఖ్య అధికారి నీరజ్ కుమార్‌ను పాలకమండలి చైర్మన్ వినోద్ రాయ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, దీనిపై నీరజ్ కుమార్ ఇప్పటికే విచారణ చేపట్టారు. ఆయన అందించే రిపోర్టుపైనే షమి భవితవ్యం ఆధారపడి ఉంది. ఒకవేళ షమి ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు రుజువైతే మాత్రం అతని కెరీర్ ఇంతటితో ముగిసినట్టేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఓ మహిళ నుంచి తన భర్త షమి డబ్బులు తీసుకున్నట్టు హసిన్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను భారత క్రికెట్ బోర్డు సీరియస్‌గా తీసుకుంది. షమి వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజుల్లోగా దీనిపై విచారణ పూర్తి చేసి నివేదిక అందజేసేందుకు అవినీతి నిరోధన విభాగం నడుంబిగించింది.

సెమీస్‌లో సింధు

❑ క్వార్టర్స్‌లో ఒకుహరాకు షాక్ ❑ ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: భారత స్టార్, తెలుగుతేజం పి.వి.సింధు ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం నువ్వానేనా అన్నట్టు సాగిన క్వార్టర్ ఫైనల్ సమరంలో సింధు 20–22, 21–18, 21–18 తేడాతో జపాన్ క్రీడాకారిణి ఒకుహరాను ఓడించింది. దాదాపు గంటన్నర సేపు వరకు సాగిన ఉత్కంఠ సమరంలో సింధు చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ప్రారంభం నుంచే ఇద్దరు సర్వం ఒడ్డి పోరాడారు. ప్రతి పాయింట్ కోసం హోరాహోరీ తప్పలేదు. తొలి గేమ్‌లో ఒక దశలో సింధు పైచేయి సాధించింది. కానీ, కీలక సమయంలో ఒకుహరా పుంజుకుంది. తనకు మాత్రమే సాధ్యమయ్యే షాట్లతో సింధును ఉక్కిరిబిక్కిరి చేస్తూ సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా పోరు నువ్వానేనా అన్నట్టుగానే సాగింది. ఇద్దరు కూడా ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. వరుసగా పాయింట్లు సాధిస్తూ లక్ష్యం వైపు నడిచారు. కానీ, కీలక సమయంలో సింధు పుంజుకుంది. ప్రత్యర్థి బలహీనతలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ పైచేయి సాధించింది. ఇదే క్రమంలో సెట్‌ను దక్కించుకుంది. ఇక, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో కూడా అదే ఉత్కంఠ పోరు సాగింది. ఆధిపత్యం తరచు చేతులు మారుతూ వచ్చింది. అయితే సింధు మెరుగైన ఆటతో ఒకుహరాను కంగుతినిపించింది. ఇదే క్రమంలో సెట్‌ను గెలిచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. కాగా, ఈ టోర్నమెంట్‌లో సింధు సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం.



ఫెదరర్, కొరిక్ ముందంజ





ఇండియన్‌వెల్స్ మాస్టర్స్ టోర్నీ

కాలిఫోర్నియా: ప్రతిష్టాత్మకమైన ఇండియన్‌వెల్స్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ రోజర్ ఫెదరర్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మరోవైపు క్రొయేసియా సంచలనం బొర్నా కొరిక్ కూడా క్వార్టర్ ఫైనల్లో విజయం సాధించి ఫెదరర్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. ఇక, దక్షిణాఫ్రికా స్టార్, ఏడో సీడ్ కెవిన్ అండర్సన్, దక్షిణ కొరియా ఆశాకిరణం హ్యాన్ చంగ్ క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టారు. హ్యాన్ చంగ్‌తో జరిగిన పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్ 7–5, 6–1తో విజయం సాధించాడు. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన ఫెదరర్ ఏ దశలోనూ చుంగ్‌ను కోలుకోనివ్వలేదు. చూడచక్కని షాట్లతో చెలరేగిన ఫెదరర్ వరుసగా రెండు సెట్లను గెలిచి సెమీస్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. తొలి సెట్‌లో ఫెదరర్‌కు ప్రత్యర్థిని తీవ్ర ప్రతిఘటనే ఎదురైంది. టైబ్రేకర్ వరకు వెళ్లిన సెట్‌లో ఫెదరర్ విజయం సాధించాడు. కీలక సమయంలో చుంగ్ ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో వరుసగా తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో సఫలమైన ఫెదరర్ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక, రెండో సెట్ ప్రారంభం నుంచే ఫెదరర్ దూకుడుగా ఆడాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా లక్ష్యం దిశగా సాగాడు. ఈ క్రమంలో వరుసగా గేమ్‌లు గెలుచుకుంటూ సెట్‌ను మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

అండర్సన్‌కు షాక్...

మరోవైపు దక్షిణాఫ్రికా స్టార్, ఏడో సీడ్ కెవిన్ అండర్సన్‌కు క్వార్టర్ ఫైనల్లోనే చుక్కెదురైంది. క్రొయేసియా సంచలనం బొర్నా కొరిక్ క్వార్టర్ ఫైనల్లో కెవిన్‌పై సంచలన విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన పోరులో కొరిక్ 2–6, 6–4, 7–6తో విజయం సాధించాడు. కొరిక్ కెరీర్ అత్యుత్తమ విజయాల్లో ఇదొకటిగా చెప్పుకోవచ్చు. తొలి సెట్‌లో అండర్సన్ ఆధిపత్యం చెలాయించాడు. అద్భుత షాట్లతో కొరిక్‌ను హడలెత్తించాడు. కళ్లు చెదిరే షాట్లతో విరుచుకుపడ్డ అండర్సన్ సునాయాసంగా సెట్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే తర్వాతి సెట్‌లో కొరిక్ దూకుడును పెంచాడు. అద్భుత షాట్లతో కెవిన్‌ను కోర్టు నలుమూలలా చక్కర్లు కొట్టించాడు. కొరిక్ దూకుడుగా ఆడడంతో కెవిన్ ఒత్తిడికి గురయ్యాడు. ఇదే సమయంలో వరుస తప్పిదాలకు సైతం పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న కొరిక్ సెట్‌ను దక్కించుకున్నాడు. ఇక, ఫలితాన్ని తేల్చే మూడో సెట్‌లో ఇద్దరు సర్వం ఒడ్డి పోరాడారు. దీంతో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లింది. దీనిలో కొరిక్ పైచేయి సాధించాడు. చివరి వరకు ఆధిపత్యాన్ని కాపాడుకోవడంలో సఫలమైన కొరిక్ సెట్‌ను గెలిచి సెమీస్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో స్విస్ దిగ్గజం ఫెదరర్‌తో తలపడుతాడు.

లంక ఆశలు ఆవిరి

❑ చెలరేగిన మహ్మదుల్లా ❑ భారత్‌తో ఫైనల్ పోరుకు బంగ్లాదేశ్

కొలంబో: సొంత గడ్డపై జరుగుతున్న నిదహాస్ ముక్కోణపు ట్వంటీ–20 టోర్నమెంట్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు ఫైనల్‌కు చేరకుండానే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన కీలక మ్యాచ్‌లో బంగ్లాదేశ్ రెండు వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో బంగ్లాదేశ్ తలపడుతుంది. సొంతగడ్డపై జరుగుతున్న టోర్నమెంట్‌ల ఆతిథ్య లంక ఫైనల్‌కు చేరడంలో విఫలమైంది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో లంక, బంగ్లాదేశ్‌లు నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. అయితే కీలక దశలో ఒత్తిడికి గురి కావడంతో లంకకు ఓటమి తప్పలేదు. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మరో బంతి మిగిలివుండగానే 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. టోర్నీలో అద్భుత ఫాంలో ఉన్న ఓపెనర్ లిటన్ దాస్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అయితే మరో ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ తన జోరును కొనసాగించాడు. లంక బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ ముందుకు సాగాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన తమీమ్ 42 బంతుల్లో 4ఫోర్లు, రెండు సిక్సర్లతో 50 పరుగులు చేశాడు. సీనియర్ ఆటగాడు ముష్ఫికుర్ రహీం మరోసారి జట్టుకు అండగా నిలిచాడు. సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. రహీం రెండు ఫోర్లతో 28 పరుగులు చేశాడు. మరోవైపు స్టార్ ఆటగాడు మహ్మదుల్లా చివర్లో లంక బౌలర్లను హడలెత్తించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మహ్మదుల్లా జోరును కొనసాగించాడు. ఒత్తిడిలోనూ ధాటిగా ఆడుతూ జట్టును గెలిపించాడు. చిరస్మరణీయ బ్యాటింగ్‌ను కనబరిచిన మహ్మదుల్లా 18 బంతుల్లోనే రెండు భారీ సిక్సర్లు, మరో మూడు ఫోర్లతో అజేయంగా 43 పరుగులు చేసి జట్టును ఫైనల్‌కు చేర్చాడు. చివరి ఓవర్‌లో బంగ్లాకు 12 పరుగులు అవసరం కాగా మహ్మదుల్లా అద్భుత ఇన్నింగ్స్‌తో దాన్ని సాధించాడు. టోర్నీలో లంకకు ఇది వరుసగా మూడో ఓటమి కావడం విశేషం.



అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లంకను వికెట్ కీపర్ కుశాల్ పెరీరా, కెప్టెన్ తిసార పెరీరా ఆదుకున్నారు. ఒక దశలో 41 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్న లంకను కుశాల్ గట్టెక్కించాడు. ధాటిగా ఆడిన కుశాల్ ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 61 పరుగులు చేశాడు. మరోవైపు చివర్లో తిసార చెలరేగి ఆడాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన తిసార 37 బంతుల్లో 3ఫోర్లు, మరో మూడు సిక్సర్లతో 58 పరుగులు సాధించాడు. ఇదే క్రమంలో కుశాల్‌తో కలిసి ఆరో వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. దీంతో లంక స్కోరు 159కి చేరింది.



కివీస్ మహిళలకు రెండో విజయం

విండీస్‌తో టి–20 సిరీస్



మౌంట్ మౌంగనూయి: విండీస్‌తో జరుగుతున్న ట్వంటీ–20 సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ మహిళా క్రికెట్ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కివీస్ 106 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన కివీస్ 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన విండీస్ నిర్ణీత ఓవర్లలో ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 79 పరుగులు మాత్రమే చేసి ఘోర పరాజయాన్ని చవిచూసింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన విండీస్‌ను కివీస్ బౌలర్లు ప్రారంభం నుంచే హడలెత్తించారు. ఓపెనర్ హిలీ మాథ్యూస్ ఐదు పరుగులు మాత్రమే చేసి వెనుదిరిగింది. వన్‌డౌన్‌లో వచ్చిన స్టఫాని టైలర్ (1) కూడా నిరాశ పరిచింది. మరో ఓపెనర్ మెరిసా అంజెలికా కూడా నిరాశ పరిచింది. రెండు ఫోర్లతో 16 పరుగులు చేసి వికెట్‌ను చేజార్చుకుంది. తర్వాత విండీస్ మళ్లీ కోలుకోలేక పోయింది. కివీస్ బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. అంతేగాక పొదుపుగా బౌలింగ్ చేస్తూ పరుగుల వేగాన్ని అడ్డుకున్నారు. దీంతో విండీస్ ఏదశలోనూ లక్ష్యాన్ని ఛేదించే విధంగా కనిపించలేదు. కిషోనా నైట్ 20 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. కివీస్ బౌలర్లలో సోఫి డివైన్ 12 పరుగులకే మూడు వికెట్లు పడగొట్టింది. కాస్పరెక్ కూడా పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకుంది.

చెలరేగిన మార్టిన్, సాటర్‌వైట్..: అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్ సోఫి డివైన్ మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో వేగంగా 27 పరుగులు చేసింది. కెప్టెన్ సుజి బేట్స్ రెండు బౌండరీలతో 14 పరుగులు సాధించాడు. మరోవైపు స్టార్ క్రికెటర్లు సాటర్‌వైట్, కాటె మార్టిన్‌లు విధ్వంసక బ్యాటింగ్‌తో విండీస్ బౌలర్లను హడలెత్తించారు. చెలరేగి ఆడిన మార్టిన్ 42 బంతుల్లోనే 11 ఫోర్లతో 65 పరుగులు సాధించింది. మరోవైపు విధ్వంసక బ్యాటింగ్‌ను కనబరిచిన సాటర్‌వైట్ రెండు సిక్సర్లు, మరో 9 బౌండరీలతో 42 బంతుల్లోనే 71 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. దీంతో కివీస్ 185 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. కాగా, సాటర్‌వైట్, మార్టిన్ మూడో వికెట్‌కు 124 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.



జింబాబ్వే ఘన విజయం

ప్రపంచకప్ అర్హత టోర్నీ

హరారే: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం జరిగిన సూపర్ సిక్స్ మ్యాచ్‌లో జింబాబ్వే 107 పరుగుల భారీ తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించిన మ్యాచ్‌లో జింబాబ్వే స్వల్ప లక్ష్యాన్ని సైతం కాపాడుకొని అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. తర్వాత స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఐర్లాండ్ ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తట్టుకోలేక కేవలం 104 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. కష్ట సాధ్యం కానీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఐర్లాండ్‌కు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ విలియమ్ పోర్టర్‌ఫీల్డ్ ఏడు పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఆండ్రూ బాల్బిమి (2) కూడా నిరాశ పరిచాడు. ఆ వెంటనే మరో స్టార్ జోయ్స్ కూడా వెనుదిరిగాడు. అతను ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. తర్వాత వచ్చిన వికెట్ కీపర్ నీల్ ఓబ్రియాన్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. 8 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు. మరోవైపు జట్టును ఆదుకుంటాడని భావించిన సీనియర్ ఆటగాడు కెవిన్ ఓబ్రియాన్ కూడా నిరాశే మిగిల్చాడు. ఏడు పరుగులు మాత్రమే చేసి సీన్ విలియమ్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ పోరాటం కొనసాగించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన స్టిర్లింగ్ ఐదు ఫోర్లతో 41 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. కాగా, ఐర్లాండ్ జట్టులో ఇద్దరు మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నాడు. స్టిర్లింగ్ టాప్ స్కోరర్‌గా నిలువగా గారి విల్సన్ 15 పరుగులు సాధించాడు. జింబాబ్వే బౌలర్లలో టెండయి చిసారొ ప్రారంభంలోనే కీలకమైన మూడు వికెట్లు తీసి ఐర్లాండ్‌కు కోలుకోలేని దెబ్బతీశాడు. కెప్టెన్ క్రీమర్ కూడా మూడు వికెట్లు తీసి తనవంతు పాత్ర పోషించాడు.

ఆదుకున్న సికందర్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే కూడా ప్రారంభంలోనే తడబడింది. ధాటిగా ఆడిన ఓపెనర్ క్యాపస్ జువావో రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 20 పరుగులు చేసి ఔటయ్యాడు. మరో ఓపెనర్ సొలొమన్ మైర్ 11 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. స్టార్ ఆటగాడు హామిల్టన్ మసకద్జా కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. 18 పరుగులకే ఔటయ్యాడు. దీంతో జింబాబ్వే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో కెప్టెన్ బ్రెండన్ టైలర్ జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించాడు. అయితే 28 పరుగులు చేసి టైలర్‌ను మెక్ బ్రయిన్ వెనక్కి పంపాడు. కాగా, చివర్లో సికందర్ రజా అద్భుత బ్యాటింగ్‌తో జింబాబ్వేను ఆదుకున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న రజా 83 బంతుల్లో మూడు సిక్సర్లు, మరో నాలుగు ఫోర్లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో జింబాబ్వే స్కోరు 211కి చేరింది. ఐర్లాండ్ బౌలర్లలో టీమ్ ముర్తాగ్ మూడు, మెక్ బ్రయిన్ రెండు వికెట్లు పడగొట్టారు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.